www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI





ఆదివారం | 11-2-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 297 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 9.09 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం సా. 5.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 11.20-12.45; దుర్ముహూర్తం: సా. 4.41-5.26; అమృతఘడియలు: ఉ. 11.20-12.44; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్



చిన్న కారు చిన్నబోయే..!

గత ఏడాదిలో 0.3 శాతానికి పడిపోయిన మార్కెట్ వాటా

న్యూఢిల్లీ: గడిచిన కొన్నేళ్లుగా మారుతి ఆల్టో వంటి చిన్న కారుకు డిమాండ్ భారీగా తగ్గుతూ వస్తోంది. తాజా నివేదికల ప్రకారం.. రూ.5 లక్షల లోపు విలువైన కార్ల మార్కెట్ వాటా 2015లో 33.6 శాతంగా ఉండగా.. గత ఏడాదిలో ఏకంగా 0.3 శాతానికి పడిపోయింది. కొనుగోలుదారులు సన్ రూఫ్ వంటి హంగులతో పాటు ఆధునిక సాంకేతికత, భద్రత ఫీచర్లు కలిగిన హై ఎండ్ మోడళ్ల వైపే మొగ్గు చూపుతుండటంతో చిన్న కార్లు ఆదరణ కోల్పోయాయి. వాహన తయారీలో ఉపయోగించే కమోడిటీల ధరలు భారీగా పెరగడంతో పాటు ప్రభుత్వం భద్రత ప్రమాణాలను పెంచడం కూడా ఈ విభాగ కార్ల విక్రయాలకు పరోక్షంగా గండికొట్టాయి. స్మాల్ కార్ సెగ్మెంట్లో ప్రస్తుతం మారుతి సుజుకీ ఆల్టో, రెనో క్విడ్ మాత్రమే మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

65 శాతం పెరిగిన ధరలు

గడిచిన ఐదేళ్లలో రూ.5 లక్షల లోపు విలువైన కార్ల ధరలు ఏకంగా 65 శాతం పెరగగా.. సెడాన్‌లు, ఎస్‌యూవీలు, లగ్జరీ కార్ల రేట్లు మాత్రం 24 శాతం వరకు పెరిగాయి. చిన్న కార్ల ధరలు పెరిగినంత వేగంగా ఆ సెగ్మెంట్ కస్టమర్ల ఆదాయాలు పెరగకపోవడం కూడా విక్రయాలపై ప్రభావం చూపిందని మార్కెట్ పరిశోధక సంస్థ జాటో డైనమిక్స్ ప్రెసిడెంట్ రవి భాటియా అన్నారు. కార్ల ధరలతో పాటు వాటి నిర్వహణ ఖర్చులు సైతం గణనీయంగా పెరిగాయన్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లతో పాటు సర్వీస్, మరమ్మతు చార్జీలు, విడిభాగాలు, టైర్ల ధరలు కూడా అనూహ్యంగా పెరగడంతో మధ్యతరగతి వర్గంలో చాలామంది కారు కొనగలిగే స్తోమత ఉన్నప్పటికీ నిర్వహణ వ్యయాలకు భయపడి నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.



ఆధునిక ఫీచర్లపై ఆసక్తి

కరోనా సంక్షోభం తర్వాత అల్పాదాయ వర్గాల రాబడి మరింత తగ్గడం చిన్న కార్ల డిమాండ్‌పై ప్రభావం చూపిందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) శశాంక్ శ్రీవాస్తవ అన్నారు. ప్రస్తుత కారు కొనుగోలుదారుల్లో చాలా మంది బేస్ వేరియంట్ల కంటే కనెక్టివిటీ, పెద్ద ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఎస్‌యూవీ డిజైన్, 360 డిగ్రీస్ కెమెరా, సన్ రూఫ్ వంటి ఆధునిక ఫీచర్లున్న మోడళ్లనే ఇష్టపడుతున్నారని ఆయన అన్నారు. ఇందుకోసం అధిక మొత్తంలో చెల్లించేందుకూ వెనుకాడట్లేదన్నారు. దాంతో రూ.10 లక్షలకు పైగా విలువ చేసే కార్ల మార్కెట్ వాటా 2015లో కేవలం 12.5 శాతంగా ఉండగా.. 2023 చివరినాటికి దాదాపు నాలుగు రెట్లు పెరిగి 46 శాతానికి చేరుకుందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్నవి ఈ విభాగ కార్లేనని శ్రీవాస్తవ అన్నారు. అయితే, వాహన తయారీ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కార్ల కంపెనీలు కూడా అధిక లాభాల మార్జిన్లు పంచగలిగే హై ఎండ్ మోడళ్లపైనే ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయని రవి భాటియా అన్నారు.

దివీస్ లాభం రూ.358 కోట్లు

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికాని (క్యూ3)కి దివీస్ లేబొరేటరీస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 17 శాతం వృద్ధితో రూ.358 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి లాభం రూ.306 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో కంపెనీ ఆదాయం 8.6 శాతం వృద్ధితో రూ.1,855 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికానికి రాబడి రూ.1,708 కోట్లుగా ఉంది. క్యూ3లో కంపెనీ వ్యయాలు సైతం 5 శాతం పెరిగి రూ.1,461 కోట్లకు చేరుకున్నాయి. కాగా, ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు గాను దివీస్ లాబ్స్ రూ.5,804 కోట్ల ఆదాయంపై రూ.1,062 కోట్ల లాభాన్ని గడించింది.

- గ్రో మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్‌ను విడుదల చేసింది. మదుపరులకు మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్-టీఆర్ఐ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 23. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో నెలకు కనీసం రూ.100 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది.
- ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. ఎల్ఐసీ ఎంఎఫ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఈటీఎఫ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 టోటల్ రిటర్న్ ఇండెక్స్ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 12.

తమిళనాడులో ప్లాంట్ ఏర్పాటు

భారత్‌లోకి టెస్లా ప్రత్యర్థి విన్‌ఫాస్ట్



న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా కంటే ముందే తన ప్రత్యర్థి సంస్థ విన్‌ఫాస్ట్ భారత మార్కెట్లోకి ప్రవేశించబోతోంది. తమిళనాడులోని తూత్తుకూడిలో 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.16,600 కోట్లు) పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఈ నెల 25న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. ఇక్కడ కంపెనీ కిట్ అసెంబ్లింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దేశవ్యాప్తంగా డీలర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రీమియం ఈవీల సెగ్మెంట్లో టెస్లా మోడళ్ల కంటే చవకగా వాహనాలను అందుబాటులోకి తేనున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ కంపెనీ కాంపాక్ట్ ఎస్‌యూవీ క్రాసోవర్ వీఎఫ్ ఈ-34తోపాటు పెద్ద ఎస్‌యూవీ మోడళ్లయిన వీఎఫ్ ఈ-36, వీఎఫ్ 7ను తొలుత మన మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాలున్నాయి. వియత్నాం కార్పొరేట్ దిగ్గజం విన్‌గ్రూప్ 2017లో విన్‌ఫాస్ట్ ఆటో కంపెనీని ప్రారంభించింది. 2021లో ఈ కంపెనీ ఈవీల తయారీలోకి ప్రవేశించింది. విన్‌ఫాస్ట్ చాలా చిన్న కంపెనీ అయినప్పటికీ, అమెరికన్ మార్కెట్లో 50 శాతానికి పైగా వాటా కలిగిన టెస్లానే తన ప్రత్యర్థిగా ప్రకటించుకుంది. యూఎస్‌లోని నార్త్ కరోలినాలో ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తోంది. 2021 నుంచి ఇప్పటివరకు విన్‌ఫాస్ట్ ప్రపంచవ్యాప్తంగా 42,291 యూనిట్ల ఈవీలను విక్రయించింది. అందులో 34,855 యూనిట్ల విక్రయాలు గత ఏడాదిలో జరిగాయి.

విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌తో జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా మిస్సైల్స్, శాటిలైట్స్ ప్రయోగంలో ఉపయోగించే వాల్యూ-యాడెడ్ ఉత్పత్తుల తయారీని జిందాల్ చేపట్టనుంది. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో కీలకమైన పరికరాల అభివృద్ధి, తయారీకి ఈ ఒప్పందం దోహదపడనుంది.

- **ఎన్ఎస్ఈ ఆదాయం రూ.3,517 కోట్లు**

న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,975 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఈ కాలంలో సంస్థ ఆదాయం రూ.3,517 కోట్లుగా ఉంది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను ఎన్ఎస్ఈ ప్రభుత్వానికి రూ.28,131 కోట్ల మొత్తాన్ని అందించింది. ఇందులో రూ.23,137 కోట్లు సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్ కాగా ఆదాయ పన్ను రూ.1,490 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1,456 కోట్లు, జీఎస్టీ రూ.1,257 కోట్లు, సెబీ చార్జీలు రూ.791 కోట్లుగా ఉన్నాయి. ట్రేడింగ్ వాల్యూమ్ ప్రకారం ఈ కాలంలో ఎన్ఎస్ఈ సగటున రోజుకు రూ.80,512 కోట్ల ట్రేడ్ వాల్యూమ్స్‌ను చేపట్టింది.

త్వరలో మరిన్ని జెనరిక్ ఔషధాలు

- ఇప్పటికే 450కి పైగా ఔషధాల విక్రయం
- స్టోర్ జెనరిక్స్ కాన్సెప్ట్‌ను ప్రారంభించిన మెడ్‌ప్లస్


మెడ్‌ప్లస్ ఎండీ మధుకర్ రెడ్డి

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రిటైల్ ఫార్మసీ చెయిన్ మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ జెనరిక్ ఔషధాలకు మరింతగా ప్రాచుర్యం కల్పించేందుకు స్టోర్ జెనరిక్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా సుమారు 600కు పైగా పేటెంట్ థెరాప్యుటిక్, కీలకమైన ఔషధాలను కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ భాగస్వాముల ద్వారా తీసుకోనుంది. మెడ్‌ప్లస్ బ్రాండ్ పేరుతో ఈ ఔషధాలను తన రిటైల్ ఫార్మసీల ద్వారా విక్రయించనుంది. ఈ జెనరిక్ ఔషధాల్లో రక్తపోటు, మధుమేహం, హృద్రోగ వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధుల్లో ఉపయోగించే ప్రిస్క్రిప్షన్ ఔషధాలతో పాటు ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) ఔషధాలు ఉన్నాయని మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండీ, సీఈఓ గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. దేశంలోని అన్ని ప్రధాన ఫార్మా కంపెనీలకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో జెనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రాక్ట్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ (సీడీఎంఓ)ల నుంచి తాము కూడా ఔషధాలను పొందుతున్నట్లు ఆయన చెప్పారు. సీడీఎంఓల నుంచి నేరుగా జెనరిక్ ఔషధాలను పొందుతుండటంతో మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ వ్యయాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. దీంతో తమ ఫార్మసీ రిటైల్ నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తున్న ఈ ఔషధాలపై 60 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు మధుకర్ తెలిపారు. కాగా బ్రాండెడ్ జెనరిక్స్‌పై 20 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు.

అకుమ్స్ ఫార్మాతో జట్టు: జెనరిక్ ఔషధాల కోసం హరిద్వార్ కేంద్రంగా ఉన్న అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌తో పాటు విండ్‌లాస్ బయోటెక్, హెటిరో కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మధుకర్ వెల్లడించారు. ఈ కంపెనీలు యూరోపియన్ యూనియన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాలకు అనుగుణంగా ఔషధాలను తయారు చేస్తాయని వివరించారు. మొత్తం జెనరిక్ ఔషధాల్లో అకుమ్స్ ఫార్మా సరఫరా చేసే ఔషధాల వాటా 70 శాతం వరకు ఉండనుందన్నారు. కాగా త్వరలోనే ఈ ఔషధాల పోర్టుఫోలియోను 800కు చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. గత ఏడాది జూన్ నుంచి తెలంగాణలో పైలెట్ ప్రాతిపదికన ఈ జెనరిక్ ఔషధాల విక్రయాలను ప్రారంభించామని, ఆ తర్వాత దశలవారీగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు విస్తరించినట్లు మధుకర్ చెప్పారు. ప్రస్తుతం పదికి పైగా రాష్ట్రాల్లో మెడ్‌ప్లస్ 4,200 ఫార్మసీ స్టోర్లను నిర్వహిస్తోంది.

అదరగొట్టిన అరబిందో ఫార్మా

- క్యూ3 లాభంలో 90% వృద్ధి
- రూ.936 కోట్లుగా నమోదు
- ఒక్కో షేరుకు 150% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్: అరబిందో ఫార్మా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికాని (క్యూ3)కి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా 90.6 శాతం వృద్ధి చెంది రూ.936.20 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.491.20 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల ఆదాయం కూడా రూ.6,407 కోట్ల నుంచి రూ.7,351.70 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో అమెరికా ఫార్ములేషన్స్ వ్యాపారం 28.9 శాతం వృద్ధి చెంది రూ.3,756 కోట్లకు చేరుకుందని అరబిందో తెలిపింది. అలాగే యూరప్ వ్యాపారం 1.6 శాతం వృద్ధితో రూ.1,728 కోట్లుగా నమోదైందని పేర్కొంది. ఇదే కాలంలో యాంటీ రిట్రోవైరల్ (ఏఆర్‌వీ) ఆదాయం రూ.627 కోట్లు, ఏపీఐ రెవెన్యూ రూ.1,022 కోట్లుగా ఉందని తెలిపింది. ఈ కాలంలో కంపెనీ ఆర్ అండ్ డీ కార్యకలాపాల కోసం రూ.398 కోట్లు వెచ్చించింది. డిసెంబరు త్రైమాసికంలో నిర్వహణాపరంగా మంచి పనితీరును కనబరచటంతో మెరుగైన ఫలితాలను నమోదు చేసిందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు. కీలకమైన ప్రాజెక్టులను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావటంతో పాటు ఔషధాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా రానున్న రోజుల్లో మరింత వృద్ధిని సాధించవచ్చని విశ్వసిస్తున్నట్లు ఆయన చెప్పారు. త్రైమాసిక కాలంలో యూఎస్ ఎఫ్‌డీఏ నుంచి 7 స్పెషాలిటీ, ఇంజెక్టబుల్ ఉత్పత్తులు సహా మొత్తం 16 అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్స్ (అండా)కు తుది అనుమతులు లభించాయని అరబిందో ఫార్మా తెలిపింది. కాగా త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 150 శాతం (రూ.1.5) మధ్యంతర డివిడెండ్‌కు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	76,500 ▲
ముంబై	62,624 ▲	57,364 ▲	70,638 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
11వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	122	విజయవాడ	127
వరంగల్	122	గుంటూరు	127
కరీంనగర్	122	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	133
కర్నూలు	122	నెల్లూరు	133
విశాఖపట్నం	122	అనంతపురం	127
గోదావరి	127		

స్పోర్ట్స్




విరాట్, శ్రేయాస్ దూరం

పేసర్ ఆకాశ్ దీప్‌నకు చోటు


జడేజా, సిరాజ్, రాహుల్ పునరాగమనం

మిగిలిన మూడు టెస్టులకు భారత జట్టు

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఇప్పటికే రెండు టెస్టులు ముగిసిన ఈ సిరీస్‌లో మిగిలిన మూడు మ్యాచ్‌ల కోసం సెలెక్టర్లు 17 మందితో కూడిన జట్టును శనివారం ప్రకటించారు. అయితే ఇందులో విరాట్ పేరు లేదు. అతడి కెరీర్‌లో స్వదేశంలో జరిగిన ఓ టెస్టు సిరీస్ మొత్తానికి దూరం కావడం ఇదే తొలిసారి. ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో, 23 నుంచి రాంచీలో, మార్చి 7నుంచి ధర్మశాలలో ఈ టెస్టులు జరుగనున్నాయి. వ్యక్తిగత కారణాలతో సిరీస్ ఆరంభానికి ముందు విరాట్ తొలి రెండు టెస్టులకు దూరమవుతున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత తను అందుబాటులో ఉంటాడని అంతా భావించారు. కానీ శుక్రవారం బోర్డుకు తన పరిస్థితిపై కోహ్లీ సమాచారం ఇచ్చాడట. దీంతో అతనిపేరు లేకుండానే జట్టును ప్రకటించారు. కాగా కుటుంబంలోని పరిస్థితుల కారణంగా కోహ్లీ ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉండబోడన్న విషయం సెలెక్టర్లకు ముందే తెలుసునని, దానికి తగ్గట్టే ప్రత్యామ్నాయ ఎంపికలు చేసుకున్నారని బీసీసీఐలోని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఇక గాయాలతో బాధపడుతున్న జడేజా ప్రాతినిధ్యంపైనా సందేహాలు నెలకొన్నా అతడి ఎంపికను పరిగణనలోకి తీసుకున్నారు. రాహుల్ కూడా జట్టులోకి వచ్చాడు. అయితే ఈ ఇద్దరు ఫిట్‌గానే ఉన్నారని వైద్య సిబ్బంది ధ్రువీకరించాల్సివుంటుంది. ఆ తర్వాతే వీరు తుది జట్టులో ఉంటారా? లేదా? అనేది తేలుతుంది.

అయ్యర్‌పై వేటు!

వెన్ను నొప్పితో పాటు గజ్జల్లో గాయంతో శ్రేయాస్ అయ్యర్ బాధపడుతున్నాడని, అతను కూడా సిరీస్‌కు దూరమవుతాడని కథనాలు వినిపించాయి. కానీ అతడి గాయం సిరీస్‌కు దూరమయ్యేంత సీరియస్ కాదని, శ్రేయా‌స్‌ను సెలెక్టర్లే పక్కనబెట్టారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే క్రికెట్ బోర్డు కూడా అతడి గాయానికి సంబంధించి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. దీంతో ఈ సిరీస్‌లో విఫలమైన అయ్యర్‌పై వేటు వేశారనే అంతా భావిస్తున్నారు. ముందు ముందు కూడా అతనని టెస్టు జట్టులోకి తీసుకోవడం కష్టమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొత్త కుర్రాళ్లు రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్ తమ స్థానాలను కాపాడుకున్నారు.


ఆకాశ్‌దీప్

ఆకాశ్‌దీప్ వచ్చేశాడు

బెంగాల్ క్రికెటర్ 27 ఏళ్ల ఆకాశ్ దీప్‌నకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కింది. అవేశ్ ఖాన్‌ను రంజీల కోసం విడుదల చేయడంతో సెలెక్టర్లు ఆకాశ్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. తను 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 103 వికెట్లు తీయగా, ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌పై భారత్ 'ఎ' తరఫున 13 వికెట్లతో ఆకట్టుకున్నాడు. అయితే బుమ్రా, సిరాజ్ పేస్ బాధ్యతలు తీసుకోనుండడంతో అతడికి తుది జట్టులో చోటు కష్టమే. అలాగే జడేజా రాకతో లెఫ్టామ్ స్పిన్నర్ సౌరభ్ కుమార్‌ను తప్పించారు.

భారత జట్టు

రోహిత్ (కెప్టెన్), బుమ్రా, జైస్వాల్, గిల్, రాహుల్, జడేజా, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (కీపర్), కేఎస్ భరత్ (కీపర్), అశ్విన్, అక్షర్, సుందర్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్.



ఫైనల్లో నిఖత్, అమిత్

- మరో నలుగురు కూడా
- స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీ

సోఫియా (బల్గేరియా): స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్, కామన్వెల్త్ స్వర్ణ పతక విజేత అమిత్ ఫంగల్ సహా మొత్తం ఆరుగురు భారత బాక్సర్లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన మహిళల 50 కిలోల విభాగం సెమీస్‌లో నిఖత్ 5-0తో చుకనోవా జ్లస్టిస్‌లవ (బల్గేరియా)ను మట్టికరిపించింది. ఆదివారం జరిగే స్వర్ణ పోరులో సబీనా బొబొకులోవా (ఉజ్బెకిస్థాన్)తో జరీన్ తలపడనుంది. 66 కిలోల్లో అరుంధతి చౌదరి 5-0తో ట్రిబిలోవా (స్లోవేకియా)పై గెలిచి ఫైనల్ చేరింది. పురుషుల 51 కిలోల సెమీస్‌లో అమిత్ 5-0తో గుమన్ సమీట్ (టర్కీ)పై, 48 కిలోల్లో వరుణ్ సింగ్ 5-0తో ఖెనౌస్సి కామెల్ (అల్జీరియా)పై, 57 కిలోల్లో సచిన్ 4-1తో ఐడర్ (ఉక్రెయిన్)పై గెలిచారు.

శశికాంత్ 'పాంచ్'

- యూపీ 198 ఆలౌట్

విజయనగరం: పేసర్ శశికాంత్ (5/54) ఐదు వికెట్లు తీయడంతో యూపీతో ఎలిట్ గ్రూప్ 'బి' రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఏపీ మొదటి ఇన్నింగ్స్ 261 స్కోరుకు జవాబుగా తొలి ఇన్నింగ్స్ చేపట్టిన యూపీ 198 పరుగులకే కుప్పకూలింది. జ్యూయెల్ (60) అర్ధ శతకం సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఏపీ శనివారం ఆఖరికి వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. దాంతో ఆతిథ్య జట్టు మొత్తంగా 82 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు ఓవర్‌నైట్ 236/4 స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఏపీ మరో 25 పరుగులు చేసి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ రికీ భుయ్ (94) కొద్దిలో సెంచరీ మిస్సయ్యాడు.

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

యువ భారత్ 'సిక్సర్' కొట్టేనా..!



ఆసీస్‌తో తుది సమరం నేడు

టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో టీమిండియా

● ఉదయ్, సచిన్‌పైనే దృష్టి ● అండర్-19 వరల్డ్‌కప్

5 టీమిండియా ఐదుసార్లు విశ్వ విజేతగా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022ల్లో టైటిళ్లు సొంతం చేసుకొంది.

బెనోని: టోర్నీ ఆసాంతం అజేయంగా నిలిచిన డిఫెండింగ్ చాంప్ భారత్.. అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆదివారం జరిగే టైటిల్ సమరంలో బలమైన జట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. కంగారూలు కూడా ఓటమనేదే లేకుండా తుది పోరుకు చేరుకొన్నారు. అయితే, గతేడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఈ రెండు దేశాల సీనియర్ జట్ల మధ్య జరిగిన ఫైనల్లో భారత్‌ను ఓడించి ఆస్ట్రేలియా విశ్వవిజేతగా నిలిచింది. ఆ ఓటమికి బదులు తీర్చుకోవడానికి యువ భారత్‌కు ఇప్పుడు సువర్ణావకాశం లభించింది. టీమిండియా నెగ్గితే తొలిసారి టైటిల్‌ను నిలబెట్టుకోవడంతోపాటు రికార్డుస్థాయిలో ఆరోసారి జూనియర్ వరల్డ్‌కప్ నెగ్గిన జట్టుగా చరిత్ర సృష్టించనుంది. కెప్టెన్ ఉదయ్ సహరన్ సారథ్యంలోని భారత్.. మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. సచిన్ దాస్, అర్షిన్ కులకర్ణి, ఉదయ్, ముషీర్ ఖాన్‌లు టీమిండియా బ్యాటింగ్‌కు మూలస్తంభాలు. లీగ్ దశలో భారత్‌కు తిరుగులేదనిపించినా.. సెమీస్‌లో మాత్రం దక్షిణాఫ్రికా రూపంలో పెను సవాలే ఎదురైంది. టోర్నీలో తొలిసారి ఛేజింగ్ చేసిన టీమిండియా 32/4తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన సమయంలో సహరన్, దాస్ అద్భుత భాగస్వామ్యంతో ఫైనల్‌కు చేర్చారు. కఠిన పరిస్థితులకు ఎదురు నిలిచి విజయం సాధించడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. బౌలింగ్‌లో స్పిన్నర్ సౌమీ పాండే ప్రత్యర్థులను కట్టడి చేస్తుంటే.. పేసర్లు రాజ్ లింబానీ, నమన్ తివారి క్రమం తప్పకుండా వికెట్లను పడగొడుతున్నారు.

ఆసీస్ బలంగానే..: ఆస్ట్రేలియా జట్టు సెమీస్‌లో పాకిస్థాన్ రూపంలో కఠిన పరీక్షను ఎదుర్కొన్నా.. ఉత్కంఠ మధ్య వికెట్ తేడాతో గెలిచింది. బ్యాటింగ్‌లో హ్యారీ డిక్సన్, కెప్టెన్ హగ్ విబ్‌జన్, ఒలివర్ పీక్ రాణిస్తుండగా.. టామ్ స్ట్రాకర్, కాలమ్ విడ్లర్ బంతితో నిలకడైన ప్రదర్శన చేస్తున్నారు. ఈ క్రమంలో సమవుజ్జీలైన భారత్, ఆస్ట్రేలియా మధ్య తుది పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: ఆదర్శ్, అర్షిన్, ముషీర్, ఉదయ్ సహరన్ (కెప్టెన్), మోలియా, సచిన్ దాస్, అవనీష్ (వికెట్ కీపర్), అభిషేక్, నమన్ తివారి, లింబానీ, పాండే.

ఆస్ట్రేలియా: డిక్సన్, సామ్, విబ్‌జన్ (కెప్టెన్), హర్జాస్ సింగ్, ర్యాన్ హిక్స్ (వికెట్ కీపర్), పీక్, క్యాంప్‌బెల్, మక్‌మిలన్, స్ట్రాకర్, మహ్లి బియార్డ్‌మన్, విడ్లర్.

పిచ్/వాతావరణం

విల్లోమూర్ పార్క్ వికెట్ పేసర్లకు అనుకూలం కావడంతో.. ఓ మాదిరి స్కోర్లు నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. ఇక్కడ ఆడిన గత 27 మ్యాచ్‌ల్లో ఛేజింగ్ చేసిన జట్లు 17 నెగ్గాయి. ఆసీస్-పాక్‌తో సెమీస్ పోరు కూడా ఇక్కడే జరిగింది. వర్షం కురిసే అవకాశాలున్నాయి.

3 భారత్, ఆసీస్‌లు ఫైనల్లో తలపడడం టోర్నీ చరిత్రలో ఇది మూడోసారి. 2012, 2018లో కంగారూలను ఓడించిన టీమిండియా విజేతగా నిలిచింది.

ఆస్ట్రేలియా జట్టు 1988, 2002, 2010లో ట్రోఫీలు నెగ్గింది.

5 2016 నుంచి భారత్ తుది పోరుకు చేరడం ఇది వరుసగా ఐదోసారి

సాకేత్ జోడీకి టైటిల్



చెన్నై: చెన్నై ఓపెన్ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను సాకేత్ మైనేని/రామ్‌కుమార్ రామనాథన్ జోడీ గెలుచుకుంది. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో సాకేత్/రామ్‌కుమార్ ద్వయం 3-6, 6-3, 10-5తో తెలుగు కుర్రాడు రిత్విక్ బొల్లిపల్లి/పూనాచ జంటపై విజయం సాధించింది. ఇక సింగిల్స్ ఫైనల్లో సుమిత్ నగాల్ ఇటలీకి చెందిన లుకా నార్డీతో అమీతుమీ తేల్చుకోనున్నాడు. సెమీఫైనల్లో నగాల్ 6-3, 6-4తో సిసినా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేశాడు. మరో సెమీస్‌లో లుకా 6-4, 4-6, 7-6 (6)తో చెన్ సిన్ సెంగ్ (తైపీ)పై కష్టపడి నెగ్గాడు.

టైటాన్స్‌కు 17వ ఓటమి

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్‌లో పేలవ ప్రదర్శన చేస్తున్న తెలుగు టైటాన్స్ 17వ ఓటమిని చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 35-55తో బెంగాల్ వారియర్స్ చేతిలో చిత్తయింది. బెంగాల్ తరఫున నితిన్ కుమార్ సూపర్-10 సాధించాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 44-23తో యు ముంబాను ఓడించింది. నాలుగో స్థానంలో నిలిచిన పైరేట్స్.. ప్లేఆఫ్స్‌కు మరింత చేరువైంది.

ఐపీఎల్‌లో షమార్

లఖ్‌నవూ జట్టులో చేరిక



న్యూఢిల్లీ: వెస్టిండీస్ నయా సంచలన పేసర్ షమార్ జోసెఫ్ ఐపీఎల్‌లోనూ ఆడనున్నాడు. తాజాగా అతడిని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.3 కోట్లకు తీసుకుంది. మార్క్ ఉడ్ స్థానంలో ఎల్ఎస్‌జీ షమార్‌ను ఆడించనుంది. టీ20 వరల్డ్‌కప్‌తో పాటు విండీస్, శ్రీలంకలతో టెస్టు సిరీస్‌ల కారణంగా పేసర్ ఉడ్‌పై పనిభారం పడకూడదని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. అందుకే లీగ్‌కు దూరంగా ఉండాలని సూచించింది. మరోవైపు ఇటీవల ఆసీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో షమార్ ఆడిన రెండు టెస్టుల్లోనే 13 వికెట్లు తీశాడు.

రామ్‌కుమార్‌కు వైల్డ్‌కార్డ్

బెంగళూరు: రామ్‌కుమార్ రామనాథన్‌కు బెంగళూరు ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ మెయిన్ డ్రాలో వైల్డ్‌కార్డ్ ప్రవేశం లభించింది. టోర్నమెంట్ ఈనెల 12న ప్రారంభం కానుంది. ఏటీపీ చాలెంజర్ సర్క్యూట్‌లో ఏడుసార్లు రామ్‌కుమార్ సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 11-2-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

పీఎఫ్ వడ్డీలో స్వల్ప పెరుగుదల

ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.25.. నిర్ధారించిన సీబీటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భవిష్య నిధి ఖాతాదారులకు శుభవార్త. ఆరు కోట్ల మంది ఖాతాదారులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి 8.25 వడ్డీ రేటు చెల్లించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) నిర్ణయం తీసుకుంది. గత మూడేళ్లలో ఇదే అత్యధికం. 2020-21లో 8.5% వడ్డీ రేటు చెల్లించిన ఈపీఎఫ్ఓ 2021-22 సంవత్సరంలో దానిని 8.10% శాతంగా నిర్ణయించింది. 2022-23 సంవత్సరంలో

మిగతా 8వ పేజీలో...



రిటైర్డు ఉద్యోగులకూ ఈఎస్ఐ సేవలు

నిబంధనల సడలింపు


కేంద్ర కార్మిక శాఖ ప్రకటన

హార్సిలీహిల్స్ చేరిన యాత్ర

'యాత్ర-2' చిత్రం బుడిబుడి అడుగులు వేసుకుంటూ థియేటర్లలోకి అడుగు పెట్టింది. అక్కడ బోల్తా కొట్టింది. కానీ.. ఈ 'యాత్ర' అంతటితో ఆగలేదు. అలా అలా వెళ్తూవెళ్తూ 'ఆంధ్రా ఊటీ' హార్సిలీహిల్స్‌లో ఆగిపోయింది. చిత్ర దర్శక-నిర్మాత మహీ వి.రాఘవకు అక్కడ 'లాభం' కార్డు పడుతోంది! సుమారు రూ.20 కోట్ల విలువైన రెండెకరాల సర్కారు వారి స్థలం ఆయనకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఎన్నికల ముంగిట వైఎస్ జగన్మోహన్ రెడ్డిని హీరోగా చేస్తూ 'ఎమోషనల్ ఫాంటసీ డ్రామా' తీసిన మహీ వి.రాఘవకు అందుతున్న అదనపు రెమ్యునరేషన్ ఇది!

సొంత సినిమా దర్శక-నిర్మాతకు 'రెమ్యునరేషన్'

హార్సిలీహిల్స్‌లో రెండెకరాలు కట్టబెట్టేందుకు రెడీ


హార్సిలీహిల్స్

- మినీ స్టూడియో కడతానన్న మహీ వి.రాఘవ
- యాత్ర2 షూటింగ్‌కు ముందు జగన్‌కు దరఖాస్తు
- చిత్రీకరణ మొదలుకాగానే కదిలిన ఫైలు
- స్వయంగా ఆదేశాలు ఇచ్చిన సీఎం కార్యదర్శి
- గత నెలలో సచివాలయం నుంచి కలెక్టర్‌కు లేఖ
- 'అర్జెంటు'గా ఇచ్చేయాలని తహసీల్దార్‌కు ఆదేశం
- విడుదలైన రోజునే స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో
- క్రీడా శిక్షణా కేంద్రం స్థలానికి టెండర్

(అమరావతి/రాయచోటి - ఆంధ్రజ్యోతి)



తండ్రి అధికారంలో ఉండగా... క్విడ్‌ప్రోకో!

నాడు, ప్రభుత్వం తరఫున మేళ్లు చేసి, సొంతానికి ముడుపులు మూట కట్టడం!

తాను సీఎం అయ్యాకా... క్విడ్‌ప్రోకో!

నేడు, తనను వెండితెరపై ఆహా ఓహో అని పొగిడించుకుని, ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం!

'యాత్ర-2' పేరుతో తనను 'హీరో'గా, ఉదాత్తమైన లక్షణాలున్న కథా నాయకుడిగా సినిమా తీసిన దర్శకుడు, నిర్మాత మహీ వి.రాఘవకు ముఖ్యమంత్రి జగన్ భారీ 'పారితోషికం' అందిస్తున్నారు. తన సొంత సొమ్ము ఎంత సమర్పించుకున్నా ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండేది కాదు. కానీ... ప్రజల ఆస్తిని ధారాదత్తం చేస్తున్నారు. ఆంధ్రా ఊటీగా పేరు పొంది, స్వచ్ఛమైన వాతావరణానికి నెలవైన హార్సిలీహిల్స్‌లో రెండెకరాల స్థలాన్ని మహీకి అప్పగిస్తున్నారు. 'యాత్ర-2' ఆలోచన మొదలైనప్పుడు దరఖాస్తు వెళ్లింది. సినిమా విడుదలకాగానే భూమి బదిలీకి రంగం

మిగతా 10వ పేజీలో...


CHIEF MINISTER'S OFFICE

Please find the enclosed representation of M/S ... along with detailed proposal requesting allocation of land of Ac.10.00 cts in Horsley Hills for establishment of The Rural Mini Studio.

It is requested that the representation may be examined and necessary action may be taken for Circulation of file in this regard.

(K. Dhananjaya Reddy, IAS)
Secretary to CM

To
The Special Chief Secretary,
Tourism Department

మహీ దరఖాస్తుపై తగిన చర్యలు తీసుకుని... ఫైల్ సర్క్యులేట్ చేయాలంటూ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి ఆదేశం.

త్వరలో ఎన్డీయేలోకి కొత్త మిత్రులు

టీడీపీతో పొత్తుపై త్వరలో వెల్లడి



- అకాలీదళ్, లోక్‌దళ్‌తోనూ చర్చలు
- మిత్రపక్షాలను గౌరవించి పదవులిచ్చాం
- కేంద్రంలో ప్రతిపక్షానికి మళ్లీ అదే స్థానం
- మోదీ మూడో టర్మ్‌లో భారత్‌ను అగ్రదేశంగా మార్చడమే అజెండా: అమిత్ షా

8



నేటి నుంచే 'శంఖారావం'

ఇచ్ఛాపురంలో ప్రారంభించనున్న లోకేశ్

9


రచ్చబండలో మాట్లాడుతున్న షర్మిల

సర్కారు వారి నకిలీ మద్యం

- దేశంలో లివర్ చెడిపోయిన వారిలో 25% ఇక్కడే
- మేనిఫెస్టోనే సర్వం అన్న జగన్ మద్యపాన నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు?
- ప్రత్యేక హోదా సాధించడంలో వైసీపీ, టీడీపీ విఫలం
- 25 మంది ఎంపీలు గాడిదలు కాస్తున్నారా: షర్మిల

9

మోదీకి ఎదురేదీ!?



ఈ ఎన్నికల్లో బీజేపీ అవసరం తెలుగుదేశం పార్టీకి గానీ, ఆ పార్టీ అవసరం బీజేపీకి గానీ లేదు. భారతీయ జనతా పార్టీ లేకపోయినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. అయినా పొత్తు అనివార్యం ఎందుకవుతోందంటే... ఎన్నికలు సజావుగా జరగాలంటే కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎన్నికల కమిషన్ సహకారం అవసరం.

బీజేపీతో బహిరంగంగా పొత్తు లేకపోయినా జగన్ రెడ్డి ఆ పార్టీతో ఎలా అంటకాగుతున్నారో చూస్తున్నాం. రెండు ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ప్రాపకం కోసం పాకులాడాల్సిన పరిస్థితి. అయినా ఉన్నట్టుండి ఎన్డీయేలో చేరవలసిందిగా తెలుగుదేశం పార్టీకి ఎందుకు ఆహ్వానం పలికారంటే, ఈ ఎన్నికల్లో గరిష్ఠ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలిచి రికార్డు సృష్టించాలన్న లక్ష్యాన్ని ప్రధాని మోదీ పెట్టుకున్నారట!

తెలుగునాట నెలకొన్న పరిస్థితుల వల్ల సర్వేలలో ప్రజలు స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పలేని పరిస్థితి. ఈ కారణంగానే ఎన్నికల షెడ్యూల్‌కు ముందు చేయించుకున్న సర్వేలను నమ్ముకొని తెలంగాణలో కేసీఆర్ బోర్లా పడ్డారు. ఇప్పుడు ఏపీలో కూడా ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉండబోతున్నాయి.

పడిపోతున్న తన గ్రాఫ్‌ను పెంచుకునేందుకు జగన్ రెడ్డి కూడా సినిమాలనే నమ్ముకోవడం వింతగా ఉంది. ఒకప్పుడు 'నా వెంట్రుక పీకే వాళ్లు లేరు' అన్న జగన్ ఆ తర్వాత క్రమంలో 'మిమ్మల్నే నమ్ముకున్నాను, మీరే గెలిపించాలి' అని అర్థించే వరకూ ఒక్కో మెట్టూ దిగుతూ వచ్చారు. ఇప్పుడు సినిమాలనూ నమ్ముకొనే దుస్థితి.

ఏడు పదులు దాటిన తాము ప్రధాని మోదీతో తలపడి సాధించేది ఏమిటి? అధికారం దక్కించుకోలేకపోతే తమ రాజకీయ జీవితం ముగిసినట్టే కదా? అని ఆయా నేతలు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్రలో కురు వృద్ధుడు శరద్ పవార్ పరిస్థితి ఏమిటో చూస్తున్నాం. ఆయన మోదీతో చేతులు కలపడానికి నిరాకరించడం వల్ల సొంత పార్టీని కూడా కోల్పోవలసి వచ్చింది.

కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వాలు, ముఖ్యంగా కూటముల ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు రాష్ట్రాలు పూర్తి స్థాయి స్వేచ్ఛను అనుభవించాయి. ఇందిరాగాంధీ తర్వాత మళ్లీ ఇంత కాలానికి కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బలమైన ప్రభుత్వం అధికారం చలాయిస్తోంది. దీంతో ఆయా రాష్ట్రాలలో బలమైన నాయకులు అనుకున్న వారు సైతం మోదీ అధికారానికి తలొంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 2లో..

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

మోదీకి ఎదురేదీ!?

'పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న ఎన్డీయేలో మీరు మళ్లీ భాగస్వామి కావాలని కోరుతున్నాం' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వద్ద ప్రతిపాదించారు. అమిత్ షా ఆహ్వానం మేరకు చంద్రబాబు ఢిల్లీ వెళ్లి ఆయనతో చర్చలు జరిపారు. ఈ పరిణామంపై ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రస్తుత దుస్థితికి భారతీయ జనతా పార్టీ కారణమన్న అభిప్రాయంతో ఉన్న రాష్ట్ర ప్రజలు ఆ పార్టీపై ఆగ్రహంగా ఉన్నారు. ఈ కారణంగా చంద్రబాబు–అమిత్ షా సమావేశంపై మిశ్రమ స్పందన ఏర్పడింది. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ముఖ్యంగా ముస్లింల సంఖ్య అధికంగా ఉన్న రాయలసీమకు చెందిన వారు బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ బీజేపీతో చేతులు కలపడం తెలుగుదేశం పార్టీకి అనివార్యంగా మారింది. తెలుగుదేశం పార్టీ అభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ చంద్రబాబును అమిత్ షా ఢిల్లీకి ఆహ్వానించడంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉలిక్కిపడి ఆ వెంటనే ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసి వచ్చారు. రాష్ట్రంలో బీజేపీ ఓటు షేర్ రెండు నుంచి మూడు శాతం మాత్రమే ఉంది. అయినా అధికార, ప్రతిపక్షాలు ఆ పార్టీ కరుణాకటాక్షాల కోసం వెంపర్లాడటం వింతగా ఉన్నప్పటికీ అందుకు కారణం లేకపోలేదు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉన్నప్పుడు రెండు ప్రాంతీయ పార్టీలు మనుగడ సాగిస్తున్న రాష్ట్రాలలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. తమిళనాడులో ఒకప్పుడు ఎమ్జీఆర్, కరుణానిధి బలమైన నాయకులుగా ఉండేవారు. అప్పుడు కేంద్రంలో ఇందిరాగాంధీ అత్యంత శక్తిమంతమైన ప్రధానిగా ఉండేవారు. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీకి చోటులేకపోయినా కరుణానిధితో పాటు ఎమ్జీఆర్ కూడా ఏదో ఒక దశలో కేంద్ర ప్రభుత్వంతో రాజీ పడిపోయారు. కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వాలు, ముఖ్యంగా కూటముల ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు రాష్ట్రాలు పూర్తి స్థాయి స్వేచ్ఛను అనుభవించాయి. ఇందిరాగాంధీ తర్వాత మళ్లీ ఇంత కాలానికి కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బలమైన ప్రభుత్వం అధికారం చలాయిస్తోంది. దీంతో ఆయా రాష్ట్రాలలో బలమైన నాయకులు అనుకున్న వారు సైతం మోదీ అధికారానికి తలొంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. కేంద్రంతో రాజీపడని తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పడుతున్నదో చూస్తున్నాం. ఆ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు జైలుకే పరిమితమయ్యారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పరిస్థితి కూడా చూస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఏడాదిగా జైలుకే పరిమితమయ్యారు. మరో మంత్రి కూడా తీహార్ జైల్లోనే ఉన్నారు. కేజ్రీవాల్‌ను కూడా ఇవాళో రేపో అరెస్టు చేస్తారన్న వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, అధికారం కోల్పోతే ప్రాంతీయ పార్టీల మనుగడ కూడా ప్రశ్నార్థకం అవుతోంది. అవధులు లేని అధికారం చలాయించడానికి అలవాటుపడిన ప్రాంతీయ పార్టీల నాయకులు ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిస్థితే తీసుకుందాం. తొమ్మిదిన్నరేళ్లుగా ఆయన మకుటం లేని మహారాజులా వెలుగొందారు. నియంత తరహా పాలన సాగించారు. అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు సంపాదనకు అలవాటుపడ్డారు. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ అధికారం కోల్పోయారు. దీంతో భారత రాష్ట్ర సమితి మనుగడే ప్రశ్నార్థకం అయింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో 'సారు–కారు–పదహారు' అన్న నినాదంతో ఎన్నికలకు వెళ్లి తొమ్మిది స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్ మరో రెండు నెలల తర్వాత జరగబోయే ఎన్నికల్లో రెండు మూడు సీట్లు గెలుచుకోగలదా అన్న సందేహం కలుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ పార్టీ భవిష్యత్తుపై బీఆర్ఎస్ నాయకులకు బెంగపట్టుకుంది. ఎంతలో ఎంత తేడా?

> ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉండబోతున్నాయి. ఈ ఉపద్రవం నుంచి బయటపడటానికి జగన్‌రెడ్డిని నిజాయితీపరుడిగా చిత్రిస్తూ రూపొందించిన 'యాత్ర 2' చిత్రాన్ని విడుదల చేసి ప్రేక్షకులను ఆకర్షించడానికి నానా అగచాట్లు పడుతున్నారు. త్వరలో వర్మ తీసిన 'వ్యూహం' సినిమాను కూడా విడుదల చేస్తారు. అప్పటికీ అనుమానం తీరకపోతే వర్మ తీస్తున్న మరో చిత్రం 'శపథం' కూడా విడుదల చేయవచ్చు. మొత్తమ్మీద పడిపోతున్న తన గ్రాఫ్‌ను పెంచుకునేందుకు జగన్‌రెడ్డి కూడా సినిమాలనే నమ్ముకోవడం వింతగా ఉంది. ఒకప్పుడు 'నా వెంట్రుక పీకే వాళ్లు లేరు' అన్న జగన్, ఆ తర్వాత క్రమంలో 'మిమ్మల్నే నమ్ముకున్నాను, మీరే గెలిపించాలి' అని ప్రజలను అర్థించే వరకూ ఒక్కో మెట్టూ దిగుతూ వచ్చారు. ఇప్పుడు సినిమాలను కూడా నమ్ముకొనే దుస్థితి. అయినా సినిమాలకు, సినిమా హీరోలకు ప్రభావితమై జనం ఓట్లు వేసే రోజులు పోయాయి. తెలుగు రాష్ట్రాలలోనే కాదు– తమిళనాడులో కూడా ఇది రుజువైంది.

ఎందుకీ నిస్సహాయత...

వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల నాయకులతో పాటు ఇతర నాయకులు కూడా మోదీ ప్రభుత్వాన్ని ఎదిరించి నిలబడలేకపోవడానికి మరో ప్రధాన కారణం ఉంది. దేశ జనాభాలో యువత శాతం అధికంగా ఉన్నప్పటికీ నాయకులు మాత్రం వృద్ధాప్యంలోకి చేరిపోయారు. ప్రస్తుత రాజకీయాలలో క్రియాశీలంగా ఉన్న నాయకులందరూ ఏడు పదులు దాటిన వారే కావడం గమనార్హం. ప్రధాని మోదీ వయస్సు కూడా ఏడు పదులు దాటినప్పటికీ వృద్ధులందరిలోకీ యువకుడిగా ఆయనే చలామణి అవుతున్నారు. ఏడు పదులు దాటిన తాము ప్రధాని మోదీతో తలపడి సాధించేది ఏమిటి? అధికారం దక్కించుకోలేకపోతే తమ రాజకీయ జీవితం ముగిసినట్టే కదా? అని ఆయా నేతలు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్రలో కురువృద్ధుడు శరద్ పవార్ పరిస్థితి ఏమిటో చూస్తున్నాం. ఆయన మోదీతో చేతులు కలపడానికి నిరాకరించడం వల్ల సొంత పార్టీని కూడా కోల్పోవలసి వచ్చింది. పశ్చిమ బెంగాల్, బిహార్ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, నితీశ్ కుమార్ కూడా ఏడు పదులకు కాస్త అటూ ఇటూ ఉన్నారు. దీంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మోదీ ప్రభుత్వంతో రాజీ పడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్, బిహార్‌లో తేజస్వి యాదవ్ యువకులే అయినప్పటికీ సీరియస్ పొలిటీషియన్స్‌గా వారికి గుర్తింపు రాలేదు. దక్షిణాదికి వస్తే కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక ముఖ్యమంత్రులు పినరయి విజయన్, స్టాలిన్, నవీన్ పట్నాయక్, సిద్దరామయ్య 70 ఏళ్లు దాటిన వాళ్లే. తెలుగునాట చంద్రబాబు, కేసీఆర్ కూడా ఏడు పదులకు చేరినవారే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిన్న వయసు వారే అయినప్పటికీ వారి పాత్ర పరిమితమే. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నందున ఆ పార్టీ అధినాయకత్వానికి మాత్రమే విధేయులుగా ఉండాలి. జగన్ ప్రాంతీయ పార్టీ అధినేత అయినప్పటికీ ఆయనపై ఉన్న కేసుల కారణంగా కేంద్ర ప్రభుత్వం ముందు తలవొంచాల్సిన పరిస్థితి. జాతీయ రాజకీయాలలో నరేంద్ర మోదీతో తలపడే నాయకుడు ఒక్కరు కూడా కనబడటం లేదు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి వయసు రీత్యా ఎడ్వాంటేజ్ ఉన్నప్పటికీ... ప్రధాని మోదీని ఎదుర్కొనే విషయమై ఆయన దీటుగా ఎదగలేకపోతున్నారు. భారతీయ జనతా పార్టీలో కూడా మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎవరూ ఎదగలేదు. బీజేపీ మాతృ సంస్థగా భావించే ఆరెస్సెస్ కూడా మోదీ ఆధిపత్యాన్ని ఆమోదించక తప్పని పరిస్థితి. 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' అని ప్రధాని మోదీ ప్రకటించినా అదేమిటి, బీజేపీ సర్కార్ అని చెప్పడం లేదు అని ప్రశ్నించలేని పరిస్థితిలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బీజేపీని నరేంద్ర మోదీ అఖిల భారత స్థాయి ప్రాంతీయ పార్టీగా మార్చుకుని తిరుగులేని నాయకుడిగా చలామణి అవుతున్నారు. స్థూలంగా భారత రాజకీయ ముఖచిత్రం ఇది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీని ధిక్కరించగలరా?



గత వైభవం...

ఒకప్పుడు కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఎన్డీయే ప్రభుత్వంలో ఆయనే కీలకం. అప్పట్లో గుజరాత్‌లో చెలరేగిన అల్లర్లకు బాధ్యత వహించి అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీతో రాజీనామా చేయించాలన్న డిమాండ్ వచ్చింది. మోదీ రాజీనామా చేయాలని చంద్రబాబు కూడా స్వరం కలిపారు. ఆ సమయంలో ఎల్‌కే అద్వాణీ మోదీకి అండగా నిలబడ్డారు. అయితే చంద్రబాబు మాటకు ప్రాధాన్యత ఇచ్చిన ప్రధాని వాజపేయి మాత్రం... చంద్రబాబును కలిసి ఆయనకు నచ్చచెప్పవలసిందిగా మోదీని ఆదేశించారు. ప్రధాని వాజపేయి ఆదేశాలతో చంద్రబాబును కలవడానికి ఢిల్లీలోని ఏపీ భవన్‌కు వెళ్లిన మోదీకి అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు. ఇదంతా గతం! ఇప్పుడు మోదీ దేశంలోనే అత్యంత బలమైన నాయకుడు! చంద్రబాబు బలహీనపడ్డారు. వయసు రీత్యా కూడా ఆయన జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయలేని పరిస్థితి. ఏప్రిల్‌లో జరగనున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావడం చంద్రబాబుకు ముఖ్యం. ఇప్పుడు అధికారంలోకి రాకపోతే చంద్రబాబు రాజకీయ జీవితం ముగిసినట్టే. ఈ కోణం నుంచి చూస్తే బీజేపీతో పొత్తును చంద్రబాబు కాదనుకోలేని పరిస్థితి ఎందుకొచ్చిందో తెలుస్తుంది.

ఎవరికి ఎవరు అవసరం...

నిజానికి ఈ ఎన్నికల్లో బీజేపీ అవసరం తెలుగుదేశం పార్టీకి గానీ, ఆ పార్టీ అవసరం బీజేపీకి గానీ లేదు. భారతీయ జనతా పార్టీ లేకపోయినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. అయినా పొత్తు అనివార్యం ఎందుకవుతోందంటే.. ఎన్నికలు సజావుగా జరగాలంటే కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. ప్రజల మద్దతు ఉన్నప్పటికీ ఎన్నికలు సజావుగా జరగని పక్షంలో పరిస్థితి ఏమిటి? అన్న ఆందోళన తెలుగుదేశం పార్టీని పట్టి పీడిస్తోంది. ఈ కారణంగానే తెలుగుదేశంతో కలవడంపై జనసేనాని పవన్ కల్యాణ్‌ను రెచ్చగొడుతున్నప్పటికీ, చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అమిత్ షా కాళ్లు మొక్కారని దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ రెచ్చిపోకుండా వారు సంయమనం పాటిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం పరిస్థితి ఏమిటి? తమ పరిస్థితి ఏమిటి? అన్న విషయంలో ఆ ఇరువురు నాయకులకు స్పష్టత ఉంది. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరే విషయమై ఎక్కువగా భయపడుతున్నది జగన్‌రెడ్డి మాత్రమే. తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరితే ముస్లింలను, క్రైస్తవులను రెచ్చగొట్టవచ్చు. తనకు భయంగా ఉందని చెప్పకుండా మీకు భయంగా ఉంటే వచ్చి నా చుట్టూ పడుకోండన్న తరహాలో జగన్ ఆ వర్గాలను రెచ్చగొట్టవచ్చు. జగన్‌రెడ్డి ట్రాప్‌లో చిక్కుకొని ప్రధాని మోదీని నేరుగా ఢీకొనే ప్రయత్నం చేసి ఆత్మహత్య చేసుకోవడమా? ప్రస్తుతానికి మోదీ ప్రమాదాన్ని తప్పించుకొని అధికారాన్ని అందుకోవడమా? అన్నది తెలుగుదేశం పార్టీ తేల్చుకోవాలి. ప్రజాబలం లేని వారి మాటలకు రెచ్చిపోవడమా? లేక విజ్ఞతతో ఆలోచించి గండం గట్టెక్కడమా? అన్నది తెలుగుదేశం పార్టీ ముందున్న ప్రశ్న. భారతీయ జనతా పార్టీ కోణం నుంచి చూస్తే వారికి కూడా తెలుగుదేశం పార్టీతో పొత్తు అనివార్యం కాదు. అయితే ప్రస్తుత పొత్తు ప్రతిపాదనకు కారణం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 25 ఎంపీ సీట్లలో ఎవరు ఎన్ని సీట్లు గెలుచుకున్నప్పటికీ ఎన్నికల తర్వాత తమకే మద్దతు ఇస్తారని బీజేపీ పెద్దలకు తెలియక కాదు. బీజేపీతో బహిరంగంగా పొత్తు లేకపోయినా జగన్‌రెడ్డి ఆ పార్టీతో ఎలా అంటకాగుతున్నారో చూస్తున్నాం. ఒకప్పటి తమిళనాడు పరిస్థితి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ది. రెండు ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ప్రాపకం కోసం పాకులాడాల్సిన పరిస్థితి. అయినా ఉన్నట్టుండి ఎన్డీయేలో చేరవలసిందిగా తెలుగుదేశం పార్టీకి ఎందుకు ఆహ్వానం పలికారంటే, ఈ ఎన్నికల్లో గరిష్ఠ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలిచి రికార్డు సృష్టించాలన్న లక్ష్యాన్ని ప్రధాని మోదీ పెట్టుకున్నారట! ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 403 స్థానాలను గెలుచుకుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు అన్ని సీట్లు లభించలేదు. ఇందిర హత్యానంతరం మాత్రమే సానుభూతి వెల్లువెత్తి... యాభై శాతానికి పైగా ఓట్లతో 403 సీట్లు గెలుచుకుంది. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 403 కంటే ఒక్క సీటైనా అధికంగా సాధించాలన్న పట్టుదలతో ప్రధాని మోదీ ఉన్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మారాయని ధ్రువీకరించుకున్న మీదటే ప్రధాని మోదీ ఆ పార్టీని ఎన్డీయేలో చేర్చుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'మిమ్మల్ని ఎన్డీయేలో చేరాలని కోరవలసిందిగా ప్రధాని మోదీ ఆదేశించారు' అని హోం మంత్రి అమిత్ షా చంద్రబాబుతో సమావేశం సందర్భంగా తెలిపారు. జగన్‌రెడ్డి నేరుగా ఎన్డీయేలో చేరబోరు కనుక ఆయన బలాన్ని లెక్కలోకి తీసుకోవడానికి లేదు. ఏదేమైనా తెలుగుదేశం పార్టీ ఎన్డీయే భాగస్వామి అయ్యేదీ లేనిదీ మరో వారం రోజుల్లో తేలిపోతుంది. అప్పటి వరకు పొత్తుకు అనుకూల, వ్యతిరేక వర్గాలు ఎవరి ఆట వారు ఆడతారు. చంద్రబాబు గెలవబోతున్నారు కనుక భారతీయ జనతా పార్టీ నుంచి పొత్తుకు ఆహ్వానం అందింది. కేంద్రంలో మళ్లీ బీజేపీనే గెలవబోతోంది కనుక పిలిచిందే తడవుగా చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు. ఇది వాస్తవం!

> చంద్రబాబు గెలవబోతున్నారు కనుక భారతీయ జనతా పార్టీ నుంచి పొత్తుకు ఆహ్వానం అందింది. కేంద్రంలో మళ్లీ బీజేపీనే గెలవబోతోంది కనుక పిలిచిందే తడవుగా చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు. ఇది వాస్తవం!

> ప్రజల మద్దతు ఉన్నప్పటికీ ఎన్నికలు సజావుగా జరగని పక్షంలో పరిస్థితి ఏమిటి? అన్న ఆందోళన తెలుగుదేశం పార్టీని పట్టి పీడిస్తోంది. ఈ కారణంగానే తెలుగుదేశంతో కలవడంపై జనసేనాని పవన్ కల్యాణ్‌ను రెచ్చగొడుతున్నప్పటికీ, చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అమిత్ షా కాళ్లు మొక్కారని దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ రెచ్చిపోకుండా వారు సంయమనం పాటిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం పరిస్థితి ఏమిటి? తమ పరిస్థితి ఏమిటి? అన్న విషయంలో ఆ ఇరువురు నాయకులకు స్పష్టత ఉంది. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరే విషయమై ఎక్కువగా భయపడుతున్నది జగన్‌రెడ్డి మాత్రమే. తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరితే ముస్లింలను, క్రైస్తవులను రెచ్చగొట్టవచ్చు. తనకు భయంగా ఉందని చెప్పకుండా మీకు భయంగా ఉంటే వచ్చి నా చుట్టూ పడుకోండన్న తరహాలో జగన్ ఆ వర్గాలను రెచ్చగొట్టవచ్చు. జగన్‌రెడ్డి ట్రాప్‌లో చిక్కుకొని ప్రధాని మోదీని నేరుగా ఢీకొనే ప్రయత్నం చేసి ఆత్మహత్య చేసుకోవడమా? ప్రస్తుతానికి మోదీ ప్రమాదాన్ని తప్పించుకొని అధికారాన్ని అందుకోవడమా? అన్నది తెలుగుదేశం పార్టీ తేల్చుకోవాలి. ప్రజాబలం లేని వారి మాటలకు రెచ్చిపోవడమా? లేక విజ్ఞతతో ఆలోచించి గండం గట్టెక్కడమా? అన్నది తెలుగుదేశం పార్టీ ముందున్న ప్రశ్న.

ఇదీ మూడ్...


మూడ్ ఆఫ్ ద నేషన్ పేరిట 'ఇండియా టుడే' గ్రూపు తాజాగా నిర్వహించిన సర్వేలో కూడా బీజేపీ, టీడీపీల గెలుపు ఖాయమని తేలింది. ఈ సర్వే ఫలితాలు వెల్లడైన తర్వాత జగన్‌రెడ్డి శిబిరం ఉలికిపాటుకు గురైంది. దీంతో అలవాటు ప్రకారం ఆ సర్వే విశ్వసనీయతను ప్రశ్నిస్తూ తమ రోత పత్రికలో కథనాలు వండి వార్చారు. 2019కి ముందు, ఆ తర్వాత కూడా 'ఇండియా టుడే' గ్రూపు క్రమం తప్పకుండా సర్వేలు నిర్వహిస్తోంది. 2018లో అధికార తెలుగుదేశం పార్టీకంటే వైసీపీ ఆరు శాతం ఓట్ల ఆధిక్యంలో ఉందని తేల్చి చెప్పింది. 2022లో తెలుగుదేశం పార్టీకి 7 ఎంపీ సీట్లు, 2023లో 10 సీట్లు, 2023 ఆగస్టులో 15 సీట్లు, 2024 జనవరిలో 17 సీట్లు వస్తాయని ఈ సంస్థ అంచనా వేసింది. దీంతో కలవరపాటుకు గురైన జగన్ అండ్ కో తమ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికై 'రిపబ్లిక్ సర్వే' అంటూ ఒక బోగస్ సర్వేను ప్రచారంలోకి తెచ్చింది. నిజానికి తెలుగునాట నెలకొన్న పరిస్థితుల వల్ల సర్వేలలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పలేని పరిస్థితి ఉంది. ఈ కారణంగానే ఎన్నికల షెడ్యూల్‌కు ముందు చేయించుకున్న సర్వేలను నమ్ముకొని తెలంగాణలో కేసీఆర్ బోర్లా పడ్డారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉండబోతున్నాయి. ఈ ఉపద్రవం నుంచి బయటపడటానికి జగన్‌రెడ్డిని నిజాయితీపరుడిగా చిత్రిస్తూ రూపొందించిన 'యాత్ర 2' చిత్రాన్ని విడుదల చేసి ప్రేక్షకులను ఆకర్షించడానికి నానా అగచాట్లు పడుతున్నారు. త్వరలో వర్మ తీసిన 'వ్యూహం' సినిమాను కూడా విడుదల చేస్తారు. అప్పటికీ అనుమానం తీరకపోతే వర్మ తీస్తున్న మరో చిత్రం 'శపథం' కూడా విడుదల చేయవచ్చు. మొత్తమ్మీద పడిపోతున్న తన గ్రాఫ్‌ను పెంచుకునేందుకు జగన్‌రెడ్డి కూడా సినిమాలనే నమ్ముకోవడం వింతగా ఉంది. ఒకప్పుడు 'నా వెంట్రుక పీకే వాళ్లు లేరు' అన్న జగన్, ఆ తర్వాత క్రమంలో 'మిమ్మల్నే నమ్ముకున్నాను, మీరే గెలిపించాలి' అని ప్రజలను అర్థించే వరకూ ఒక్కో మెట్టూ దిగుతూ వచ్చారు. ఇప్పుడు సినిమాలను కూడా నమ్ముకొనే దుస్థితి. అయినా సినిమాలకు, సినిమా హీరోలకు ప్రభావితమై జనం ఓట్లు వేసే రోజులు పోయాయి. తెలుగు రాష్ట్రాలలోనే కాదు– తమిళనాడులో కూడా ఇది రుజువైంది. ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన సోదరి షర్మిల రూపంలో కూడా ముప్పు ఎదురవుతోంది. షర్మిల సూటిగా సుత్తి లేకుండా జగన్‌ను ఎండగడుతున్నారు. 'సిద్ధం' అంటూ జగన్ ప్రచారం చేసుకుంటుండటంతో 'ప్రజలు నిన్ను ఇంటికి పంపడానికి సిద్ధం'గా ఉన్నారంటూ ఆమె నేరుగా తేల్చి చెబుతున్నారు. క్రైస్తవ ఓటు బ్యాంకును కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించడంలో షర్మిల కొంత మేరకు సఫలమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఆమె సభలకు జనం కూడా క్రమంగా పెరుగుతున్నారు. ప్రతిపక్షాల కంటే వైసీపీ ఎమ్మెల్యేలే తమ వాచాలత్వంతో జగన్‌కు ఎక్కువ నష్టం చేస్తున్నారు. రాజధాని ఎందుకు? రాజధాని ఏమైనా కూడు పెడుతుందా? అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యపై విమర్శలు వస్తున్నాయి. రాజధాని కూడు పెట్టకపోవడం నిజమైతే మూడు రాజధానుల పాట ఎందుకు పాడుతున్నారు? అన్న ప్రశ్న వస్తోంది. అధికార మదం తలకెక్కడంతో ఏమి మాట్లాడుతున్నారో తెలియకుండా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో తమ ఆప్తుడు కేసీఆర్‌కు ఎదురైన చేదు అనుభవం చూశాక కూడా వైసీపీ నాయకుల వైఖరి మారడం లేదంటే వినాశకాలే విపరీత బుద్ధి అని సర్ది చెప్పుకోవాల్సిందే. ఆంధ్రప్రదేశ్‌లో గెలవడానికి, ఓడటానికి ఎవరు సిద్ధంగా ఉన్నారో ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాక మరింత స్పష్టంగా తెలుస్తుంది. అప్పటిదాకా ఎవరి లెక్కలు వారు వేసుకోవచ్చు. గాలిలో మేడలు కట్టుకోవచ్చు!

> ఇందిరాగాంధీ తర్వాత మళ్లీ ఇంత కాలానికి కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బలమైన ప్రభుత్వం అధికారం చలాయిస్తోంది. దీంతో ఆయా రాష్ట్రాలలో బలమైన నాయకులు అనుకున్న వారు సైతం మోదీ అధికారానికి తలొంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. కేంద్రంతో రాజీపడని తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పడుతున్నదో చూస్తున్నాం. ఆ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు జైలుకే పరిమితమయ్యారు. ఢిల్లీ ముఖ్యమంత్రి క్రేజీవాల్ పరిస్థితి కూడా చూస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఏడాదిగా జైలుకే పరిమితమయ్యారు. మరో మంత్రి కూడా తీహార్ జైల్లోనే ఉన్నారు. క్రేజీవాల్‌ను కూడా ఇవాళో రేపో అరెస్టు చేస్తారన్న వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, అధికారం కోల్పోతే ప్రాంతీయ పార్టీల మనుగడ కూడా ప్రశ్నార్థకం అవుతోంది. అవధులు లేని అధికారం చలాయించడానికి అలవాటుపడిన ప్రాంతీయ పార్టీల నాయకులు ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అందరూ యువకులే, నైపుణ్యాలే లేవు!

> అరకొర నైపుణ్యాలు, విద్య కారణంగా మన కార్మికుల సగటు ఉత్పత్తి తక్కువగా ఉంటోంది. ఈ తక్కువ ఉత్పాదకత మన అభివృద్ధికి అవరోధంగా మారుతోంది, ఆదాయాల్ని పరిమితం చేస్తోంది. తక్కువ వృద్ధి తక్కువ ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలదు. తక్కువ ఆదాయాలు తక్కువ డిమాండ్‌కు మాత్రమే ఉద్దీపన కాగలవు. క్రమంగా మనం పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విషవలయంలోకి జారిపోతాం.



మన కార్మికులందరికీ మంచి ఆదాయాలున్న ఉపాధిని అందించటం భారతదేశం ఎదుర్కొంటున్న పెనుసవాలు. దేశంలో పనిచేసేవారి సంఖ్య ఈవేళ 52.4కోట్లు. చైనా తర్వాతి స్థానం మనదే. చైనా జనాభా వయసు మీరుతోంది కాబట్టి, రాబోయే రోజుల్లో ప్రపంచంలో అతి ఎక్కువమంది కార్మికులు మన దేశంలోనే ఉంటారు. జనాభాలో పనిచేసేవారి వాటా ఎంత ఎక్కువ ఉంటే, దేశానికి ఆర్థికాభివృద్ధి సామర్థ్యం అంత ఎక్కువ ఉంటుంది. ఎంత ఎక్కువమంది పనిచేస్తుంటే దేశ ప్రజల అవసరాలకు, విదేశీ ఎగుమతులకు అంత ఎక్కువ సరకుల్ని, సేవల్ని ఉత్పత్తి చేస్తారు. కార్మికులు డబ్బు సంపాదిస్తున్నకొద్దీ, వస్తువులు, సేవలకు మరింత డిమాండ్ సృష్టిస్తారు. పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉత్పత్తికి ప్రోత్సాహకమవుతారు. ఇదంతా ఓ వలయంలా నిరంతర సానుకూల అభివృద్ధికి దారితీస్తుంది. అందుకే పనిచేసే జనాభా ఎక్కువమంది ఉండటాన్ని 'డెమోగ్రాఫిక్ డివిడెండ్'గా ఆర్థికవేత్తలు పేర్కొంటారు.

జనాభాపరంగా అందివచ్చిన ఆర్థిక అవకాశం నుంచి లాభం పొందటానికి మూడు మౌలిక షరతుల్ని నెరవేర్చాలి. మొదటిది, కార్మికులకు ఉత్పాదకతను పెంచుకునే నైపుణ్యాలు ఉండాలి; రెండోది, సురక్షిత వాతావరణం కల్పించటానికి, వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం తన పని సవ్యంగా చేయాలి, చట్టబద్ధపాలన అందించాలి. ఆధునిక ఆర్థిక వ్యవస్థకు తగిన పటిష్ఠ మౌలిక వసతుల్ని నిర్మించాలి. ఉత్పాదకతను పెంచేందుకు ప్రజలందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని, నైపుణ్యాల్ని మెరుగుపరచేందుకు నాణ్యమైన విద్యను అందించాలి. మూడోది, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, ఆర్థికాభివృద్ధికి సానుకూల వాతావరణాన్ని ఏర్పరచాలి. ఇందుకోసం ఆర్థిక స్వేచ్ఛను, అర్థవంతమైన, సులభంగా అమలు చేయగల నియంత్రణ, పన్నులు, ఇతర ప్రోత్సాహకాలు, వాణిజ్య విధానాలను అమలు చేయాలి.

దశాబ్దాల తరబడి ప్రభుత్వాల వైఫల్యం వల్ల, ప్రజలకు ఆదాయాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే ఉపాధి అవకాశాల్ని మనం సృష్టించలేకపోయాం. ఈవేళ కూడా 80శాతానికి పైగా కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. వారికి నెలవారీ జీతాలుండవు, ఉత్పాదకత తక్కువ, జీవన భద్రత అంతంత మాత్రం. అభివృద్ధి, ఉపాధి కల్పన మన మంత్రాలు కావాలి. మన విద్య పెరుగుతున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థకు సరిపోదు. మన పిల్లల్లో చాలామంది పైతరగతులకు వెళ్లకుండానే స్కూలు చదువులు ఆపేస్తుంటారు. పాఠశాల చదువు పూర్తి చేసి, ఆ తర్వాత కాలేజీకి వెళ్లిన పిల్లల్లో కూడా పనికొచ్చే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. మనం ఒక విచిత్రమైన వైరుధ్యంలో ఉన్నాం. యువతలో చాలామంది మంచి ఆదాయం వచ్చే ఉపాధి దొరకాలని ఆరాటపడుతుండగా, పలు సంస్థలు తమకు సరైన నైపుణ్యమున్న యువత దొరకటం లేదని గగ్గోలు పెడుతున్నాయి. కోలెరిడ్జ్ పద్యం గుర్తొస్తోంది. Ancient Mariner లో ఆయన ఇలా ఆక్రోశించారు: 'నీళ్లు, నీళ్లు, ఎటుచూసినా నీళ్లు. తాగటానికి మాత్రం ఒక్క చుక్క లేదు'. మనం ఉపయోగించుకోలేని డెమోగ్రాఫిక్ డివిడెండ్‌కి ఈ వాక్యాలు అతికినట్లు వర్తిస్తాయి. అరకొర నైపుణ్యాలు, విద్య కారణంగా మన కార్మికుల సగటు ఉత్పత్తి తక్కువగా ఉంటోంది, ఈ తక్కువ ఉత్పాదకత మన అభివృద్ధికి అవరోధంగా మారుతోంది, ఆదాయాల్ని పరిమితం చేస్తోంది. తక్కువ వృద్ధి తక్కువ ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలదు. తక్కువ ఆదాయాలు తక్కువ డిమాండ్‌కు మాత్రమే ఉద్దీపన కాగలవు. క్రమంగా మనం పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విషవలయంలోకి జారిపోతాం.

భారత్‌లో ప్రభుత్వాలు తమ బాధ్యత సవ్యంగా నిర్వర్తించటం లేదు. అందువల్లే అభివృద్ధి కుంటుపడుతోంది. మంచి ఉద్యోగాల సృష్టి పెద్దసంఖ్యలో జరగటం లేదు. ఇటీవల కొన్నేళ్లుగా మౌలిక వసతులు మెరుగవుతున్నాయి. మూలధన వ్యయంలో యూనియన్ ప్రభుత్వం రికార్డు స్థాయి పెట్టుబడి పెడుతోంది. 2023–24లో జాతీయ స్థాయి మౌలిక వసతులకు బడ్జెట్ ద్వారా ప్రత్యక్షంగా 10 ట్రిలియన్ రూపాయలు కేటాయించారు. ఆస్తులు సృష్టికి రాష్ట్రాలకు రూ.3.70 ట్రిలియన్లు మూలధన రుణంగా మంజూరు చేశారు. కానీ చాలా రాష్ట్రాల్లో జీతాలు, పెన్షన్లు, వడ్డీల వంటి తప్పనిసరి ఖర్చులు, పోటాపోటీగా విస్తరిస్తున్న వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలతో వ్యయం అదుపు తప్పుతోంది. దీంతో, మౌలిక వసతుల మీద పెట్టుబడికి అవసరమైన డబ్బు ఉండటం లేదు.

కొత్త పెట్టుబడులను ప్రోత్సహించటానికి యూనియన్ ప్రభుత్వం, కొన్ని క్రియాశీల రాష్ట్రాలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. పరిపాలన చాలావరకు రాష్ట్రాల్లో ఉంటుంది. రాష్ట్రాలు మెరుగ్గా పనిచేసిన చోటల్లా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి, ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి, వృద్ధిని వేగవంతం చేస్తున్నాయి. కానీ మితిమీరిన నియంత్రణ, అసంబద్ధ విధానాలు, విశృంఖల అవినీతి పెట్టుబడులను, అభివృద్ధిని కుంగదీస్తాయి. మన కార్మిక చట్టాలు, విధానాలు కార్మికులకు రక్షణ ముసుగులో ఉపాధి కల్పనను నీరుగార్చాయి. మన నియంత్రణల్లో చాలామేర సమాజాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించటానికి బదులు, లంచాలు గుంజటానికి, వ్యాపారులను వేధించటానికి వనరుగా మారాయి. కాలం చెల్లిన విధానాలు, ప్రభుత్వ నియంత్రణ, గుత్తాధిపత్యం రాజ్యమేలిన గతకాలపు వారసత్వంగా మోస్తున్న ఆలోచనా విధానం మనకు అవరోధాలవుతున్నాయి. నిజమైన పోటీని, వినియోగదారుల ఎంపిక స్వేచ్ఛని, అభివృద్ధిని అణగదొక్కుతున్నాయి.

యువతకు ప్రభుత్వం ఉద్యోగాలనిస్తుందనే భ్రమను రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం చేయాల్సిన నిజమైన పని, వ్యక్తులు చేయలేని సమాజం ఉమ్మడి అవసరాలను తీర్చటం. ఉమ్మడి వస్తువులు, సేవలను అందించటానికి ప్రజల తీర్పు ద్వారా ప్రభుత్వాలు ఎన్నికవుతాయి. ఆ బాధ్యతను నెరవేర్చటం మేరకు ప్రభుత్వం ఉద్యోగులను నియమించుకోవటం అవసరం. అంతవరకు మాత్రమే. మన పన్ను–జీడీపీ నిష్పత్తి 18శాతానికి కాస్త ఎక్కువ కాగా, మన ప్రభుత్వాలు సుమారు 3.2శాతం ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ప్రభుత్వాలు మరింత మెరుగ్గా శిక్షణనివ్వాలి, ఎక్కువమందిని నియమించుకోవాలి, చట్టబద్ధపాలన, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలను మరింత సమర్థంగా ప్రజలకు అందించాలి. విద్యలో బడిఈడు పిల్లల సంఖ్య తగ్గుతోంది. అత్యధిక రాష్ట్రాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా ఇంకా ఎక్కువమంది ఉపాధ్యాయులను నియమించుకోవటం మూర్ఖత్వమవుతుంది. దానికి బదులు, విద్యార్థుల అవగాహన, నైపుణ్యాలు పెరగటం మీద మనం దృష్టి సారించాలి. మనకు ప్రభుత్వంలో చాలామంది గుమాస్తాలు, బంట్రోతులు, డ్రైవర్లు ఉన్నారు; వాళ్లలో అత్యధికులు పన్నుల డబ్బు నుంచి తీసుకుంటున్న జీతాలకు తగ్గ సేవలు అందించటం లేదు. వాళ్ల బాస్‌ల అవసరాలు, జీవనశైలి కోసం మాత్రమే ఉపయోగపడుతున్నారు. మనం ప్రభుత్వాన్ని పునర్నిర్మించాలి తప్ప గుడ్డిగా విస్తరించి దివాలా తీయించకూడదు.

ఒక దేశంగా మన శక్తిసామర్థ్యాలు మొత్తాన్నీ అభివృద్ధిని పెంచటం, నిజమైన ఉద్యోగాలను సృష్టించటం మీద కేంద్రీకరించాలి. విద్య, నైపుణ్యాలు, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి, ఉపాధిని సృష్టించటం మన లక్ష్యాలు కావాలి. అప్పుడు మాత్రమే పనిచేసే జనాభాపరంగా మనకున్న ఆర్థిక సానుకూలత పేదరికాన్ని అంతం చేయటానికి, అభివృద్ధిని పెంచటానికి తోడ్పడుతుంది. లేకుంటే, అక్కడక్కడా అభివృద్ధి వెలుగులు తప్ప, దేశం నిరంతర పేదరికం చీకట్లో చిక్కుకుపోయే ప్రమాదం ఉంది.


• డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

'మరో గ్రంథాలయ ఉద్యమం' సదస్సు

మరో గ్రంథాలయ ఉద్యమం రెండవ మహాసభ హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి జరుగుతుంది. 'చరిత్రలోకి నడిచిన గ్రంథాలయాల వ్యవస్థ', 'డిజిటల్ కాలంలో గ్రంథాలయాల అభివృద్ధి– మన కర్తవ్యాలు', 'తెలంగాణలో నడుస్తున్న వివిధ గ్రంథాలయ ప్రయోగాలు', 'ఇళ్లలో ఊళ్లలో స్కూళ్లలో గ్రంథాలయాల అభివృద్ధి' అనే అంశాలమీద ఈ సదస్సులో చర్చలు జరుగుతాయి. కె.శివారెడ్డి, ఖాదర్, వేదకుమార్, వాడ్రేవు చినవీరభద్రుడు, గుడిపాటి, కవి యాకూబ్, పెద్దింటి అశోక్ కుమార్, సె[illegible]బా, సంగిశెట్టి శ్రీనివాస్, వొమ్మిరమేష్, సజయ, వి.ఆర్. శర్మ, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, బుద్ధి యజ్ఞమూర్తి, బండారు విజయ, యంవీ రామిరెడ్డి, అన్నవరం దేవేందర్, దేశరాజు, జిఎస్ చలం, ఎస్ కాత్యాయని, బమ్మిడి జగదీశ్వరరావు, ఆశారాజు, నాగసూరి వేణుగోపాల్, చొక్కాపు వెంకటరమణ, కాసుల రవికుమార్, ఆస్నా శ్రీనివాస్, హరిత, గరిపెల్ల అశోక్, కె. శాంతారావు, కొసరాజు సురేష్, మంచికంటి, వెంకటకృష్ణ, దశరథ్, సంజీవ్ తదితరులు పాల్గొంటారు.

– నిర్వహణ కమిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





కంటికి కనిపించవా..



మైలవరం పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా నిర్మితమవుతున్న కట్టడమిది. సీఆర్‌డీఏ అధికారులు కూల్చేశామని చెబుతున్నది దీనినే..





సర్వే నెంబర్ 523-అక్రమ లే అవుట్‌లోని నిర్మాణం (పై ఫొటో). సర్వే నెంబర్ 524లో అక్రమ లే అవుట్‌లో పనులు (కింద ఫొటో). ఈ రెంటినీ కూడా కూల్చేశామనే పేర్కొన్నారు



సర్వే నెంబర్ 306, 307లోని ఈ లే అవుట్ కూడా సీఆర్‌డీఏ కూల్చేసిన లిస్టులో ఉన్నదే..

భూమంతర్

మైలవరంలో అక్రమ లే అవుట్లపై సీఆర్‌డీఏ అబద్ధాలు

కాసులు దండిగా ముట్టజెబితే చాలు.. లేనివి ఉన్నట్టుగా.. ఉన్నవి కూల్చేసినట్టుగా సీఆర్‌డీఏ అధికారులు ప్రజల కళ్లకు గంతలు కడతారు. మైలవరంలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ లే అవుట్లపై పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఈ పనే చేశారు. అక్రమ లే అవుట్లపై వస్తున్న ప్రజా ఫిర్యాదులను కప్పిపుచ్చడానికి వాటిని కూల్చేశామని అబద్ధాలు చెబుతున్నారు. ఈ అబద్ధాల వెనుక రూ.కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజా ఫిర్యాదుల నేపథ్యంలో కూల్చేశామని కప్పిపుచ్చే కబుర్లు

- వాస్తవానికి అక్రమ లే అవుట్లపై చర్యలు శూన్యం
- యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు.. ఫ్లాట్లు కూడా నిర్మాణం..
- పంచాయతీ, సీఆర్‌డీఏ అధికారుల విలాఖత్‌తో నిర్మాణాల్లో జోరు
- లైసెన్స్‌డ్ ఇంజనీర్ సహకారంతో రూ.కోట్ల ముడుపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మైలవరంలోని సర్వే నెంబర్ 306/307లో దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో అనధికారిక లే అవుట్‌పై ఇటీవల సీఆర్‌డీఏ అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. ఇది అక్రమ లే అవుట్ అని పంచాయతీ అధికారులు ఒక బోర్డు పెట్టి చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత బోర్డు మాయమైంది. ఈ అక్రమ లే అవుట్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నిస్తే.. విచారణకు డాక్యుమెంట్లు తీసుకుని రావాలని నోటీసులిచ్చామని, కఠిన చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వక వివరణ ఇచ్చి వదిలేశారు. వాస్తవమేమిటంటే.. అందులో ప్లాట్లు వేసి అమ్ముకోవటం కూడా జరిగిపోయింది. ఈ అనధికార లే అవుట్‌లోని ప్లాట్ల అమ్మకంలో స్థానిక పంచాయతీ, సీఆర్‌డీఏ అధికారులకు భారీగా వాటాలు వెళ్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే, సర్వే నెంబర్ 523లో ఎకరం విస్తీర్ణంలో దానపత్రాలు పంచాయతీకి సమర్పించి అనధికారిక లే అవుట్ వేశారు. ఈ దానపత్రాలతో ఆ స్థలాన్ని రోడ్డుగా చూపించుకున్నారు. పంచాయతీకి దానపత్రం ఇస్తే ఆ స్థలాన్ని పంచాయతీకి స్వాధీనం చేయాల్సి ఉంటుంది. అలా స్వాధీనం చేయకుండానే అందులో అనధికార నిర్మాణం తలపెడుతున్నారు. దీనిని కూల్చేశామని అధికారులు చెబుతున్నా వాస్తవానికి బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. తదుపరి దశ పనులు జరుగుతున్నాయి. సర్వే నెంబర్ 524లో మరో పరిస్థితి. ఎలాంటి దానపత్రాలు లేకుండానే అక్రమ కట్టడాన్ని నిర్మిస్తున్నారు. అలాగే, మైలవరం పట్టణం మార్కెట్ యార్డు ఎదురుగా మరోచోట అక్రమ నిర్మాణం జరుగుతోంది. దానిని కూడా కూల్చేసినట్టుగా సీఆర్‌డీఏ అధికారులు చూపారు. వాస్తవానికి వీటిని కూల్చలేదు. మరి ఎవరి కళ్లకు గంతలు కట్టడానికి అక్రమ కట్టడాలను కూల్చేశామని అబద్ధపు సమాచారం చేస్తున్నారో సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ చెప్పాలి.

లైసెన్స్‌డ్ ఇంజనీర్ పాత్ర

ఇటీవల కాలంలో మైలవరం పట్టణ పరిధిలో అక్రమ కట్టడాలు, లే అవుట్లు జోరుగా వెలుస్తున్నాయి. వీటిపై కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందనకు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కలెక్టర్ ఢిల్లీరావు విచారణకు ఆదేశించారు. మైలవరం మాజీ ఈవో ఒకరి ప్రోద్బలంతో, సీఆర్‌డీఏ అధికారుల సహకారంతో ఈ అక్రమ కట్టడాలు, లే అవుట్లు వెలుస్తున్నాయి. ఇందులో స్థానికంగా ఉన్న ఒక లైసెన్స్‌డ్ ఇంజనీర్ పాత్ర కూడా ఉంది. తాజాగా అక్రమ కట్టడాలను కూల్చినట్టుగా సీఆర్‌డీఏ అధికారులు ఇచ్చిన సమాచారం వెనుక ఈ లైసెన్స్‌డ్ ఇంజనీర్ హస్తం ఉన్నట్టుగా తెలుస్తోంది. అక్రమ కట్టడాలను కూల్చేసినట్టుగా సీఆర్‌డీఏ అధికారుల ద్వారా సమాచారం ఇప్పించి, చాపకింద నీరులా అక్రమ నిర్మాణాలు, లే అవుట్లకు సహకరించాడు. ఈ వ్యవహారంలో సీఆర్‌డీఏ అధికారులకు రూ.కోట్ల ముడుపులు అందాయన్న ఆరోపణలు వస్తున్నాయి.



కరుణించు మేరీమాత..

గుణదలమాత శతాబ్ది మహోత్సవాలు శనివారం రెండోరోజూ ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గుణదల పరిసరాలు కిక్కిరిసిపోయాయి. కొండ కింద ప్రార్థనామందిరంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులు కొండపై గుహ వద్ద మరియమాతను దర్శించి శిఖరాగ్రాన ఉన్న శిలువ వద్దకు చేరుకుంటున్నారు.

- 4లో..

కహాన్ కబీర్



సామాజిక దురాచారాలను వ్యతిరేకిస్తూ కబీర్ సాగించిన జీవన విధానాన్ని, ప్రవచించిన తత్వశాస్త్రాన్ని, సత్యచైతన్యాన్ని 'కహాన్ కబీర్' నాటకంలో కళాకారులు చక్కగా చూపించారు. అంతర్జాతీయ నాటక ప్రదర్శనల్లో భాగంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదర్శించిన ఈ నాటకంలో భోపాల్‌కు చెందిన రంగ్ విధూషక్ బృందంలోని 30 మంది నటులు కబీర్ జీవిత చిత్రాన్ని చూడచక్కగా ఆవిష్కరించారు.

ఖాళీగా కార్మిక శాఖ



వ్యాపారాలకు లైసెన్సులన్నీ సచివాలయాల్లోనే..

- కనీస పరిశీలన లేకుండానే లైసెన్సుల జారీ
- పేరుకే పరిమితమైన కార్మిక శాఖ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కార్మిక శాఖతో సంబంధం లేకుండా వ్యాపారాలకు లైసెన్సులు జారీ అవుతున్నాయి. తోపుడుబండ్లపై వ్యాపారాలను వినహాయిస్తే వివిధ వ్యాపారాలు చేసేవారు నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకుంటున్నారు. తర్వాత కార్మిక శాఖ నుంచి లేబర్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ లైసెన్స్ జారీచేసే విషయంలో ఎలాంటి పరిశీలనలు, తనిఖీలు ఉండట్లేదు. సంబంధిత శాఖ ప్రమేయం లేకుండానే లైసెన్సులు వ్యాపారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో వ్యాపారులకు అవసరమైన లైసెన్సులను మంజూరు చేయడానికి ఆయా శాఖలను ఒక గొడుకు కిందకు తీసుకొచ్చింది. దీనికి సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాలకు వెబ్‌సైట్‌ను ఇచ్చింది. ఇంతకుముందు వ్యాపారులు లేబర్ లైసెన్స్ కోసం కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లేవారు. ఇప్పుడు ఈ లైసెన్స్ కావాల్సినవారు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తున్నారు. అక్కడే ఉన్న అసిస్టెంట్లు ఆధార్‌కార్డు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. ఇలా చేసిన దరఖాస్తు కార్మిక శాఖకు వెళ్లడం లేదు.

ఓపెన్ కాని లింక్‌లు

లేబర్ లైసెన్స్ కోసం వ్యాపారులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే కాకుండా ఈసేవ, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి కార్మికశాఖకు పంపాలి. ఈ లైసెన్సులకు సంబంధించిన లింక్‌లను కార్మిక శాఖకు అనుసంధానం చేశారు. ఈ లింక్‌లను తెరిచాక దరఖాస్తులను పరిశీలించి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి తనిఖీలు, దరఖాస్తుల పరిశీలనలు లేకుండానే లైసెన్సులు జారీ అవుతున్నాయి. కార్మిక శాఖకు అనుసంధానం చేసిన ఈ వెబ్‌సైట్ల లింక్‌లు తెరుచుకోవడం లేదు. దీంతో ఏ వ్యాపారి లైసెన్సుకు దరఖాస్తు చేసుకున్నాడో అధికారులకు తెలియడం లేదు. దరఖాస్తు చేశాక కొన్నిరోజులు గడువు ఇచ్చి లైసెన్సులను గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేస్తున్నారు. ఆయా వ్యాపారంలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు, అసలు కార్మికులు ఉన్నారా, లేదా అనే పరిశీలనతో సంబంధం లేకుండా లైసెన్సులు ఇచ్చేస్తున్నారు. దీనిపై కార్మిక శాఖ వర్గాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో ఎన్ని వ్యాపారాలు ఉన్నాయి, వాటిలో ఎన్నింటికి లైసెన్సులు ఉన్నాయన్న వివరాలు కార్మిక శాఖ వద్ద అందుబాటులో ఉండడం లేదు. అన్నీ సచివాలయాల నుంచే జరుగుతున్నప్పుడు తమ వద్ద వివరాలు ఎలా ఉంటాయని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఒక డోర్ నెంబర్.. 26 ఓట్లు..!



కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి స్కూల్ డోర్ నెంబర్‌తో నమోదైన 26 ఓట్లు

పశ్చిమలో మరో దొంగ ఓట్ల బాగోతం

- వైసీపీ కార్పొరేటర్ స్కూల్ డోర్ నెంబర్‌తో 26 ఓట్లు
- టీడీపీ నాయకుల పరిశీలనలో నిర్ధారణ
- స్కూల్ స్టాఫ్ ఓట్లుగా కప్పిపుచ్చుతున్న బీఎల్వో
- సదరు కార్పొరేటర్ బంధువుల పేర్లంటున్న టీడీపీ నేతలు

ఆర్వోకు ఫిర్యాదు చేయాలని నిర్ణయం



భవానీపురంలోని కార్పొరేటర్‌కు చెందిన స్కూల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్/భవానీపురం) : పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 40వ డివిజన్ కార్పొరేటర్ ఆంజనేయరెడ్డికి చెందిన ఓ స్కూల్ డోర్ నెంబర్ 76-10-25ఏ పేరుతో 26 ఓట్లు నమోదయ్యాయి. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పీవీ చిన్న సుబ్బయ్య స్థానిక బూత్ కన్వీనర్లతో కలిసి శనివారం జరిపిన ఓటర్ల తుది జాబితా పరిశీలనలో ఈ విషయం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని స్థానిక బీఎల్వో దృష్టికి తీసుకెళ్లారు.

దొంగ ఓట్ల కథలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. సెంట్రల్ నియోజకవర్గంలోని ఒక బూత్ పరిధిలో చనిపోయిన వారి ఓట్లను వేరే బూత్‌లో బతికున్న వారుగా చూపించిన ఘటన మరువకముందే.. పశ్చిమ నియోజకవర్గంలో ఒకే డోర్ నెంబర్‌తో 26 ఓట్లు కనిపించడం చర్చనీయాంశమైంది.

బుకాయించిన బీఎల్వో

ఒకే డోర్ నెంబర్‌పై అన్ని ఓట్లు ఎలా వచ్చాయో పరిశీలించాల్సిన బీఎల్వో బుకాయింపునకు దిగాడు. ఆ ఓట్లన్నీ ఉన్నాయని వాదించాడు. కార్పొరేటర్‌కు చెందిన ఆ స్కూల్ సెల్లార్‌తో కలిపి నాలుగంతస్థులుగా ఉంది. నాల్గో అంతస్థులో కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి, ఆయన సతీమణి, ఇద్దరు కుమార్తెలు నివాసం ఉంటారు. వీరు తప్ప ఈ స్కూల్‌లో ఎవరూ ఉండరు. అలాంటిది ఏకంగా 26 బయటి ఓట్లు ఈ స్కూల్ డోర్ నెంబర్‌లో ఉన్నట్టు కనిపించాయి. అక్కడెవరైనా ఉన్నారేమోనని టీడీపీ నాయకులు పరిశీలించగా, ఎవరూ లేరని తెలిసింది. ఈ విషయాన్ని నిర్ధారించుకున్నాక స్థానిక బీఎల్వోకు ఫిర్యాదు చేశారు. అవన్నీ స్కూల్లో పనిచేసే స్టాఫ్ ఓట్లని బీఎల్వో బుకాయించాడు. స్టాఫ్ ఎక్కడ నివసిస్తారో అక్కడే ఓట్లు ఉంటాయని, పనిచేసే ప్రదేశంలో ఎందుకుంటాయని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. అయితే, ఈ ఓట్లు ఎవరివన్నవి తెలియలేదు. స్థానికంగా ఉండేవారు కాదని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అన్నీ దొంగ ఓట్లేనని ఆరోపిస్తున్నారు. బీఎల్వోపై కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి ఒత్తిడి తెచ్చి ఈ ఓట్లను నమోదు చేయించినట్టుగా విమర్శిస్తున్నారు.

దొంగ ఓట్లు ఇవే..

కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి స్కూల్ డోర్ నెంబర్ పేరుతో తాడేపల్లి రాధామాధవి, యారడ్ల సీతామహాలక్ష్మి, ఉప్పులూరి ఇందిర, పుచ్చ రామలక్ష్మి, శనికొమ్ము రమణారెడ్డి, యారడ్ల జ్ఞానేంద్రరెడ్డి, కొండా రమాదేవి, గోతం కనమ్మ, యారడ్ల వేలుకొండారెడ్డి, యారడ్ల శ్రీనివాసరెడ్డి, దేవరాజుగట్టు అరవింద్, ఎరిగి కృష్ణకుమారి, యారడ్ల నాగార్జునరెడ్డి, వరికూటి వెంకట సుస్మిత, వెంపటి వెలుగొండారెడ్డి, పాములపాటి ప్రకాష్‌రెడ్డి, గాట్ల తిరుపతిరెడ్డి, గాట్ల స్వాతి, వరికూటి రమాదేవి, వరికూటి రమణారెడ్డి, యారడ్ల అఖిల, యారడ్ల ఆదినారాయణ, యారడ్ల ఆంజనేయరెడ్డి పేర్లు ఉన్నాయి. వీటిలో ఆంజనేయరెడ్డి కుటుంబ సభ్యులు కాకుండా యారడ్ల ఇంటిపేరుతో ఉన్నవారు ఇతర ప్రాంతాలకు చెందిన వారి బంధువులు అని తెలుస్తోంది. దొంగ ఓట్లపై ఎన్ని ఫిర్యాదులు చేసినా బీఎల్వో పట్టించుకోకపోవటంతో టీడీపీ నాయకులు సోమవారం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో)కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

వైసీపీ నగర అధ్యక్షుడిగా మల్లాది విష్ణు



విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నగర కమిటీ అధ్యక్షుడిగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియమితులయ్యారు. వైసీపీ అధిష్ఠానం శనివారం రాత్రి విడుదల చేసిన జాబితాలో మల్లాది విష్ణు పేరును ప్రకటించింది. కొద్దిరోజుల క్రితమే విష్ణును సెంట్రల్ నియోజకవర్గం బాధ్యతలను తప్పించి పక్కన పెట్టింది. ఈ స్థానంలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును నియమించింది. ఇటీవల వరకు నగర కమిటీ అధ్యక్షుడిగా ఉన్న బొప్పన భవకుమార్ వైసీపీకి రాజీనామా చేసి, టీడీపీ వైపునకు వెళ్లారు. దీంతో ఖాళీ అయిన స్థానంలో ఎవరిని నియమించాలన్న ఆలోచనలు చేసిన అధిష్ఠానం మల్లాది విష్ణుకు అవకాశం ఇచ్చింది. సీటు దక్కకపోవడంతో కొద్దిరోజులుగా మల్లాది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దాన్ని తొలగించడానికి ఈ అధ్యక్ష పదవిని కట్టబెట్టారని తెలుస్తోంది.



వినూత్నంగా..

తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించి, అందులో 4 వేల పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, వ్యాయామ ఉపాధ్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం వినూత్న నిరసన చేపట్టారు. ధర్నాచౌక్‌లో అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని, తలకిందులుగా వేలాడుతూ ఆందోళన చేశారు. జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గుణదల చర్చి పరిసరాల్లో కిటకిటలాడుతున్న క్రైస్తవులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు



బిషప్‌గ్రాసీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వేదికపై సమష్టి దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

మరియమాతకు వందనం

లూర్దుమాత నామస్మరణతో మార్మోగిన గుణదల కొండ ● రెండో రోజుకు శతాబ్ది మహోత్సవాలు

గుణదల, ఫిబ్రవరి 10: యేసును నమ్ముకుని జీవిస్తున్న ప్రతి ఒక్కరి హృదయంలో గుణదలమాత కొలువై ఉండాలని శ్రీకాకుళం కథోలిక పీఠం బిషప్ రాయరాల విజయకుమార్ అన్నారు. గుణదలమాత శతాబ్ది మహోత్సవాలు శనివారం రెండోరోజుకు చేరుకున్నాయి. బిషప్ గ్రాసీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన సందేశమిచ్చారు. నేటితరం యువత మరియమాతను ఆదర్శంగా తీసుకుని జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్వహించుకుంటున్న 100 వసంతాల వేడుకల వెనుక గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం అభివృద్ధికి ఎంతో మంది పీఠాధిపతులు, గురువులు కృషి దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం శతాబ్ది వేడుకల పూజా పీఠంపై విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మొన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్‌రాజు డయోసిస్‌కు చెందిన మరో 80మంది గురువులతో కలిసి సమష్టి దివ్య పూజాబలిని సమర్పించారు. పూజ అనంతరం బిషప్ రాయరాల విజయకుమార్ కథోలిక భక్తులకు పవిత్ర దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. రెండోరోజు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో గుణదల కొండపైకి వెళ్లే మార్గాలన్నీ కిటకిటలాడాయి.





దివ్యపూజాబలి అనంతరం భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేస్తున్న గురువు



మోకాళ్లపై కొండ ఎక్కుతున్న భక్తురాలు, ఉత్సవాలకు తరలివచ్చిన క్రైస్తవులు

జగన్‌రెడ్డి అరాచకాలపై లోకేశ్

పూరించిన నాదమే శంఖారావం

▸▸ మాజీ మంత్రి కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10: సీఎం జగన్‌రెడ్డి అరాచకాలపై నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్రతో కలిసి ఆయన మాట్లాడారు. 40 రోజుల్లో 120 నియోజకవర్గాల్లో ఆదివారం నుంచి శంఖారావం పేరుతో లోకేశ్ పర్యటిస్తున్నారన్నారు. రోజుకు మూడు నియోజకవర్గాలలో శంఖా రావం కార్యక్రమం ఉంటుందన్నారు. శంఖారావం ద్వారా వివిధ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెపాఆరు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు.

ప్రజాధనంతో సభలకు వైసీపీ సిద్ధం: కొల్లు రవీంద్ర

ప్రజాధనంతో సిద్ధం సభలను వైసీపీ నిర్వహిస్తోందని కొల్లు రవీంద్ర ఆరోపిం చారు. అసెంబ్లీ సమావేశాల్లో 34 మంది ఎమ్మెల్యేలే హాజరవడం జగన్‌పట్ల ఎమ్మెల్యేలకున్న విశ్వసనీయతను తెలియజేస్తోందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలు పళ్లు ఊడగొడ తారన్నారు. జనసేన-టీడీపీ పొత్తు ప్రజలు కోరుకున్నదేనన్నారు. ఐదేళ్ల పాటు జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రత్యేక హోదాపై కేంద్రంపై ఒత్తిడి తేలేదన్నారు. అధికారంలోకి వచ్చాక పేర్ని అక్రమాలు బయటకు తీస్తామన్నారు. ఎన్నికల తర్వాత పేర్ని నాని డ్రైవర్‌గా, కొడాలి నాని క్లీనర్‌గా మారిపోతారన్నారు.

శంఖారావంతో కదలనున్న వైసీపీ పునాదులు: నెట్టెం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 10: యువగళంతో రాష్ట్రంలో అధికార పార్టీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి కదలిక తెచ్చిన నారా లోకేశ్ ఆదివారం నుంచి ప్రారంభించనున్న శంఖారావంతో వైసీపీని పునాదులతో పెకలించబోతున్నారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. రోజురోజుకీ వైసీపీ గ్రాఫ్ పడిపోతోందని, ఈ శంఖారావంతో ఆ గ్రాఫ్ మరింత దిగజారిపోతోందని, రాష్ట్రంలో అధికార మార్పుకు ఇది సంకేతమని ఆయన అన్నారు.



కొమరవోలులో పాదయాత్ర చేస్తున్న వర్ల కుమార్‌రాజా

కొద్దిరోజుల్లో వైసీపీ ప్రభుత్వం అంతం

▸▸ సిద్ధం సభల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధమంటున్నారు సీఎం

▸▸ ఆయనే ఓ పెద్ద పెత్తందారుడు: వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలన సాగిస్తోందని, అన్ని వర్గాల ఉసురు పోసుకుంటోందని, మరికొద్దిరోజుల్లో ఆ ప్రభుత్వానికి అంతం తప్ప దని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కార సాధన కోసం ఐదురోజుల నుంచి టీడీపీ-జనసేన ఆధ్వ ర్యంలో మండలంలో నిర్వహిస్తున్న పల్లెబాట పాదయాత్ర కొమరవోలు నుంచి శని వారం ప్రారంభమైంది. పాదయాత్ర జమీగొల్వేపల్లి వరకు కొనసాగింది. జమీ గొల్వేపల్లిలో నిర్వహించిన సభలో కుమార్‌రాజా మాట్లాడారు. రాష్ట్రానికి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని, ఆయన ఇటీవల నిర్వహిస్తున్న సిద్ధం సభల్లో పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం అంటు న్నారని, దేశంలోని రాజకీయనాయకుల్లో ఆయన కంటే డబ్బున్న నాయకుడు, పెద్ద పెత్తందారు ఎవరూ లేరని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పామర్రు నియోజక వర్గంలో వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ నేతలు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, కాకరాల హరిబాబు, పెనుమాక లక్ష్మణరావు, యెర్నేని అరవింద్, వల్లభనేని వెంకటరత్నం, వీరంకి గురుమూర్తి, మండపాక శంకర్‌బాబు పాల్గొన్నారు.

మరుభూమికి దారేదీ..

▸▸ ఆక్రమణలు, ముళ్లకంచెలతో మూసుకుపోయిన పులిగడ్డ శ్మశానవాటిక మార్గం

▸▸ పాతిక అడుగుల ఎత్తు కరకట్టపై నుంచి నిలువుగా మృతదేహాన్ని దించుకుంటూ శ్మశానవాటికకు తీసుకెళ్లే దుస్థితి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 10: పులిగడ్డ శ్మశానవాటికకు వెళ్లాలంటే 25 అడుగుల ఎత్తు ఉన్న కరకట్టపై నుంచి నిలువుగా శవాన్ని కిందకు మోసుకుంటూ తీసుకెళ్లాల్సి వస్తోంది. దానిక తోడు ఆక్రమణ లు, ముళ్లకంచెలతో మార్గం మూసుకుపోయింది. తాజాగా గ్రామస్థుడు ఆరిగ సువర్ణరావు(59) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శనివారం స్మశానవాటిక తీసుకెళ్లటానికి గ్రామస్థులు చాలా ఇబ్బందిపడ్డారు. ఓ వైపు పెరిగిన ముళ్ల కంపలను తొలగించుకుంటూ దారిని సరిచేసుకుంటూ శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్మశానవాటిక అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్లు ఓ వైపు ఆర్భా టంగా ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు ఇలా ఉన్నాయని, పాలకులు స్పందించి మార్గం సుగమం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇబ్బంది పడుతూ మృతదేహాన్ని తీసుకెళుతున్న గ్రామస్థులు



తొలగించిన చోటే..

భాస్కరపురంలో జెండా దిమ్మె వద్ద బైఠాయించిన జనసేన నాయకులు

జనసేన జెండా దిమ్మె

▸▸ భాస్కరపురంలో మళ్లీ దిమ్మెను నిర్మించిన జనసేన నాయకులు

▸▸ తొలగించేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసుల రాక

▸▸ పోలీసులకు, జనసేన నాయకులకు మధ్య వాగ్వివాదం

▸▸ దిమ్మె వద్దే బైఠాయించి, అక్కడే భోజనాలు చేసిన నాయకులు

▸▸ బండి రామకృష్ణ, నాయకుల అరెస్టు, స్టేషన్‌కు తరలింపు

▸▸ మచిలీపట్నంలో ఉద్రిక్తత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10: ఇటీవల భాస్కరపురంలో జనసేన జెండా దిమ్మెను మునిసిపల్ అధికారులు తొలగించారు. శనివారం అదే ప్రదేశంలో నూతన జెండా దిమ్మెను జనసేన నాయకులు నిర్మించారు. ఆ దిమ్మెను తొలగించేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసు బలగాలతో వచ్చారు. దీంతో పోలీసులకు, జనసేన కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడు గంటల సేపు జెండా దిమ్మె వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నాయకులు గడ్డం రాజు, కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము, మైఖేల్ తదితరులు ఆందోళనకు దిగారు. అక్కడే బైఠాయించారు. జెండా దిమ్మె వద్దే రోడ్డుపైనే భోజనాలు చేశారు. దీంతో డీఎస్పీ నాగరాజు, సీఐలు, ఎస్ఐలు బండి రామకృష్ణ, గడ్డం రాజు, కొట్టె వెంకట్రావును అరెస్టు చేసి మచిలీపట్నం పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. తమ నాయకులను అరెస్టు చేయొద్దంటూ కార్యకర్తలు పోలీసు జీపులకు అడ్డుపడ్డారు.

పేర్ని నాని ఆదేశాలతోనే..

● దిమ్మె తొలగించాలని అధికారులొచ్చారు
● ఈ దిమ్మె తొలగిస్తే నగరంలో 50 దిమ్మెలు నిర్మిస్తాం
● బండి రామకృష్ణ హెచ్చరిక

ఎమ్మెల్యే పేర్ని నాని కనుసన్నల్లో అధికారులు పనిచేస్తున్నారని, ఆయన ఆదేశాలతోనే జెండా దిమ్మె తొలగించేందుకు అధికారులు వచ్చారని జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ విమర్శించారు. ఎవరికీ అడ్డు లేకుండా జెండా దిమ్మను నిర్మించామన్నారు. ఈ జెండా దిమ్మను తొలగిస్తే నగరంలోని 50 డివిజన్లలో జెండా దిమ్మలు నిర్మిస్తామన్నారు. కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టే ధోరణిలో మునిసిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లను ఆనుకుని వైసీపీ నాయకులు జెండా దిమ్మెలు నిర్మించారని, వాటిని తొలగిస్తారా అని బండి రామకృష్ణ, కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు ప్రశ్నించారు.

దిమ్మెను తొలగిస్తే తీవ్ర పరిణామాలు: బండ్రెడ్డి రామకృష్ణ

జెండా దిమ్మె నిర్మించిన ప్రదేశాన్ని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పరిశీలించారు. నూతనంగా నిర్మించిన జెండా దిమ్మను తొలగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మచిలీపట్నం పోలీసుస్టేషన్ వద్ద జనసేన నాయకులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. తర్వాత అరెస్టు చేసిన నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిసిన వెనిగండ్ల రాము

మర్యాదపూర్వకంగా..

గుడివాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో శనివారం టీడీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి పవన్‌ను శాలువతో సత్కరించారు. గుడివాడ రాజకీయాలపై ఇద్దరూ చర్చించారు. గుడివాడలోని జనసేన నాయకులు, కార్యకర్తలు తనకు సహకారం అందిస్తున్నారని, ఈసారి ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయం తథ్యమని వివరించారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ నిర్లక్ష్యానికి తావు లేకుండా అందరినీ సమన్వయపరుచుకుని ముందుకు వెళ్లాలని పవన్ సూచించినట్టు వెనిగండ్ల తెలిపారు.

నేడు శ్రీకృష్ణదేవరాయ

తెలుగు జైత్రయాత్ర మహోత్సవం

ఘంటసాల, ఫిబ్రవరి 10: శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామి(ఆంధ్రమహావిష్ణు) దేవస్థానంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు జైత్రయాత్ర మహోత్సవం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి గ్రామస్థుల సహకారంతో ప్రారంభమవుతుందని ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు.

ప్రత్యేక కార్యక్రమాలు

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సంప్రదాయ ముగ్గుల పోటీలు, ఉదయం 9 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం, 11 గంటలకు కూచిపూడి నాట్య అకాడమీకి చెందిన కేవీ జ్యోతి శిష్యబృందంతో కూచిపూడి నాట్యప్రదర్శన, మధ్యాహ్నం 2 గంటల నుంచి చిన్నారులకు ఆటల పోటీలు, తంబోల, హౌసీ పోటీలు, సాయంత్రం 5 గంటల నుంచి ఫ్యాన్సీ డ్రస్ పోటీలు(శ్రీకృష్ణదేవరాయలు, శ్రీకాసుల పురుషోతం కవి), వృద్ధ కళాకారులకు సన్మానం, సంగీత విభావరి, పాడుతా తియ్యగా, రాత్రి 6 గంటల నుంచి కె.కె.తరంగిణి ఈవెంట్స్-గుంటూరు సినీ సంగీతం, భక్త రంజని), ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీకాసుల కృష్ణమరాజుతో మాట్లాడే బొమ్మ, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో

15 నుంచి ఉచిత శిక్షణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 10: ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలో ఈనెల 15నుంచి వివిధ వృత్తినైపుణ్య కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్(స్త్రీ/పురుషులు) నర్సింగ్ (స్త్రీలకు మాత్రమే), డీటీపీ, ఐటీ బేసిక్స్ (స్త్రీ/పురుషులు) కోర్సుల్లో రెండునెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి వరకు చదివి, 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న ఉభయ రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామని, శిక్షణానంతరం కోర్సుకు సంబంధించిన మెటీరియల్, సర్టిఫికెట్స్‌తోపాటు ఉద్యోగ, ఉపాధి కల్పనలో తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తిపేరు, ఊరు, మండలం, జిల్లా, రాష్ట్రం, ఆధార్, ఫోన్ నెంబర్‌తో పూర్తివివరాలు 9347897922 ఫోన్ నెంబర్‌కు పంపాలని సూచించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

వేగవంతం చేయండి

▸▸ అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

కృష్ణలంక, ఫిబ్రవరి 10: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులకు అందించిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి హక్కు పత్రాలు అందించాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. శనివారం జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి చందర్లపాడు-2 సచివాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రామ సచివాలయం ద్వారా చేస్తున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారులందరికీ త్వరితగతిన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా ప్రక్రియ సాగేలా చూడాలని ఆదేశించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

▸▸ ఎన్నికల సన్నద్ధతపై వీసీలో సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 10: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేశ్‌కుమార్ మీనా శనివారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఈవో బీహెచ్ భవానీశంకర్ కలిసి కలెక్టర్ హాజరయ్యారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశనం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు ఏర్పాటు, కమ్యూనికేషన్ ప్రణాళిక, సాంకేతిక వినియోగ ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం

▸▸ కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

అవనిగడ్డ, ఫిబ్రవరి 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ కార్యాయాలన్ని, పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శనివారం పరిశీలించారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు, సున్నితమైన గ్రామాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారం నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదించవచ్చునని ఎస్పీ సూచించారు. డీఎస్పీ మురళీధర్, సీఐ త్రినాథ్, ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ది అవివేక పాలన: చింతమనేని

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 10: "సీఎం జగన్ అవివేక పాలన చేస్తున్నారు. దీంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. అమ్మ ఒడి పేరుతో తల్లులను మోసం చేసి గద్దె నెక్కారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి." అని ప్రజలను దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. శనివారం ఏపూరు గ్రామ పరిధిలోని నూజివీడు, ఏలూరు రోడ్డుల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చింతమనేనికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వ్యాపార సముదాయాలు, వర్తక దుకాణాలకు వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీ పథకాలపై పజల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ పెదపాడు మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, జనసేన దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త ఘంటసాల వెంకటల్క్ష్మి, స్థానిక నాయకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, మట్టాశ్రీనివాసరావు, వడ్డి భార్గవ్, గరికపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్‌లో కరపత్రాలు పంచుతున్న చింతమనేని



నిమ్మకూరులో ఎన్టీఆర్-బసవతారకం విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

పుణ్యదంపతులకు నివాళి

పామర్రు, ఫిబ్రవరి 10: బీజేపీ రాష్ట్ర అధక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పామర్రు నియోజకవర్గంలో పల్లెకు పోదాం కార్యక్రమం ప్రారంభించేందుకు విచ్చేసిన సందర్భంగా శనివారం ఆమె స్వగ్రామమైన నిమ్మకూరుకు విచ్చేశారు. గ్రామంలోని ఆమె తల్లిదండ్రులు ఎన్టీఆర్-బసవతారకం విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఆమెకు గ్రామస్థులు, బంధుమిత్రులు స్వాగతం పలికారు. అనంతరం మొవ్వ మండలంలోని కోసూరు, కాజ గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ బూత్ కమిటీ సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధివిధానాలను నాయకులు, కార్యకర్తలకు వివరించారు.

మధ్యాహ్న భోజనం తిన్న ఇరవై మంది విద్యార్థులకు కడుపునొప్పి

▸▸ అరిపిరాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘటన

▸▸ బడికి కొత్త రేషన్ బియ్యం సరఫరా చేశారన్న ఎంఈవో-2 రాజ్‌కుమార్

నందివాడ, ఫిబ్రవరి 10: అరిపిరాల హైస్కూల్‌లో మధ్నాహ భోజనం చేసిన తర్వాత విద్యార్థుల్లో కొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. శుక్రవారం 56 మంది విద్యార్థులు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. అందులో 20మంది విద్యార్థులు కడుపులో నొప్పి అంటూ ఏడ్వడం ప్రారంభించారు. ఉపాధ్యాయులు మాత్రలు వేశారు. అందులో పద్దెనిమిది మందికి నొప్పి తగ్గింది. ఇద్దరికి నొప్పి తగ్గకపోవడంతో వెంటనే వెంకటరామాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ ఇంజెక్షన్ చేసి, వైద్యం చేశాక నొప్పి తగ్గడంతో ఇంటికి పంపారు. కలెక్టర్ స్పందించి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎంఈవో -2 డేవిడ్ రాజును వివరణ కోరగా..కొత్త రేషన్ బియ్యం పాఠశాలకు సరఫరా చేశారని, వాటితో వండిన అన్నాన్ని తినడంతోనే ఈ ఘటన జరిగిందని తెలిపారు. డాక్టర్ మధును వివరణ కోరగా..తిన్న అన్నం అరగక కడుపులో నొప్పి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు కింద బడులను అభివృద్ధి చేస్తున్నాం అంటూ గొప్పలు చెప్పుకోవటం తప్ప విద్యార్థుల భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 10 : లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం జరిగింది. లూనా సెంటర్ వద్ద నివాసం ఉండే కొప్పుల వెంకట లక్ష్మీ(60) శనివారం ఉదయం తన కుమార్తె ద్విచక్ర వాహనంపై అంబాపురంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా అన్నపూర్ణ బార్ అండ్ రెస్టారెంట్ ప్రాంతంలో వెనుక నుంచి టీఎస్ 07 యూఎఫ్ 5888 నెంబరు లారీ ఢీకొంది. వాహనంపై నుంచి తల్లీకూతుళ్లు కిందపడిపోయారు. గాయపడిన వారిద్దరినీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకట లక్ష్మీ మృతి చెందింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి



పేదలకు గద్దె ఆర్థిక సాయం

రాణిగారితోట: పేదలకు సాయం అందించడంలో ఎల్లప్పుడూ ముందుండే గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కావడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. సీనియర్ నేత నాగవరపు దుర్గారావు భార్య వైద్య ఖర్చుల నిమిత్తం గద్దె రామ్మోహన్ పంపిన రూ.20వేలు, మరో పార్టీ కార్యకర్త ఎం.చెన్నకేశవులకు జీవనోపాధి నిమిత్తం రూ.10 వేలు శనివారం డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద అందజేశారు. పీరుబాబు, శ్రీను, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

పాయకాపురం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. 64వ డివిజన్ కండ్రికలోని 106వ పోలింగ్ బూత్ పరిధి లో ఓటర్ వెరిఫికేషన్ శనివారం జరిగింది. ఇంటింటికీ వెళ్లి నూతన ఓటరు జాబితాను పరిశీలించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కుట్రలు, కుయుక్తులతో గెలవాలని చూస్తోందన్నారు.

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 10 : చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. 23వ డివిజన్ కార్యకర్తల సమావేశం సూర్యారావుపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగింది. డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొండా ఉమా మాట్లాడుతూ రానున్న 60 రోజులు పార్టీకి కీలకమన్నారు. టీడీపీ పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు తీసుకువెళ్లాలన్నారు. సీఎం జగన్మోహనరెడ్డి అరాచకపాలనను ప్రజలకు వివరించాలన్నారు. కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, డివిజన్ అధ్యక్షుడు టీడీపీ అధ్యక్షుడు చింతా దుర్గారావు, ప్రధాన కార్యదర్శి ఆలపాటి రాము, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

మధురానగర్ : టీడీపీ అధికారంలోకి రాగానే భవిష్యత్‌కు గ్యారెంటీతో ప్రకటించిన పథకాలను అన్నింటిని తక్షణమే అమలు చేస్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు చెప్పారు. శనివారం 29వ డివిజన్ మధురానగర్‌లో సాయిబాబా కాలనీ ఒకటో లైను నుంచి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఉమా శనివారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు స్వయంగా అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, ఇన్‌ఛార్జి నెక్కంటి ప్రసాద్, వెంకన్న, రాబిల్లి సూరి, జనసేన నాయకులు ఎల్. శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలపై లోకేష్ శంఖారావం

అజిత్‌సింగ్‌నగర్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలపై యువనేత నారా లోకేష్ పూరించిన నాదమే శంఖారావమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్, వైసీపీ నేతల అరాచకాలను వ్యతిరేకంగా ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టారన్నారు. తద్వారా కార్యకర్తలు నేరుగా లోకేష్‌తో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. పార్టీ నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, గాజుల రవి, గొట్టుముక్కల వెంకీ పాల్గొన్నారు.

రామరాజ్యం రావడం తథ్యం

సత్యనారాయణపురం : రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బొండా సిద్ధార్థ అన్నారు. బొండా ఉమా రావాలి.. సెంట్రల్ గెలవాలి నినాదంతో గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో 33వ డివిజన్‌లో శనివారం తిరుమలశెట్టివారి వీధి నుంచి బొండా సిద్ధార్థ పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొన్నారు. త్వరలో సైకో పాలన పోయి రామరాజ్యం వస్తుందన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమాలు ఇంటింటికీ తీసుకువెళతామన్నారు. డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయకుమార్, డివిజన్ అధ్యక్షుడుఎన్. కోటేశ్వరరావు, చామర్తి రవిబాబు, చిలువేరు శ్రీను, పొట్లూరి కృష్ణప్రసాద్, వేమూరి భానుప్రకాష్, టీఎన్ఎస్ఎఫ్ సెంట్రల్ అధ్యక్షుడు మనోజ్, ధనలక్ష్మి, తంగిరాల లక్ష్మి, శంకరసాయి, రామలక్ష్మి, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొండా ఉమామహేశ్వరరావు,



సమస్యలు తెలుసుకుంటున్న బొండా సిద్ధార్థ



ముత్యాలంపాడులో టీడీపీ నేత ప్రచారం

టీడీపీని గెలిపించండి

టీడీపీని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని 31వ డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ అన్నారు. ముత్యాలంపాడులోని భగత్‌సింగ్‌రోడ్డు, అల్లూరి సీతారామరాజు రోడ్డు, కొండపల్లి వారి వీధి, గోడవర్తి వారి వీధుల్లో బొండా ఉమాను గెలిపించాలని కోరుతూ టీడీపీ నేతలు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాల కరపత్రాలను పంచారు. డివిజన్ కార్యదర్శి ఎంవిఆర్‌సీ ప్రసాద్, ముత్యాలంపాడు యూనిట్ ఇంచార్జి దెందుకూరి మురళీకృష్ణంరాజు, పసుపుతోట ఇంచార్జి మహాలక్ష్మయ్య, శ్రీనివాసరావు,రాజేష్ వర్మ, కొండయ్య, కపర్ది శేషమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా 16న

విద్యాధరపురం : టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో ఈనెల 16వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. మొగల్రాజపురంలోని చిన్ని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులగూర చరణ్ యాదవ్ జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారిద్దరు మాట్లాడుతూ, జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగ పరచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సుమారు 40 సంస్థలు జాబ్ మేళాలలో పాల్గొంటున్నాయని, రూ.15 వేల నుంచి రూ.45 వేల వరకు జీతాలు ఉండే ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంపై ఎన్‌టీఆర్ జిల్లాలో విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఆర్.మాధవ్, యువ కిషోర్, అఖిల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించండి

వన్‌టౌన్ : రాష్ట్ర ప్రజలకు మేలు జరిగేందుకు రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్ మాధవ అన్నారు. వన్‌టౌన్‌లోని శివాలయం వీధి, బంగారుదుకాణాలలలో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు, బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలన్నారు. షారిఫ్, శ్రావణ్, రమేష్, దినేష్ పాల్గొన్నారు.

సమ్మె హామీలు అమలు చేయాలి

● 12,13న వినూత్న నిరసనలు

చిట్టినగర్, ఫిబ్రవరి 10 : సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.ఆర్. ఆంజనేయులు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విక్కి జేమ్స్ డిమాండ్ చేశారు. హామీలు అమలు కోరుతూ శనివారం చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి అవుతున్నా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల క్రమబద్ధీకరణ హామీని జగన్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. తమ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు కార్మికులు పెద్ద ఎత్తున్న పోరాటాలు చేశారని, స్పందించిన ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, దానికి సంబంధించిన జీవో నేటికి విడుదల కాలేదన్నారు.

వెంటనే ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 12, 13 తేదీల్లో వినూత్న పద్ధతిలో నిరసన తెలుపుతామన్నారు. యూనియన్ నాయకులు కొట్టు రమణరావు, తుపాలకు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సర్కిల్-1 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మిక నేత దివాకర్‌కు సీపీఎం నేతల నివాళి



చిట్టినగర్, ఫిబ్రవరి 10 : సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు కార్మిక నేత పి.దివాకర్ 20వ వర్ధంతి శనివారం పాలఫ్యాక్టరీ ఎదురుగా దివాకర్ భవనంలో జరిగింది. సీపీఎం నేతలు సి.హెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ జీ. ఆదిలక్ష్మి, బీ.రాజు, ఎం.కొండారెడ్డి, సీనియర్ నేతలు జి.సుబ్బారెడ్డి, టీ.జోసేఫ్, వీ.స్వప్న, ఎస్ అమరేంద్ర విక్రమ్, శ్రీను, బీ.రమణ, ఏ శ్రీను పాల్గొన్నారు.

పేద ముస్లిం కుటుంబానికి టిఫిన్ బండి వితరణ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 10 : ఏపీ 26వ నెల సేవలో భాగంగా అజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబానికి ఉపాధి నిమిత్తం తోపుడు బండిని అందజేశారు. టిఫిన్ వ్యాపారం చేసుకునేందుకు గాంధీనగర్‌లోని రాజ్‌యువరాజ్ సెంటర్‌లో వైసీపీ నేత బెజ్జం రవికుమార్ టిఫిన్ బండిని శనివారం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అజాద్ ముస్లిం కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలి



కృష్ణలంక, ఫిబ్రవరి 10: మలేరియా, డెంగ్యూ జ్వరాలు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సీనియర్ ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి పేర్కొన్నారు. కృష్ణలంక భ్రమరాంబపురంలోని డ్రైనేజీలను శనివారం ఆయన పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే క్షేత్రస్థాయి నుంచి మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు నివారించవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడేగా పాటించి, అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సబ్ యూనిట్ - 2 అధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు గౌరీశంకర్, శరత్‌చంద్ర, ఆంజనేయులు, రాఘవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్, ఫిబ్రవరి 10: విద్యార్థినిలు స్టాక్ మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలని స్టాక్ మార్కెట్ విశ్లేషకుడు ఎం.సాంబశివరావు అన్నారు. కేబీఎన్ కాలేజీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలు - మార్కెట్ అవకాశాలు అంశంపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. మేనేజ్‌మెంట్, కామర్స్ కోర్సులను చదివే విద్యార్థులు పెట్టుబడి రంగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ పరిస్థితులను అంచనా వేయాలన్నారు. కొద్దిపాటి ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, స్టడీ సెంటర్ కన్వీనర్ విశైలజ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి హేమంత్‌కుమార్, అధ్యాపకురాలు కల్మబేగం పాల్గొన్నారు.



పురోహితులకు వస్త్రదానం

గొలగాని చారిటబుల్ ట్రస్టు అన్నదానం, వస్త్రదానం

వన్‌టౌన్, ఫిబ్రవరి 10: తల్లి లక్ష్మీదుర్గాంబ ఐదో వర్ధంతి సందర్భంగా గొలగాని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గొలగాని రవికృష్ణ శనివారం దుర్గాఘాట్ వద్ద, అలంకార్ సెంటర్ వద్ద అన్న వితరణచేశారు. గాంధీనగర్‌లోని ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ పిల్లలకు, సిబ్బందికి అన్నవితరణ చేశారు. దుర్గాఘాట్ వద్ద బ్రాహ్మణ,వైష్ణవ పురోహితులకు వస్త్రదానం చేశారు. రవికృష్ణ మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు లకనం శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో రవికృష్ణ అందించిన సేవలు మరచిపోలేనివన్నారు. బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, శివకుమార్ పట్నాయక్, పిట్ల గోవింద్, కోళ్ల రజని, ఒమ్మి రాము, దుక్కా వేణు, పొట్నూరి చక్రధర్ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

నీటి పారుదల

పంటలకు కృత్రిమంగా నీటి వసతిని కల్పించడాన్నే నీటి పారుదల అంటారు. 1950-1951లో నీటి పారుదల వసతులు 22.6 మిలియన్ హెక్టార్లకు కల్పించగా... ప్రస్తుతం 139.89 మిలియన్ హెక్టార్లకు నీటి సౌకర్యం ఉంది.

భారతదేశంలో నీటి పారుదల ప్రధానంగా మూడు మార్గాలపై ఆధారపడి ఉంది. అవి.. బావులు, కాలువలు, చెరువులు.

బావులు: భారతదేశంలో అత్యధికంగా(62 శాతం) నీటి పారుదల బావుల ద్వారానే కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, శాతం పరంగా గుజరాత్‌లో అధికంగా నీటి పారుదల వసతులున్నాయి. బావులు రెండు రకాలు... గొట్టపు బావులు, సాధారణ బావులు. ఉత్తరప్రదేశ్‌లో బావులు అత్యధికంగా ఉన్నాయి.

కాలువలు: భారతదేశంలో 24 శాతం నీటి పారుదల కాలువల ద్వారా సమకూరుతోంది. విస్తీర్ణపరంగా ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్; శాతంపరంగా పంజాబ్‌లో అధికంగా కాలువల ద్వారా నీటి పారుదల కల్పిస్తున్నారు.

చెరువులు: దేశంలో 3 శాతం నీటి పారుదలను చెరువుల ద్వారా కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; శాతం పరంగా తమిళనాడులో అధికంగా చెరువుల ద్వారా నీటి పారుదుల సౌకర్యం ఉంది. చెరువులు ప్రధానంగా దక్షిణ భారత దేశంలోనే ఉన్నాయి. అత్యధిక నీటి పారుదల సాంద్రత పంజాబ్‌లో ఉంది. అత్యల్ప నీటి పారుదల సాంద్రత మిజోరంలో కలదు. ఇక భారతదేశంలో ఇతర నీటిపారుదల వసతులు 11.07 శాతం ఉన్నాయి.

ఆనకట్ట రకాలు

1. భూభాగ నిర్మాణం ఆధారంగా

చెక్ డ్యామ్స్: చిన్న చిన్న నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించేవి

డ్రై డ్యామ్స్: వర్షాభావ ప్రాంతాల్లో నేలల సంరక్షణ కోసం ప్రవాహ దిశను మళ్లిస్తూ నిర్మించేవి.

సాడిల్ డ్యామ్స్: ప్రధాన ఆనకట్ట కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా నిర్మించే ఆనకట్టలు

డైక్ డ్యామ్స్: సాడిల్ ఆనకట్ట లక్షణాలతో ప్రధాన ఆనకట్టను పోలివుండే వాటిని డైక్ డ్యామ్స్ అంటారు.

కాఫర్ డ్యామ్స్: నీటిలో మునిగి ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేయడానికి ఆ నీటిని తొలగించడం కోసం నిర్మించే డ్యామ్స్

ఓవర్ ఫ్లో డ్యామ్స్: నది నుంచి లేదా ఆనకట్ట నుంచి ప్రవహిస్తున్న నీటిని శాస్త్రీయంగా లెక్కించడానికి నిర్మించే ఆనకట్టలు

2. డిజైనింగ్, ఇంజనీరింగ్ ఆధారంగా

గ్రావిటీ డ్యామ్స్: భారీ కాంక్రీట్ డ్యామ్‌లను గ్రావిటీ డ్యామ్‌లు అంటారు. లోతైన పునాదులతో నిర్మిస్తారు.

ఆర్చ్ డ్యామ్స్: వి ఆకారంలో ఉండే నదీలోయలకు అడ్డంగా నిర్మిస్తారు.

ఉదా: ఇడుక్కీ-కేరళ(ఎత్తు 169 మీ.)

ఎమ్ బ్యాంక్‌మెంట్ డ్యామ్స్: రాళ్ల మధ్య ఖాళీలను మట్టి లేదా కాంక్రీట్‌తో పూడ్చుతారు. వీటిలో ఎర్త్ ఫిల్ డ్యామ్, రాక్ ఫిల్ డ్యామ్, రబ్బర్ డ్యామ్, ఆస్పేట్ డ్యామ్ ఉన్నాయి.

3. నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా/ఆయకట్టుకు నీటిని అందించే సామర్థ్యం ఆధారంగా

భారత ప్రణాళికా సంఘం మన దేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులను ఆయకట్టు ప్రాంతం ఆధారంగా మూడు విధాలుగా వర్గీకరించింది.

భారీ తరహా ప్రాజెక్ట్: 10,000 హెక్టార్ల కన్నా ఎక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

మధ్య తరహా ప్రాజెక్ట్: 2,000- 10,000 హెక్టార్ల మధ్య సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

చిన్న తరహా ప్రాజెక్ట్: 2,000 హెక్టార్ల కంటే తక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.



ప్రధాన ప్రాజెక్టులు

దామోదర్ వ్యాలీ

- దామోదర్, దాని ఉపనదులపై నిర్మించిన నాలుగు ప్రాజెక్టులను కలిపి దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అని పిలుస్తారు.
- 1948లో దేశంలో మొట్టమొదటి వరద నియంత్రణ కార్యక్రమంగా దామోదర్ వ్యాలీ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టు అమలు కోసం 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'(డీవీసీ) అనే సంస్థను ఏర్పాటు చేశారు.
- డీవీసీకి సహాయపడిన సంస్థ టెన్నిస్ వ్యాలీ అథారిటీ
- డీవీసీలో భాగంగా ఊర్డిన్ ప్రతిపాదించిన డ్యామ్‌ల సంఖ్య 7
- ఇప్పటి వరకు నాలుగు డ్యాములను నిర్మించారు. అవి.. కోనార్(కోనార్ నదిపై), పాంచెట్(దామోదర్ నదిపై), తిలయ(బారకార్ నదిపై), మైదాన్(బారకార్ నదిపై).
- ఊర్డిన్ అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ అథారిటీ ఛైర్మన్
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ నమూనాను పోలి ఉంటుంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **నిర్మాణం ప్రారంభం అయిన సంవత్సరం:** 1955 డిసెంబరు 10
- **నిర్మాణం పూర్తి:** 1967 ఆగస్టు 4. ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టును కృష్ణా నదిపై నందికొండ గ్రామం(నల్లగొండ) వద్ద నిర్మించారు.
- **దీని నిర్మాణ ఇంజనీర్:** కానూరి లక్ష్మణ రావు
- డ్యామ్ నిర్మాణానికి కేంద్రం ఖోస్లా కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ వ్యాఖ్యానించారు.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి ఆనకట్ట. **ఎత్తు:** 124.7 మీటర్లు, **పొడవు:** 1550 మీ. నీటి నిల్వ **సామర్థ్యం:** 408 టీఎంసీలు. స్థాపిత విద్యుత్ **సామర్థ్యం:** 826 మెగా వాట్లు.
- ఈ ప్రాజెక్టుకు రెండు కాలువలు ఉన్నాయి. ఒకటి జవహర్ లాల్ నెహ్రూ కాలువ(కుడి కాలువ)- దీని పొడవు 203 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీటి వసతులను కల్పిస్తుంది. రెండోది లాల్ బహదూర్ శాస్త్రి కాలువ(ఎడమ కాలువ)- దీని పొడవు 296 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరు, జిల్లాలకు; తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాకు సాగునీటి వసతులను కల్పిస్తుంది.

ఇందిరా గాంధీ కాలువ

- దీనిని రాజస్థాన్ కాలువ అని కూడా పిలుస్తారు. దీనిలో సట్లెజ్, రావి, బియాస్ మూడు నదుల నీరు ప్రవహిస్తుంది. దీని ప్రధాన కాలువ హరికే బ్యారేజ్ నుంచి ప్రారంభమవుతుంది. ఉప కాలువలు బియాస్, రావి నదుల నుంచి ప్రారంభమవుతాయి. దీని ప్రధాన కాలువ పొడవు: 650 కి.మీ. ఇది మూడు రాష్ట్రాలకు నీటి వసతులను కల్పిస్తుంది. పంజాబ్‌లో 167 కి.మీ., హర్యానాలో 38. కి.మీ., రాజస్థాన్‌లో 445 కి.మీ. ప్రవహిస్తుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలోని గంగానగర్, బికనీర్, జైసల్మేర్, జోథ్‌పూర్ వరకు నీటి వసతులను కల్పిస్తుంది. ఇది దేశంలోనే అతి పొడవైన వ్యవసాయ కాలువ.

నోట్: ప్రపంచంలో అత్యంత పొడవైన వ్యవసాయ కాలువ: ద గ్రాండ్ కెనాల్ - చైనా - 1776 కి.మీ. (బీజింగ్ నుంచి హాంగ్ జంగ్ నగరం వరకు కలదు).



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

బయోటెక్నాలజీలో ప్రవేశానికి జీఏటీ-బీ/బీఈటీ

బయోటెక్నాలజీ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు ఉద్దేశించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (జీఏటీ-బీ) 2024, అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్దేశించిన బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) 2024లకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల సిలబస్, పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, సీట్ల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

జీఏటీ-బీ

ఈ ఎగ్జామ్ ద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్స్/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందే అవకాశం లభిస్తుంది. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయోటెక్నాలజీ/ సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ) 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ(మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/అగ్రికల్చర్/వెటర్నరీ/ఫిషరీస్/ఫార్మసీ/ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)/ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీపీటీ/బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ ఇంజనీరింగ్/ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్)/బీఎఫ్ఎస్సీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(సైన్స్/అప్లయిడ్ సైన్స్)ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ-బీ) వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో 60 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు రెండో సెక్షన్‌లో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలనుంచి డిగ్రీ స్థాయిలో 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 240. పరీక్ష సమయం మూడు గంటలు.

బీఈటీ

ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండు కేటగిరీల్లో మెరిట్ లిస్ట్‌లను రూపొందిస్తారు. మొదటి కేటగిరీ అభ్యర్థులకు డీబీటీ జేఆర్ఎఫ్ లభిస్తుంది. వీరు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫెలోషిప్ లెటర్ అందుకొన్న రెండేళ్లలోపు వీరు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/బయోమెడికల్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయోకెమిస్ట్రీ/బయోఫిజిక్స్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటేషనల్ బయాలజీ/జెనెటిక్స్/మైక్రో బయాలజీ/ జువాలజీ స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) వివరాలు: ఇందులో కూడా రెండు సెక్షన్‌లు ఉంటాయి. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి సెక్షన్‌లో జనరల్ సైన్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో బయోటెక్నాలజీ అంశాల నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండు సెక్షన్లలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:**

మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి

నీట్ యూజీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) యూజీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

నీట్ యూజీ వివరాలు: ఈ పరీక్షని ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా వేరువేరు భాషల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఎగ్జామ్‌లో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 35 ప్రశ్నలు ఇస్తారు. వీటన్నింటికి సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో 15 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా పదింటికి సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 720. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 9
- **నీట్ యూజీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/NEET

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XUxbz3gలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మిథున్ చక్రవర్తికి గుండెపోటు



ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కోల్‌కత్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆయనకు రెండేళ్ల క్రితం కిడ్నీల్లో సమస్య తలెత్తడంతో ఆపరేషన్ చేశారు. మిథున్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. పలు బాలీవుడ్, బెంగాలీ చిత్రాల్లో నటించి హీరోగా స్టార్‌డమ్ అందుకున్నారు. వివాదాస్పద చిత్రం 'కశ్మీర్‌ఫైల్స్'లో మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో నటించి మెప్పించారు.

ప్రేక్షకులకు గుర్తుండిపోయే చౌర్యపాఠం



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ధమాకా' చిత్రంతో దర్శకుడిగా నక్కిన త్రినాథరావు పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన నిర్మాతగా మారి 'చౌర్య పాఠం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్ కథానాయకుడు. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఈ చిత్రానికి కథ అందించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్‌ని లాంచ్ చేసి ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామంలో దోపిడీకి హీరో తన ముఠాను సమాయత్తం చేయడంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'నక్కిన నెరేటివ్ బేనర్స్ ఈ రోజు ప్రారంభమైంది. దీనికి ప్రేక్షకులు ఊపిరి, భవిష్యత్‌ను ఇవ్వాలి. 'చౌర్య పాఠం'లో పాత్రలు ప్రేక్షకులకు గుర్తిండిపోతాయి' అన్నారు. ఈ సినిమా కోసం నాగేంద్ర 14 సెట్స్ వేశారని ఇంద్రరామ్ తెలిపారు. త్రినాథరావు ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారని దర్శకుడు చెప్పారు.

క్రమశిక్షణ, నిజాయితీ ఆయన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాయి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



'మురళీమోహన్‌లో నాకు నచ్చింది క్రమశిక్షణ, నిజాయితీ. జయాపజయాలను ఒక్కటిగా తీసుకోవడం ఆయన్ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. యువత ఆయన్నుంచి ఇవన్నీ నేర్చుకోవాలి. వారు మంచి సందేశం ఉన్న సినిమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. 'సకుటుంబ, సపరివార సమేతంగా చూసేలా సినిమాలు రాయండి, తీయండి. కుటుంబాలను, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మించండి' అని ఆయన కోరారు. 'పీవీ నరసింహారావు గారి ముందు చూపు వల్లనే నేడు దేశం ఇంత ముందుకు సాగింది. ఆయనకు భారతరత్న రావడం చాలా ఆనందకరమైన విషయం. చంద్రబాబు సంస్కరణల వల్లనే నేడు హైదరాబాద్ టెక్నాలజీ, ఫైనాన్షియల్, ఇండ్రస్ట్రీ హబ్‌గా మారింది' అని పేర్కొన్నారు వెంకయ్యనాయుడు. నటుడు, నిర్మాత మురళీమోహన్ 50ఏళ్ల సినీ జీవితం పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం శిల్పకళా వేదికలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి చంద్రబాబు మాట్లాడుతూ 'ఏ పనైనా మనసుపెట్టి చేసే వ్యక్తి మురళీమోహన్. సినిమాల నిర్మాణంలో, రియల్‌ఎస్టేట్ రంగంలో ఆయన అద్భుతంగా రాణించారు. ఎంతో మందిని సొంత ఖర్చులతో చదివించి డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చి దిద్దారు. ఇక వెంకయ్యనాయుడు గారి విషయానికి వస్తే ఆయన రాజకీయాల్లో సిన్సియారిటీకి మారుపేరుగా నిలిచారు. ఆయనకు పద్మ విభూషణ్, పీవీ నరసింహారావు గారికి భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలు రావడం మనందరికీ గర్వకారణం' అన్నారు.

ఎన్టీఆర్‌లోని అనేక మంచి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని మురళీమోహన్ ఎంతో ఎత్తుకు ఎదిగారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు . చివరిగా మురళీమోహన్ మాట్లాడుతూ.. 'నేను ఇవాళ ఈ స్థాయిలో మీ ముందు ఉన్నానంటే అట్లూరి పూర్ణచంద్రరావు గారు పెట్టిన భిక్షే. 1973లో ఆయన నాకు హీరోగా అవకాశం ఇస్తే, ఇండస్ట్రీలో నన్ను నిలబెట్టారు దాసరి గారు. వీరిద్దరినీ నా జీవితంలో మర్చిపోలేను' అన్నారు. 50 ఏళ్ల క్రితం తనకు తొలి అవకాశం ఇచ్చిన అట్లూరి పూర్ణచంద్రరావుకు ఈ సందర్భంగా మురళీమోహన్ ఒక కారును బహుమతిగా అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాటి హీరోయిన్లు ప్రభ, జయచిత్ర, కవిత, సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు అశ్వినీదత్, సురేశ్‌బాబు, సంగీత దర్శకుడు కీరవాణి, నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల, పార్లమెంట్ సభ్యులు రఘురామ కృష్ణంరాజు, సుజనా చౌదరీ, నటుడు ప్రదీప్, కొల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నవ్య 'దృశ్యం' పేజీలోని మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/fR1qtvv లో చదవండి.





1. లేపాక్షి ఆలయంలోని ఏడుశిరస్సుల నాగేంద్రుడి విగ్రహం వద్ద జస్టిస్ వెంకటనారాయణ భట్టి
2, 3: వేలాడే స్తంభాన్ని, సీతమ్మ పాదాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా

లేపాక్షి శిల్పకళా సంపద అమోఘం

» సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుల్లా, జస్టిస్ భట్టి

హిందూపురం, ఫిబ్రవరి 10: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళా సంపద అమోఘమని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలోని ఆలయాన్ని శనివారం వారు సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతాదేవి పాదం, నాట్యమండపం, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, వేలాడే స్తంభాన్ని చూసి న్యాయమూర్తులు తన్మయత్వం చెం దారు. అప్పటి శిల్పుల నైపుణ్యానికి లేపాక్షి ఆలయమే నిదర్శనమని కొనియాడారు. అనంతరం ఆలయంలో దుర్గావీరభద్రులకు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. న్యాయమూర్తులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, లేపాక్షి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు.

జగన్ రాజకీయ 'క్రీడ'!

వైసీపీ రాజకీయ ప్రచార వేదికగా విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

» 13న 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు వేడుకలు
» ఫైనల్స్ చూడనున్న సీఎం..ఆ తర్వాత ప్రసంగం
» క్రీడాకారులతో జరగాల్సిన కార్యక్రమం ఇది
» కానీ, వేలమంది కార్యకర్తలు, జనం తరలింపునకు ప్రయత్నాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని అధికార పార్టీ వైసీపీ రాజకీయ వేదికగా ఉపయోగించుకుంటోంది. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కమిటీ మొత్తం వైసీపీ నాయకులతో నింపేయడంతో వారికి నచ్చినట్టు వాడుకుంటున్నారు. సుమారు రూ.120 కోట్లతో 'ఆడుదాం..ఆంధ్రా' పేరిట రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వాటి ఫైనల్స్ శుక్రవారం నుంచి విశాఖపట్నంలో జరుగుతున్నాయి. ఇవి 13వ తేదీతో ముగుస్తాయి. విజేతలకు బహుమతి ప్రదానం సీఎం జగన్ చేతులు మీదుగా చేయాలని నిర్ణయించారు. దీనికి పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని వేదికగా ఎంపిక చేసుకున్నారు. ఆ స్టేడియంలోని గ్యాలరీల సామర్థ్యం 25 వేలు. ఆడుదాం...ఆంధ్రా ఫైనల్స్ కోసం మూడువేల మంది క్రీడాకారులు విశాఖపట్నం వచ్చారు. వారిలో 500 మంది వరకు విజేతలుగా నిలిచినా, మిగిలిన రెండున్నర వేల మంది 13వ తేదీ వరకు ఇక్కడ ఉండే అవకాశం లేదు. సొంతూళ్లకు వెళ్లిపోతారు. సీఎం బహుమతి ప్రదానోత్సవానికి ఉండేది ఆ 500 మందే. వారి కోసం అంత పెద్ద స్టేడియం అవసరం లేదు. కానీ అక్కడే వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్, పోలీసు ఉన్నతాధికారులు రెండు రోజులుగా స్టేడియానికి వెళ్లి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం జగన్ మంగళవారం సాయంత్రం స్టేడియానికి వచ్చాక ఓపెన్‌టాప్ జీపులో ఓ రౌండ్ వేసి క్రీడాకారులకు, ప్రజలకు అభివాదం చేస్తారని అధికారులు ప్రకటించారు. ఆ తరువాత ఆయన కామెంట్రీ రూమ్‌లోకి వెళతారు. సీఎం వీక్షించడానికి ఓ మ్యాచ్‌ను కూడా నిర్వహించనున్నారు. అది పూర్తయిన తరువాత విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఆ తరువాత వారిని ఉద్దేశించి మాట్లాడతారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే...అక్కడ జరిగే తుది క్రీడను వీక్షించడానికి భారీఎత్తున వైసీపీ కార్యకర్తలు, ప్రజలను తరలించనున్నారు. స్టేడియం మొత్తం వారితో నింపేస్తారు. వారికే సీఎం అభివాదం చేసి, ప్రసంగిస్తా రు. ఇంతకు ముందు విశాఖపట్నంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని, ఆర్థిక సాయం అందించాలని ఇక్కడి క్రీడా సం ఘాలు ప్రభుత్వాన్ని, ఆ శాఖ మంత్రిని కలిసి స్వయంగా కోరినా స్పందించలేదు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నందునే క్రీడాకారులను అక్కున చేర్చుకుంటున్నామని చెప్పడానికి ఇవన్నీ చేస్తున్నారని పలు క్రీడాసంఘాలు ఆరోపిస్తున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఇలాంటి రాజకీయ కార్యక్రమం ఎప్పుడూ నిర్వహించలేదని, ఇదే మొదటి సారని క్రికెట్ అభిమానులు చెబుతున్నారు.



విశాఖ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ తదితరులు



శ్రీనివాసరావు, ఆయన తల్లి సావిత్రమ్మను ఓదారుస్తున్న ఫారూక్ షుబ్లీ

ప్రజాసంఘాల మద్దతుతో
న్యాయం గెలిచింది

» కోడికత్తి కేసులో నిందితుడి తల్లి, సోదరుడు

విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాల మద్దతు, తమ పోరాటంతో న్యాయం గెలించిందని కోడికత్తి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు అన్నారు. విజయవాడలోని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో సంఘ వ్యవస్థాకుడు ఫారూక్ షుబ్లీని న్యాయవాది అబ్దుల్ సలీం సమక్షంలో శ్రీనివాసరావుతో పాటు శనివారం వారు కలిశారు. తాము చేసిన దీక్షకు మద్దతు తెలిపి, అండగా నిలిచినందుకు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీను జైల్లోనే డిగ్రీ పూర్తి చేశాడని, ఇప్పుడు ఎంఏ సోషియాలజీ చేస్తాడని చెప్పారు. అనంతరం షుబ్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, ముస్లిం ఐక్యతకు శ్రీనివాసరావు పునాది అయ్యాడని వ్యాఖ్యానించారు. దళిత సంఘాలతో కలిసి ఒక బృందంగా ఏర్పడి పోరాటానికి దిగామన్నారు. శ్రీనివాసరావు దళితుడు కాబట్టే కోడికత్తి శ్రీను అని పిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సీఎంను ఎవరైనా గొడ్డలి జగన్ అని పిలుస్తారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో ప్రాణాలు కోల్పోయిన సుబ్రహ్మణ్యం కుటుంబం న్యాయం కోసం ఎదురు చూస్తోందని, ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా.. శ్రీనివాసరావు భద్రత దృష్ట్యా అతన్ని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితితోపాటు దళిత సంఘాల పర్యవేక్షణలోనే ఉంచాలని నిర్ణయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసి తిరిగి విజయవాడకు తీసుకొచ్చే బాధ్యతలను ఈ సంఘాలు తీసుకుబోతున్నాయి.

సీఎం హామీలకే దిక్కులేదు.!

» ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి.!
» ఏ ప్రభుత్వానికి సహకరించనంతగా సహకరించాం: బొప్పరాజు

విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లు గడుస్తున్నా ఉద్యోగుల బకాయిలు చెల్లించలేదు. రెండేళ్ల కిందట సీఎం ఇచ్చిన హామీలూ నెరవేరలేదు. 90 రోజుల మా ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కాలేదు. మంత్రి వర్గ ఉప సంఘం హామీలు, ఉన్నతాధికారుల హామీలు అమలు కాలేదు. గతంలో ఏ ప్రభుత్వానికి సహకరించనంతగా ఈ ప్రభుత్వానికి సహకరించాం. మేమైతే ఎన్నికల విధుల్లోకి వెళ్లిపోయాం. జిల్లాలు మారిపోయాం. ఇప్పుడిక మేము కార్యాచరణ ప్రకటించలేం. ఏదైనా బేరమాడుకోవటం తప్ప. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఏం చేస్తారన్నది ఇక ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి' అని ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం వచ్చి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాక ఉద్యోగులు మానసికంగా తీవ్ర అశాంతితో ఉన్నారని చెప్పారు. ఉద్యోగులు ఈ రోజున ప్రభుత్వాన్ని బోనస్‌లు అడగటం లేదని, కేవలం వారికి చెల్లించాల్సిన బకాయిలను మాత్రమే అడుగుతున్నారని బొప్పరాజు తెలిపారు.

నేడు దళిత సింహగర్జన సభ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: జగన్ ప్రభుత్వంలో దళితులపై హత్యలు, దాడులు అవమానాలు అధికమయ్యాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ జరిగే ప్రాంతంలో శనివారం ఆయన సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దళితుల ఆవేదన, ఆత్మగౌరవం కాపాడుకునేందుకే దళిత సింహగర్జన ఏర్పాటుచేశానని వివరించారు. దళిత సింహగర్జన ఆత్మగౌరవ సభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

» చకచకా రాకెట్ అనుసంధాన పనులు



రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అనుసంధానం చేసిన దృశ్యం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 10: పీఎస్ఎల్వీ-సీ58 విజయంతో ఈ ఏడాదిని ఘనంగా ఆరంభించిన ఇస్రో.. మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 17న తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈ రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం చేసేందుకు 2,275 కిలోల బరువైన ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనుంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వెహికల్ అంసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అనుసంధానం చేసే ప్రక్రియను ముగించి రాకెట్‌ను ప్రయోగానికి రెడీ చేస్తున్నారు. తుది పరీక్షల అనంతరం రాకెట్‌ను వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు తరలిస్తారు. ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.



చింతూరు నుంచి అల్లిగూడేనికి ఆర్టీసీ ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా

మావోయిస్టు ప్రాంతాలకు
ఉచిత బస్సు

» 15 ఏళ్ల తర్వాత అందుబాటులోకి

చింతూరు, ఫిబ్రవరి 10: ఆదివాసీలకు ప్రయాణ సౌకర్యమే తమ లక్ష్యమని, ఇందులో భాగంగానే పోలీసు శాఖ మరో అడుగు ముందుకేసి మావోయిస్టు ప్రభావిత ప్రాంత ప్రజలకు ఉచిత బస్సు సర్వీసును ప్రవేశపెట్టినట్టు ఓఎస్డీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం అల్లూరి జిల్లా చింతూరు నుంచి ఓఎస్డీ ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు 15ఏళ్ల తర్వాత మళ్లీ బస్సు సౌకర్యం అందుబాటులోనికి వచ్చిందని తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు చింతూరు నుంచి ఏడుగురాళ్లపల్లి మీదుగా అల్లిగూడెం ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తుందన్నారు. మండలంలోని అల్లిగూడెం, నర్సింగపేట, మల్లంపేట తదితర ప్రాంతాల వారితోపాటు ప్రతి శుక్రవారం ఏడుగురాళ్లపల్లిలో జరిగే వారపు సంతకు వచ్చే సరిహద్దు రాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రజలు కూడా ఉచిత బస్సు సర్వీసును పొందవచ్చని తెలిపారు.

పురుగుమందు తాగి కౌలురైతు ఆత్మహత్య

అచ్చంపేట, ఫిబ్రవరి 10: పల్నాడు జిల్లాలో ఓ కౌలురైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అచ్చంపేట మండలం తాడువాయి పంచాయతీ పరిధిలో గల సండ్ర తండాకు చెందిన భూక్యా రామారావు(46) చింతపల్లిలో మూడు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిర్చి పంట వేశాడు. గతేడాది పంట సరిగ్గా పండకపోవడంతో నష్టపోయాడు. ఈ ఏడాది సాగు కోసం చేసిన అప్పులు రూ.10 లక్షలకు చేరుకున్నాయి. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక మనోవేదనకు గురైన రామారావు శనివారం పురుగుమందు సేవించి మృతి చెందినట్టు బంధువులు తెలిపారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాత జిల్లాల యూనిట్‌గా రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టేందుకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. 8 కంటే ఎక్కువ మంది ఉన్న సచివాలయాల నుంచి అంత కంటే తక్కువగా ఉన్నచోటుకి సిబ్బందిని బదిలీ చేయాలని ఆదేశాలిచ్చారు. అయితే ఏఎన్ఎం, అగ్రికల్చర్, హార్టీకల్చర్, పశుసంవర్ధక, ఫిషరీస్, ఎనర్జీ అసిస్టెంట్లను మాత్రం బదిలీ చేయరాదని అందులో సూచించారు. కాగా, గతేడాది బదిలీలు చేపట్టినా.. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్ల బదిలీలను నిలిపేశారని, ఇప్పుడు రేషనలైజేషన్ ప్రక్రియ చేపడుతూ.. ఆ పోస్టులకు బదిలీలు చేపట్టకపోవడం అన్యాయమని సచివాలయ సమాఖ్య అధ్యక్షుడు గుడి నాగరాజు అన్నారు.

పీఎఫ్ వడ్డీలో స్వల్ప పెరుగుదల

(మొదటి పేజీ తరువాయి)

స్వల్పంగా పెంచి 8.15% వడ్డీని చెల్లించింది. కాగా, సీబీటీ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన తరువాత వడ్డీ రేటును అధికారికంగా ఈపీఎఫ్ నోటిఫై చేస్తుంది. ఆ తరువాత వడ్డీ మొత్తాన్ని తమ చందాదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. గడిచిన పదేళ్ల కాలంలో పీఎఫ్ వడ్డీ రేట్లను పరిశీలిస్తే... 2013-14లో 8.75 శాతం వడ్డీ చెల్లించగా 2015-16లో అత్యధికంగా 8.80 శాతం వడ్డీ చెల్లించింది. ఆ తరువాత క్రమేపీ తగ్గుతూ వచ్చిన వడ్డీరేటు 2021-22 ఆర్థిక సంవత్సరంలో అత్యల్ప స్థాయికి చేరుకుంది.

రిటైర్డు ఉద్యోగులకూ ఈఎస్ఐ సేవలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలు అందనున్నాయి. ఈఎస్ఐ ద్వారా అంతకు ముందు వైద్య బీమా చేయించుకున్నవారికే ఇది వర్తిస్తుంది. ఇందుకోసం నిబంధనలను సడలిస్తూ శనివారం ఈఎస్ఐ కార్పొరేషన్ నిర్ణయం తీసుకొంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈఎస్ఐ కార్పొరేషన్ 193వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వేతనం పెరిగిన కారణంగా ఈఎస్ఐ పరిధి నుంచి బయటపడ్డ ఉద్యోగులకు ఈ సౌకర్యం వర్తిస్తుంది. పదవీ విరమణ/స్వచ్ఛంద పదవీ విరమణ నాటికి వారు ఈఎస్ఐ పరిధిలో లేనప్పటికీ అంతకు కనీసం అయిదేళ్ల ముందు వైద్య బీమా పరిహారం చెల్లించి ఉంటే రిటైరైన తరువాత కూడా ఆ ప్రయోజనం పొందడానికి అర్హులవుతారు. 2012 ఏప్రిల్ 1 తరువాత వరుసగా అయిదేళ్ల పాటు ఈఎస్ఐ ప్రీమియం చెల్లించి, 2017 ఏప్రిల్ 1 తరువాత పదవీ విరమణ చేసిన రూ.30వేల నెల జీతం ఉన్న ఉద్యోగులకు దీన్ని అమలు చేస్తారు.

ఉత్తరాఖండ్‌లో అల్లర్లు.. 5 వేల మందిపై కేసులు

హల్ద్వాని, ఫిబ్రవరి 10: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో అల్లర్లపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. రెండు రోజుల క్రితం హల్ద్వానీలోని బందల్‌పురాలో చోటు చేసుకున్న అల్లర్లతో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే. హల్ద్వానీ పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూను ఎత్తివేస్తున్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. ఈ అల్లర్లకు కారకులైన 19 మందిని గుర్తించి... వారిపైనా, అలాగే, మరో ఐదు వేలమంది గుర్తు తెలియని వ్యక్తులపైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఎస్‌పీ ప్రహ్లాద్ నారాయణ్ మీనా తెలిపారు. వీరిలో పలువురిని అదుపులోకి తీసుకున్నామని మిగిలిన వారిని గుర్తించేందుకు గాలింపు చేపట్టినట్లు మీనా పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాదాపు 1200 మంది భద్రతా సిబ్బందిని ఈ ప్రాంతాల్లో మోహరించినట్లు ఆయన వివరించారు. శనివారం మరో ఇద్దరు చనిపోయారని వారి మృతికి కారణాలు పోస్టుమార్టం పూర్తయితే కాని చెప్పలేమని ఎస్ఎస్‌పీ తెలిపారు. గత శుక్రవారం చేపట్టిన ఆక్రమణల తొలగింపు చర్యలతో హల్ద్వానీలో అల్లర్లు చేలరేగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో ఆ రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సంఘటన జరిగిన ప్రాంతాల్లో పర్యటించిన సీఎం పుష్కర్ సింగ్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు కొన్ని శక్తులు యత్నిస్తున్నాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారెవరైనా ఉపేక్షించబోమని అన్నారు.

లోకం తీరు





అబుదాబీలో హిందూ మందిర ప్రతిష్ఠకు ప్రధాని మోదీ

» 13, 14 తేదీల్లో పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ (యూఏఈ)లోని అబుదాబీలో నిర్మించిన ప్రప్రథమ హిందూ మందిర ప్రతిష్ఠకు ప్రధాని మోదీ హాజరు కానున్నారు. బోచసన్వాసి అక్షర పురుషోత్తం స్వామినారాయణ (బీఏపీఎస్) సంస్థ ఈ మందిరాన్ని నిర్మించింది. ఈ ఆలయ ప్రతిష్ఠతో పాటు, ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ నెల 13, 14 తేదీల్లో ఆయన యూఏఈలో పర్యటించనున్నారని శనివారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. పర్యటనల్లో భాగంగా ఆయన అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్, ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తౌం, ప్రధాని, రక్షణ మంత్రులతో చర్చలు జరపనున్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందింపజేయడం, పలు ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై అభిప్రాయాలు పంచుకోనున్నారు. దుబాయిలో జరిగే వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్, జయేద్ స్పోర్ట్స్ సిటీలో జరిగే భారతీయుల సదస్సులోనూ ప్రసంగించనున్నారు.

బీజేపీ ఏడాది ఆదాయం రూ. 2,360 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పార్టీ విరాళాలు పొందడంలో అధికార బీజేపీ అగ్రస్థానంలో ఉంది. 2022-23లో విరాళాల ద్వారా రూ.2,120 కోట్లు రాగా, అందులో ఎన్నికల బాండ్ల రూపంలోనే రూ.1,300 కోట్లు సమకూరింది. మొత్తం విరాళాల్లో ఎన్నికల బాండ్ల ఆదాయం 61 కావడం గమనార్హం. విరాళాలతో పాటు ఇతరత్రా రూపాల్లో రూ.2,360.80 కోట్ల ఆదాయం పొందింది. 2021-22లో మొత్తం 1,775 కోట్ల ఆదాయం రాగా, తదుపరి సంవత్సరంలో గణనీయంగా పెరిగింది. డిపాజిట్లపై వడ్డీయే రూ.237 కోట్లుగా ఉంది. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఆడిట్ నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఎన్నికల బాండ్ల రూపంలో కాంగ్రెస్ కన్నా బీజేపీ ఏడు రెట్లు అధికంగా ఆదాయం పొందింది. ఎన్నికల బాండ్ల ద్వారా కాంగ్రెస్‌కు వచ్చిన ఆదాయం తగ్గుతోంది. 2021-22లో రూ.236 కోట్లు రాగా, 2022-23లో అది రూ.171 కోట్లకు పడిపోయింది.

ఆపరేషన్ థియేటర్‌లో ప్రీ వెడ్డింగ్ షూట్

» కర్ణాటకలోని చిత్రదుర్గలో డాక్టర్ సస్పెన్షన్

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా భరమసాగర ప్రభుత్వ ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో ప్రీ వెడ్డింగ్ షూట్ జరుపుకొన్న డాక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఆ జిల్లా అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ ఆరోగ్య అభియాన పథకం కింద డాక్టర్ అభిషేక్ పనిచేస్తున్నారు. ఈయనకు ఓ డాక్టర్‌తో వివాహం కుదిరింది. ప్రీ వెడ్డింగ్ షూట్‌ను భిన్నంగా జరుపుకోవాలని భావించి ఫొటో, వీడియోగ్రాఫర్లతో ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో షూట్ చేయించారు. బెడ్‌పై ఉన్న ఓ వ్యక్తికి.. వధూవరులు ఇద్దరూ ఆపరేషన్ చేసినట్లుగా చిత్రీకరించారు. సదరు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యవహారంపై జిల్లా వైద్యాధికారి విచారణ జరిపి, జిల్లా అధికారికి నివేదిక సమర్పించారు. దీంతో డాక్టర్ అభిషేక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారి వెంకటేశ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

హరియాణాలో ఏడు జిల్లాల్లో 3 రోజులు మొబైల్ ఇంటర్నెట్ సేవల రద్దు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పంటలకు మద్దతు ధరలు కల్పించాలని డిమాండు చేస్తూ హరియాణాలోని రైతులు ఈ నెల 13న చలో ఢిల్లీ ఆందోళన చేయనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దు చేసింది. ఏడు జిల్లాల్లో ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి మంగళవారం రాత్రి 11.59 నిమిషాల వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండవని ప్రభుత్వం ప్రకటించింది. బల్క్ ఎస్ఎంఎస్ సేవలు కూడా రద్దయ్యాయి. వాయిస్ కాల్స్ అందుబాటులో ఉంటాయి. మరోవైపు రైతు నాయకుల ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేసి, బెదిరిస్తున్నారని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఆరోపించింది.

చిరకాల ఆకాంక్షల్ని నెరవేర్చాం

కీలక సంస్కరణలతో పటిష్ఠ భారతానికి పునాది వేశాం.. 17వ లోక్‌సభ చివరి భేటీలో మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజల సుదీర్ఘ ఆకాంక్షలను, ఎన్నో తరాల కలలను తాము నెరవేర్చామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం 17వ లోక్‌సభ చివరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయిదేళ్లలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాఖ్ రద్దు చేయడం నుంచి ప్రతిష్ఠాత్మక జీ-20 సమావేశాలు నిర్వహించడం వరకూ ఆయన పలు పరిణామాలను వివరించారు. దేశం వేగంగా భారీ మార్పుల దిశగా కదిలిందని, ప్రజలు శతాబ్దాలుగా ఎదురుచూసిన పనులను పూర్తి చేశామని చెప్పారు. ఈ అయిదేళ్లు సంస్కరణలు, పనితీరు ప్రదర్శించడం, దేశం రూపురేఖలు మార్చడంపై దృష్టి సాధించామన్నారు. కీలకమైన సంస్కరణలు పటిష్ఠ భారతదేశానికి పునాది వేశాయన్నారు. సభలో రామ మందిరంపై తీర్మానం.. భవిష్యత్తు తరాలకు దేశ విలువలపై గర్వపడేలా రాజ్యాంగపరమైన స్థైర్యం ఇస్తుందన్నారు. రామ మందిరం అంశంపై బీజేపీ లక్ష్యంగా ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. 'ఈ పనులు చేసే సామర్థ్యం అందరికీ ఉండదు. కొంతమంది ధైర్యంగా నిలబడి ఎదుర్కొంటారు. మిగతావాళ్లు కదన రంగాన్ని వీడి పారిపోతారని వ్యాఖ్యానించారు. ఎన్నో తరాలుగా దేశంలో ఒకే రాజ్యాంగం ఉండాలని ప్రజలు భావించారని, దాన్ని కశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దు చేయడం ద్వారా సాధించామన్నారు. దీని తర్వాత రాజ్యాంగ నిర్మాతలు తమను ఆశీర్వదించి ఉంటారన్నారు. డాటా పరిరక్షణ బిల్లు, ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు కఠిన చట్టాలు చేయడం, కాలం చెల్లిన చట్టాలను తొలగించడం, మహిళా రిజర్వేషన్ బిల్లు మొదలైనవన్నీ ప్రభుత్వ విజయాలని చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం, పార్లమెంట్ లైబ్రరీలోకి ప్రజలను అనుమతించడం గురించి ప్రస్తావించారు. ట్రాన్స్‌జెండర్లతో సహా అణగారిన వర్గాలకు ప్రభుత్వం న్యాయం చేసిందని, 17 వేల మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. ట్రాన్స్‌జెండర్‌కు పద్మ అవార్డు బహూకరించామన్నారు. కొవిడ్ మహమ్మారి దేశం ఎదుర్కొన్న అతి తీవ్ర సంక్షోభమని, అయినప్పటికీ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించామన్నారు. 17వ లోక్‌సభ 97 శాతం ఉత్పాదకత సాధించిందని, 18వ లోక్‌సభలో నూటికి నూరు శాతం ఉత్పాదకత సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు, చీకాకులు వచ్చినా ముఖంపై చిరునవ్వు చెరగకుండా సమావేశాలను నిర్వహించినందుకు స్పీకర్ ఓం బిర్లాను ప్రశంసించారు.


శనివారం లోక్‌సభలో మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితర ఎంపీలు

రామాలయంపై చర్చ

పార్లమెంటు సమావేశాల్లో చివరి రోజైన శనివారం ఉభయ సభల్లోనూ చర్చ ఎక్కువగా రామమందిరంపైనే సాగింది. లోక్‌సభలో 'అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ'పై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నాలుగు గంటల సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదించింది. కాగా, బడ్జెట్ సమావేశాలు ముగియడంతో శనివారం రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ 263వ సెషన్‌ను ముగిస్తున్నట్టు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు. ఇది స్వల్పకాలం భేటీయే అయినప్పటికీ చాలా ముఖ్యమైనదని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు మొత్తం 116 అంశాలపై చర్చలు జరిగినట్టు వివరించారు. 137% ఉత్పాదక సాధించినట్టు వెల్లడించారు.

17వ లోక్‌సభకు వీడ్కోలు

కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో సభ్యుల భావోద్వేగాల నడుమ 17వ లోక్‌సభ వీడ్కోలు సమావేశం శనివారం జరిగింది. లోక్‌సభ గడువు జూన్ 16వరకు ఉన్నప్పటికీ ఎన్నికలు సమీపిస్తుండడం, ఇదే రోజున బడ్జెట్ సమావేశాలు ముగియడంతో దీనినే చిట్టచివరి భేటీగా పరిగణించారు. స్పీకర్ ఓం బిర్లా తుది పలుకులు పలుకుతూ గత అయిదేళ్ల కాలంలో 222 బిల్లులు ఆమోదించినట్టు చెప్పారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు కాంగ్రెస్ సభ్యుడు అధీర్ రంజన్ చౌధరి మాట్లాడుతూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని అణగదొక్కే విధంగా వ్యవహరించకుండా ఉంటే బాగుండేదన్నారు. కొత్త పార్లమెంటు భవనంలోకి మారడం చెప్పుకోదగ్గ పరిణామమని, అయితే తనలాంటి పాతకాలం వారు సర్దుకోలేకపోయారని అన్నారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం...పూర్తి కాలంపాటు అధికారంలో కొనసాగినప్పటికీ 17వ లోక్‌సభ కాలంలోనే అతి తక్కువ సిట్టింగ్‌లు జరిగాయి. అయిదేళ్ల కాలంలో మొత్తం 272 భేటీలే జరిగాయి. అదే 16వ లోక్‌సభ కాలంలో 331 సిట్టింగ్‌లు జరిగాయి. 1952-57 నాటి ప్రథమ లోక్‌సభ రికార్డును ఇంతవరకు ఎప్పుడూ అధిగమించలేదు.

పాక్ ఎన్నికల్లో మాదే విజయం


» షరీఫ్ మూర్ఖుడు.. ఏఐ జనరేటెడ్ వీడియోలో ఇమ్రాన్ సందేశం



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 10: పాకిస్థాన్ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించిందని ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పాకిస్థాన్ తెహ్రీక్-ఈ-ఇన్సాఫ్(పీటీఐ) ప్రకటించింది. వివిధ కేసులలో జైలు జీవితం గడుపుతున్న ఇమ్రాన్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) జనరేటెడ్ ఆడియో-వీడియో ప్రసంగాన్ని శనివారం ఎక్స్ (ట్విటర్)లో పీటీఐ పోస్టు చేసింది. దేశ ప్రజలనుద్దేశించి ఇమ్రాన్ ప్రసంగించినట్టుగా ఆ వీడియోలో ఉంది. 'పీటీఐ కన్నా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పార్టీ (పీఎంఎల్) 30 సీట్లు వెనుకబడి ఉంది. అయినా విక్టరీ ప్రసంగం చేసిన మూర్ఖుడు షరీఫ్. ప్రజలెవరూ దీన్ని అంగీకరించడం లేదు' అని వీడియోలో ఇమ్రాన్ పేర్కొన్నారు. పాక్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 250 స్థానాల్లో ఫలితాలు వెలువడ్డాయి. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీగా ఇమ్రాన్ పార్టీ ముందంజలో ఉంది. ఆయన పార్టీ బలపరిచిన అభ్యర్థులు స్వతంత్రులతో సహా మొత్తం 99 సీట్లు గెలిచారు. మరో 15 స్థానాల్లో ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో.. ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని పార్టీలు చేతులు కలపాలని నవాజ్ షరీఫ్ శుక్రవారం పిలుపునిచ్చారు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఇమ్రాన్ పార్టీ కూడా ప్రయత్నిస్తోంది. ప్రజలు ఆందోళన చెందవద్దని, 2024 ఎన్నికల్లో పూర్తి స్థాయిలో విజయం సాధించామని, విజయోత్సవాలు చేసుకుందామని వీడియో సందేశంలో ఇమ్రాన్ పేర్కొన్నారు.

రాజ్యసభలో రగడ

కాంగ్రెస్ చీఫ్ ఖర్గేపై నిప్పులు చెరిగిన చైర్మన్ ధన్‌ఖడ్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: రాజ్యసభలో శనివారం తీవ్ర రగడ చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. తాజాగా భారతరత్న ప్రకటించిన మాజీ ప్రధాని చౌధరి చరణ్‌సింగ్‌ను అవమానిస్తున్నారంటూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేపై విరుచుకుపడ్డారు. "మీ వ్యాఖ్యలను ఎట్టిపరిస్థితిలోనూ ఉపేక్షించను. మనమంతా సిగ్గుపడేలా వ్యాఖ్యానించారు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేసమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ జైరాం రమేశ్‌పైనా చైర్మన్ విరుచుకుపడ్డారు. "మీకు సభలో ఉండే అర్హత లేదు. శ్మశానంలో విందు చేసుకునే వ్యక్తివి" అని పదేపదే వ్యాఖ్యానించారు. మరోవైపు, చైర్మన్ సహా దేశ ప్రజలకు ఖర్గే క్షమాపణలు చెప్పితీరాలంటూ కేంద్ర మంత్రి, సభా నాయకుడు పీయూష్ గోయల్ పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

ఏం జరిగిందంటే?


మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆయన మనవడు, ఆర్ఎల్‌డీ నేత జయంత్ సింగ్ చౌధరి సభలో మాట్లాడేందుకు చైర్మన్ అనుమతించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ఖర్గే.. జయంత్‌కు ఏరూల్ ప్రకారం మాట్లాడేందుకు అనుమతిచ్చారని చైర్మన్‌ను నిలదీశారు. "భారతరత్న పురస్కారం పొందిన నేతలపై చర్చ జరగడం లేదు. కానీ, జయంత్‌కు మీరు(చైర్మన్) మైక్ ఇచ్చారు. ఏ రూల్ ప్రకారం జయంత్‌ను అనుమతించారు? మాకు కూడా అనుమతి ఇవ్వండి. ఒకవైపు మీరు రూల్స్ గురించి మాట్లాడతారు. మీకు విచక్షణ ఉంది. దానిని మీకు కావాల్సినప్పుడు కాకుండా.. తెలివిగా ఉపయోగించండి" అని ఖర్గే వ్యాఖ్యానించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ సభ్యులు సైతం మద్దతు తెలుపుతూ చైర్మన్ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో చైర్మన్ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "ఇలాంటి భాషను వాడకండి. చరణ్‌సింగ్‌ను మీరు అవమానిస్తున్నారు. ఆయన రైతుల కోసం జీవితాన్ని ధార పోశారు. అలాంటి నేతను అవమానించడం ద్వారా మనమంతా సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నారు" అని తీవ్రంగా స్పందించారు. అనంతరం, ఖర్గే మాట్లాడుతూ.. ఇది గర్వించదగిన విషయమని, భారతరత్న పొందిన పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, స్వామినాథన్‌లకు తాము సెల్యూట్ చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ గందరగోళం మధ్యే కేంద్ర మంత్రి పరషోత్తం రూపాల మాట్లాడుతూ.. చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. సభానాయకుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ.. "చైర్మన్ సహా ఈ దేశానికి ఖర్గే క్షమాపణలు చెప్పితీరాలి" అని పట్టుబట్టారు. కాగా, జయంత్ సింగ్ మాట్లాడుతూ.. ఈ దేశానికి ప్రధానిగా చేసిన చరణ్‌సింగ్‌ను కాంగ్రెస్ అవమాన పరచడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గత పదేళ్లుగా తాను విపక్షంలో ఉన్నానని, ప్రస్తుత ప్రభుత్వం చరణ్ సింగ్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తోందని కొనియాడారు. "ప్రధాని మోదీ చేస్తున్న గ్రామాల్లో మరుగుదొడ్లు, మహిళా సాధికారత, గ్రామాభ్యుదయానికి పెద్దపీట వంటివి చరణ్‌సింగ్‌ను తలపిస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఇదిలావుంటే, చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటన వెలువడిన తర్వాత బీజేపీతో కలసి పయనిస్తామని ఇండియా కూటమి పార్టీగా ఉన్న ఆర్ఎల్‌డీ ప్రకటించించింది.

అది వారి సైద్ధాంతిక క్షీణత: జయంత్

మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వడం వెనుక ఆర్ఎల్‌డీ, బీజేపీల మధ్య 'డీల్' కుదిరిందన్న విమర్శలపై జయంత్ సింగ్ చౌధరి స్పందించారు. సభ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "చరణ్‌సింగ్ వంటి మహోన్నత వారసత్వం ముందు 2024 ఎన్నికలు అత్యల్పం. చరణ్‌సింగ్ మరణించిన 37 ఏళ్ల తర్వాత ఆయనకు పవిత్రమైన భారతరత్నను ప్రకటించారు. దీనిలోనూ తప్పులు వెతుకుతున్నారంటే, దీనివెనుక ఏదో లావాదేవీ జరిగిందని భావిస్తున్నారంటే.. అది వారి సైద్ధాంతిక క్షీణతే తప్ప మరొకటి కాదు" అని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.

టీడీపీతో పొత్తుపై త్వరలో వెల్లడి

త్వరలో ఎన్డీయేలోకి కొత్త మిత్రులు .. అకాలీదళ్, లోక్‌దళ్‌తోనూ చర్చలు : అమిత్ షా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పొత్తు విషయంపై ఇప్పుడే వెల్లడించలేమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. పొత్తులపై అన్ని విషయాలూ ఇప్పుడే చెప్పలేమని, కొద్ది రోజుల తర్వాత వెల్లడవుతాయని చెప్పారు. శనివారం ఢిల్లీలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ నౌ- గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీలో మొదట టీడీపీ బీజేపీతో ఉందని, తర్వాత జగన్మోహన్ రెడ్డి వచ్చారని, ఇప్పుడు మళ్లీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో చర్చలు జరిపారని, ఆ రాష్ట్రంలో కూడా ఎన్డీయేను విస్తరిస్తున్నారా అని టైమ్స్ నౌ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. త్వరలో కొత్త మిత్రులు ఎన్డీయేలో చేరుతారని చెప్పారు. పంజాబ్‌లో అకాలీదళ్‌తో, ఉత్తర ప్రదేశ్‌లో లోక్‌దళ్‌తో చర్చలు జరుగుతున్నాయన్నారు. జనసంఘ్ కాలం నుంచి బీజేపీ సిద్ధాంతం ఏమీ మారలేదని, మిత్రపక్షాలు కొన్ని వస్తూ, పోతూ ఉంటాయన్నారు. బీజేపీ మాత్రం స్థిరంగా ఒకే సైద్ధాంతిక దృక్పథంతో ఉంటుందన్నారు. కుటుంబపరంగా ఫ్యామిలీ ప్లానింగ్ అవసరమని, కానీ రాజకీయంగా ఎంత పెద్ద కూటమి ఉంటే అంత మంచిదని భావిస్తున్నామని చెప్పారు. కొన్ని మిత్రపక్షాలు బీజేపీ నుంచి విడిపోవడానికి స్థానిక రాజకీయ సమీకరణలు, అప్పటి పరిస్థితులు కారణం కావచ్చన్నారు. బీజేపీ ఎప్పుడూ ఏ మిత్రపక్షాన్నీ వెళ్లిపొమ్మని చెప్పలేదని, వాటంతట అవే వెళ్లిపోయాయని చెప్పారు. బీజేపీ మిత్రపక్షాలను గౌరవించిందని, కొన్ని రాష్ట్రాల్లో బీజేపీకి మెజారిటీ ఉన్నా, మిత్రపక్షాల నేతకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందని, మిత్రపక్షాల నేతలకు కీలకమైన మంత్రిపదవులు ఇచ్చామని ఆయన గుర్తు చేశారు.

అభివృద్ధి చెందిన అగ్రదేశంగా మారుస్తాం

"పార్లమెంట్‌లో అస్వస్థతతో ఉన్న ప్రతిపక్షాన్ని చూస్తుంటే వారు ప్రతిపక్షంలోనే ఉంటారని తేలిపోయింది. ఎన్నికల ఎజెండా ఏమిటన్నది ముఖ్యం. మోదీ మూడో టర్మ్‌లో భారతదేశం అభివృద్ధి చెందిన అగ్రదేశంగా మార్చడమే ప్రధానాంశం. దేశం సంపూర్ణంగా వికసిత భారతంగా, ఆత్మనిర్భర భారతంగా మారుతుంది. బీజేపీ విధానాలు ఈ మట్టి నుంచి వచ్చాయి. ఈ నేలపై ఉన్న సామాజిక పరిస్థితులు, సంస్కృతి, ప్రజల మనోభావాలకు అనుగుణంగా రూపొందాయి" అని అమిత్ షా అన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాం

"భారతదేశ లౌకిక స్వభావాన్ని రామమందిరంపై సుప్రీం కోర్టు తీర్పు ప్రతిఫలించింది. ఏ దేశంలోనూ మెజారిటీ వర్గం తమ విశ్వాసాన్ని కాపాడుకోవడం కోసం ఇన్ని శతాబ్దాలు వేచి ఉండలేదు. అయోధ్యలో రామమందిరం కోసం ప్రజా ఉద్యమాలు 1528 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పోరాటానికి ఈ ఏడాది జనవరి 22న ముగింపు పడింది. ఇది మహోన్నత భారత ప్రయాణానికి ప్రారంభం. న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగానే రామమందిరం నిర్మాణం జరిగింది. బాలరాముడు ప్రాణ ప్రతిష్ఠ సమయంలో ఎలాంటి రాజకీయ నినాదాలు చేయలేదు. అడ్వాణీ రథ యాత్రతో రామమందిరంపై ప్రజల మనోభావాలు మేల్కొన్నాయి. వారి ఆకాంక్షలను మోదీ పూర్తి చేశారు" అని అన్నారు.

రాహుల్‌కు అబద్ధాలు చెప్పడం అలవాటే

"ప్రధానమంత్రి ఓబీసీ కాదని కాంగ్రెస్ నేతలు విమర్శించడం దురదృష్టకరం. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అబద్ధాలు చెప్పడం, తర్వాత వెనక్కి తగ్గడం మామూలే. మోదీ కులాన్ని 1994లో గుజరాత్‌లో వెనుకబడిన వర్గంగా గుర్తించింది ఒకప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. 2000లో కేంద్రం ప్రధానమంత్రి కులాన్ని ఓబీసీల్లో చేర్చింది. అప్పుడు కూడా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. తన కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించిన సమయానికి మోదీ ఎన్నికలలో పోటీ చేయనే లేదు. అప్పుడు ఆయన సర్పంచ్ కూడా కాదు" అని అమిత్ షా అన్నారు.

ఎన్నికల్లోపే సీఏఏ అమలు

లోక్‌సభ ఎన్నికలకు ముందే పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుకు నిబంధనలు జారీ చేస్తామని అమిత్ షా వెల్లడించారు. ముస్లిమేతర వలసదారులకు భారత పౌరసత్వం అందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామన్నారు. సీఏఏ అనేది ఈ దేశానికి సంబంధించిన చట్టమని, దాని నోటిఫికేషన్ తప్పకుండా జారీ అవుతుందని, ఎన్నికలకు ముందే అమలవుతుందని చెప్పారు. పొరుగుదేశాల్లో హింసకు గురైన మైనారిటీలకు భారత పౌరసత్వం ఇవ్వాలనేది కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీ కూడానని అమిత్‌షా చెప్పారు. 'దేశ విభజన తర్వాత మతపరమైన హింసకు గురైన హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు భారతదేశానికి రావాలనుకున్నారు. వారందరికీ పౌరసత్వం ఇస్తామని వారు(కాంగ్రెస్ నేతలు) హామీ ఇచ్చారు. కానీ, ఆ (కాంగ్రెస్)నేతలు తామిచ్చిన మాటపై వెనక్కి తగ్గారు. సీఏఏపై ముస్లిం సోదరులను రెచ్చగొడుతున్నారు. సీఏఏ ఏ ఒక్కరి పౌరసత్వాన్నీ లాక్కోదు. ఆ చట్టంలో అలాంటి నిబంధన లేదు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో మతపరమైన హింసకు గురైన తర్వాత అక్కడి నుంచి వలస వచ్చినవారికి పౌరసత్వం ఇచ్చేందుకు సీఏఏను తీసుకొచ్చాం. ఈ చట్టాన్ని ఏ ఒక్కరూ వ్యతిరేకించకూడదు' అని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి 2014 డిసెంబరు 31 నాటికి భారత్‌లోకి వలస వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు మోదీ ప్రభుత్వం భారత పౌరసత్వం అందించాలనుకుంటోంది.

ఇండియా కూటమికి మరో దెబ్బ

» పంజాబ్‌లో ఆప్ ఒంటరి పోరే


» పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ వెల్లడి

» కూటమి జోడో యాత్ర చేయండి: బీజేపీ ఎద్దేవా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇండియా కూటమికి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో ఒంటరిగానే పోటీ చేస్తామని కూటమిలోని భాగస్వామ్య పార్టీ తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించగా, తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కూడా అదే బాట పట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించింది. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాలు, చండీగఢ్‌లోని ఒక లోక్‌సభ స్థానానికి త్వరలో అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. శనివారం పంజాబ్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ 14 లోక్‌సభ స్థానాలకు 10-15 రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. అన్ని సీట్లను క్లీన్‌స్వీప్ చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గోవా, హరియాణా, గుజరాత్‌లలోని లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను నిర్ణయించడానికి ఈనెల 13న రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశాన్ని ఆప్ నిర్వహించనుంది. ఇప్పటికే అసోంలో మూడు సీట్లు, గుజరాత్‌లో ఒక సీటుకు అభ్యర్థులను ఆప్ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నప్పటికీ సీట్ల పంపకాల చర్చలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆప్ ఆరోపించింది. కాగా, రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు బదులుగా 'ఇండి' కూటమి జోడో యాత్ర చేపట్టాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు.

మళ్లీ అప్రెంటిస్ విధానం తగదు: టీఎన్‌యూఎస్

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ తీసుకురావడం తగదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) ఖండించింది. 12 ఏళ్ల క్రితమే అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేసి, 2012 డీఎస్సీ నియామకాలు చేపట్టిందని గుర్తుచేసింది. ఇప్పుడు మళ్లీ అప్రెంటిస్ విధానాన్ని తీసుకొస్తూ వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం సరికాదని టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ఉత్తర్వులను సవరించి అప్రెంటిస్ అనే వెట్టిచాకిరీని తొలగించాలని వారు డిమాండ్ చేశారు.



ప్రజా క్షేత్రంలోకి పవన్

- 14 నుంచి 17 వరకు పర్యటనలు
- తొలుత గోదావరి జిల్లాల్లో భేటీలు
- టీడీపీ నేతలతోనూ సమావేశాలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 14 నుంచి 17 వరకూ తొలి విడతలో గోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు. తొలిరోజు భీమవరంలో పాల్గొంటారు. తదుపరి అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలో సమావేశాలు ఉంటాయి. ఈ పర్యటనల్లో పార్టీ ముఖ్య నాయకులతో భేటీ అవుతారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతోనూ సమావేశమవుతారు. నియోజకవర్గాల స్థాయిలో ఇరు పార్టీల నాయకులు, శ్రేణుల మధ్య మంచి వాతావరణం కల్పించే దిశగా భేటీలు జరుగుతాయి. మొత్తం పవన్ పర్యటనలను మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. గోదావరి జిల్లాల పర్యటన అనంతరం ఇతర ప్రాంతాల పర్యటనలను ఖరారు చేసేందుకు పార్టీ ప్రచార కమిటీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

పొత్తులపై మాట్లాడొద్దు.. పార్టీ నాయకులకు ఆదేశం

రాష్ట్రంలో పొత్తుల గురించి నాయకులు, కార్యకర్తలు ఎవరూ మాట్లాడొద్దని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించారు. పొత్తులపై పార్టీ నాయకులకు సూచనలు చేస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పొత్తులకు సంబంధించి చర్చలు కొనసాగుతున్న ఈ దశలో.. పార్టీ నాయకులు భావోద్వేగాలతో ఎలాంటి వ్యాఖ్యానాలు చేయవద్దని ఆదేశించారు. పార్టీ విధానాలకు భిన్నమైన అభిప్రాయాలూ ప్రచారం చేయవద్దని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అభిప్రాయాలూ, సందేహాలు ఉంటే తన రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పొత్తుకు విఘాతం కలిగించాలని ఎవరు ప్రయత్నించినా వారిని ప్రజలు గమనిస్తారని, ప్రజలు స్థిరత్వాన్ని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పొత్తుల దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు.

జగన్ మహానటుడు.. ఆయనలా ఎవరూ నటించలేరు

- ఆస్తి, అధికారం కోసం తల్లి, చెల్లిని గెంటేశారు: నాగబాబు



అనకాపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ రెడ్డి అద్భుతమైన నటుడని, ఈ భూప్రపంచంలో ఆయనలా ఎవరూ నటించలేరని జనసేన ప్రధా న కార్యదర్శి నాగబాబు ఎద్దేవా చేశారు. అనకాపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశమయ్యారు. నాగబాబు మాట్లాడుతూ.. ఆస్తి, అధికారం కోసం సొంత తల్లిని, చెల్లిని గెంటేసిన స్వార్థపరుడు జగన్ అని విమర్శించారు. రూ.లక్ష కోట్లు దోచేసి జైలు జీవితాన్ని అనుభవించిన వ్యక్తి అమాయకంగా నటించి, తండ్రి పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చాక.. ఆయన ఫొటోను కూడా పక్కన పెట్టేశాడని విమర్శించారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి పేదలు చనిపోతే... అవి సహజ మరణాలేనని అసెంబ్లీలో చెప్పిన వ్యక్తి జగన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమిదే విజయమని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు.

రేపు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వండి

- ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన అభియోగాలపై సోమవారం వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు, నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం శనివారం నోటీసులు పంపింది. వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డితో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, వాసుపల్లి గణేశ్, కరణం బలరామకృష్ణమూర్తి, వల్లభనేని వంశీలకు నోటీసులు పంపింది. శ్రీధర్‌రెడ్డి, శ్రీదేవి, చంద్రశేఖరరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటికే ఒకసారి స్పీకర్ తమ్మినేని సీతారాం ముందు హాజరై అభిప్రాయాలు వెల్లడించారు. వారిని ఈ నెల 8న మరోసారి హాజరు కావాలని ఆదేశించారు. ఈ మేరకు గత గురువారం ఆనం హాజరై వివరణ ఇచ్చారు. శ్రీధర్‌రెడ్డి, శ్రీదేవి, చంద్రశేఖరరెడ్డి ఆరోగ్య కారణాల రీత్యా హాజరునుంచి మినహాయింపు కోరారు. మిగిలిన వారు హాజరుకాలేదు. దీంతో తాజాగా నోటీసులు పంపారు.



నేటి నుంచే 'శంఖారావం'

- ఇచ్ఛాపురంలో ప్రారంభించనున్న లోకేశ్
- వైసీపీ ప్రభుత్వ అక్రమాలపై సమర శంఖం!
- 120 నియోజకవర్గాల్లో పర్యటన

శ్రీకాకుళం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న 'శంఖారావం' కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఆదివారం ప్రారంభం కానుంది. ఉదయం 10.30 గంటలకు ఇచ్ఛాపురంలోని సురంగి రాజా మైదానంలో సభ నిర్వహించనున్నారు. రోజుకు 3 నియోజకవర్గాల చొప్పున అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సభలు నిర్వహించనున్నారు. యువగళం పాదయాత్ర ముగించినప్పటికీ.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆదివారం నుంచి నలభైరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 120 నియోజకవర్గాల్లో 'శంఖారావం' పేరుతో సభలు నిర్వహించనున్నారు. ఈనెల 21 వరకు ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాలలో సభలు నిర్వహిస్తారు. శంఖారావంలో పాల్గొనేందుకు ఇప్పటికే లోకేశ్ ఇచ్ఛాపురం పయనమయ్యారు. లోకేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ యంత్రాంగం మొత్తం తొలిరోజున ఇచ్ఛాపురం సభపై దృష్టి సారించింది. కీలకనాయకులందరూ ఇచ్ఛాపురానికి చేరుకుని, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 'సెల్ఫీ విత్ లోకేశ్' కార్యక్రమాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. ప్రజాసంఘాలు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు, కులసంఘాల నాయకులు.. ఇలా వర్గాల వారీగా లోకేశ్‌ను ఈ సభలలో కలసి వినతులు ఇవ్వవచ్చు. ఇచ్ఛాపురంలో సభ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పరిశీలించారు. వేలాదిగా జనం తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చేశారు.



ఇచ్ఛాపురంలో శంఖారావం సభకు సిద్ధమైన వేదిక

సీఎం ఢిల్లీ వెళ్లారు... వచ్చారు..!

- ఏం అడిగారో... ఏ హామీ వచ్చిందో..!
- హోదాపై ప్రధాని మోదీ ఏమన్నారో..!
- కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీలో వచ్చిన హామీ ఏమిటో!
- సొంత లబ్ధి కోసమే జగన్ ఢిల్లీకి... విపక్షాల విమర్శలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. వచ్చారు. ప్రత్యేక హోదా.. విభజన హామీలు అమలు చేయాలంటూ ప్రధాని నరేంద్రమోదీకి శుక్రవారం నాడు వినతిపత్రం అందజేశామని చెప్పారు. అయితే.. ప్రత్యేక హోదాపై ప్రధాని ఏమన్నారో..? ఎలాంటి హామీని ఇచ్చారో? రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ వివరించలేదు. వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో బుందేల్‌ఖండ్ తరహాలో అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామన్న హామీలను అమలు చేస్తామని మోదీ చెప్పారో లేదో కూడా జగన్ వెల్లడించలేదు. కడప స్టీల్ ప్లాంట్, దుగరాజుపట్నం.. విశాఖ రైల్వే జోన్.. పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం పెంపు.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల వంటి వాటిపై ప్రధాని మోదీ ఏమన్నారో కూడా రాష్ట్ర ప్రజలకు జగన్ వివరించలేదు. రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా.. ఢిల్లీ యాత్ర తర్వాత.. వైసీపీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సహా.. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలతోనూ జగన్ సమావేశం కాలేదు. సీఎం జగన్ ఏనాడూ సహచర ప్రజాప్రతినిధులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోరని ఆ పార్టీ నేతలు వాపోతుంటారు. జగన్ తన మాటే శాసనంగా భావిస్తుంటారన్న వ్యాఖ్యాలు ఉన్నాయి. ప్రజా వేదికలపై తాను ప్రజా సేవకుడినంటూ నమ్మబలికే జగన్... ఆచరణలో మాత్రం పెత్తందారీ పోకడలకు పోతారన్న విమర్శలు ఆ పార్టీ నేతల్లోనే నెలకొన్నాయి. సహజంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం పెద్దల వద్దకు ముఖ్యమంత్రులు వెళ్లినప్పుడు.. తామెందుకు వెళ్లాల్సి వస్తోందో మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరిస్తారు. అదేవిధంగా ప్రధానితో సహా ఇతర కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు సమర్పించాక.. వారి స్పందన ఎలా ఉందో కూడా ప్రజలకు తెలియజేసేవారు. కానీ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించకముందే.. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఢిల్లీకి వెళ్లిన జగన్.. అప్పట్లో ప్రధాని మోదీ.. హోం మంత్రి అమిత్‌షాలతో భేటీ అయ్యారు. అప్పుడు కూడా తమ భేటీలో ఏం జరిగిందో ఢిల్లీ మీడియాకు కూడా జగన్ వెల్లడించలేదు. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక.. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రీ వెళ్లనన్ని సార్లు ప్రత్యేక విమానంలో జగన్ ఢిల్లీకి వెళ్లారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి, టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు కుదుర్చుకుంటుందన్న అంశంపై ఆరా తీసేందుకే సీఎం జగన్ ఢిల్లీ వెళ్లారని రాజకీయ పక్షాల ఆరోపణ. మద్యం, ఇసుక అమ్మకాలతో గడించిన అక్రమ సంపాదనలో బీజేపీకి వాటా చెల్లించేందుకే జగన్ ఢిల్లీ వెళ్లారంటూ కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇక, స్వప్రయోజనాల కోసమే జగన్ ఢిల్లీకి వెళ్లారంటూ రాష్ట్ర యువత బాహాటంగానే చెబుతున్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధినిచ్చే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమల అభివృద్ధి కోసం జగన్ కృషి చేయడం లేదని యువత పెదవి విరుస్తోంది.

సర్కారు వారి నకిలీ మద్యం

- 42 పెండింగ్ ప్రాజెక్టుల్లో ఐదేళ్లలో తట్టెడు మట్టి వేయలేదు
- ప్రత్యేక హోదా సాధించడంలో వైసీపీ, టీడీపీ విఫలం
- 25 మంది ఎంపీలు గాడిదలు కాస్తున్నారా..!
- రచ్చబండ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

నర్సీపట్నం, చింతపల్లి, ఫిబ్రవరి 10: 'రాష్ట్రంలో సర్కారే కల్తీ మద్యం విక్రయిస్తోంది. దానివల్ల రాష్ట్రంలో వేలాది మంది మరణించారు. మేనిఫెస్టో తనకు బైబిల్, ఖురాన్, భగవగ్గీత అని చెప్పిన జగనన్న మద్యపాన నిషేధం చేశాడా? రాష్ట్ర ప్రజలకు అవసరమైన 'మెగా డీఎస్సీ', 'స్పెషల్ స్టేటస్', 'కేపిటల్' తదితర పేర్లను మద్యం బ్రాండ్లకు పెట్టి విక్రయిస్తున్నాడు. వాళ్లు అమ్మిందే కొనాలి, చెప్పిన ధర చెల్లించాలి' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఆమె శనివారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ములగపూడి గ్రామంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోనూ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'ప్రభుత్వ మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్లు లేవు. డబ్బులన్నీ లిక్కర్ మాఫియా జేబుల్లోకి వెళుతున్నాయి. దేశవ్యాప్తంగా మద్యం తాగడం వల్ల లివర్ చెడిపోయి చనిపోయిన వారిలో 25 శాతం మన రాష్ట్రంలోనే ఉన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిపోయి యువత వలస పోతుంది. పదేళ్లుగా టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు ప్రత్యేక హోదా సాధించడంలో విఫలం అయ్యాయి. రాష్ట్రం నుంచి గెలిచిన 25 మంది ఎంపీలు గాడిదలు కాస్తున్నారా? రాష్ట్రానికి బీజేపీ నష్టం చేస్తుంటే ఆందోళన చేసిన పాపాన పోలేదు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో 54 ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఆయన చనిపోయే నాటికి 42 పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిని పూర్తి చేస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ పెట్టారు. ఐదేళ్లుగా తట్టెడు మట్టి పోయలేదు. వైఎస్ పాలనలో వ్యవసాయం అంటే పండగ. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం అంటే దండగ అన్నట్లుంది. రైతులకు గిట్టుబాటు ధర, పంట నష్టపోయినా పరిహారం లేదు' అని షర్మిల అన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రత్యేక హోదాపై పలు ఉద్యమాలు చేసిన జగన్ అధికారంలోకి వచ్చాక నిజమైన పోరాటం ఒక్కటైనా చేశాడా? అని ఆమె నిలదీశారు. పాలకపక్షం, ప్రతిపక్షం 25 ఎంపీలు మూకుమ్మడి రాజీనామాలు చేస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదు? జగనన్న ప్రతాపం ఆడబిడ్డలపైనేనా..? సోషల్ మీడియాలో నేనా? అని షర్మిల నిగ్గదీశారు.

పాలకపక్షం, ప్రతిపక్షం బీజేపీతో ట్రయాంగిల్ లవ్ స్టోరీ..

'పాలకపక్షం, ప్రతిపక్షం బీజేపీతో ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుపుతున్నాయి. చంద్రబాబుకు, జగనన్నకు బీజేపీయే కావాలి. ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలకు ఇద్దరూ దాసోహం అంటున్నారు. చంద్రబాబు అమరావతి రాజధాని అంటూ గ్రాఫిక్స్‌లో ప్రజలకు చూపించారని, జగనన్న మూడు రాజధానులంటూ ఒక్క రాజధాని కూడా లేకుండా చేశాడు' అని షర్మిల విమర్శించారు.

ఎన్నికల ముందు దగా డీఎస్సీ

'ఎన్నికల ముందు జగనన్న దగా డీఎస్సీ ప్రకటించాడు. రాష్ట్రంలో 30 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం ఆరు వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం అన్యాయం. ఏటా జనవరి ఒకటిన జాబ్ కేలెండర్ ప్రకటిస్తానన్నాడు, ప్రకటించాడా? ఇదే పరిస్థితి కొనసాగితే యువత రాష్ట్రంలో ఉండదు' అని షర్మిల అన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు ఏమవుతున్నాయి..?

'రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు ఏమవుతున్నాయి? రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉప ప్రణాళిక నిధులు కచ్చితంగా దళితులు, గిరిజనుల కోసం ఖర్చు చేసేవారు. ప్రస్తుతం జగనన్న ఎస్సీ, ఎస్టీలకు చెందాల్సిన నిధులు పక్కదారి పట్టిస్తున్నాడు. ఉప ప్రణాళిక నిధులు కచ్చితంగా ఆదివాసీల కోసం ఖర్చుచేసి ఉంటే గిరిజన గ్రామాలు కొంతైనా అభివృద్ధి చెందేవి. గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు కనీసం సరైన రహదారి లేక అవస్థలు పడుతున్నారు' అని షర్మిల అన్నారు.

స్టీల్‌ప్లాంటును నాశనం చేశారు..

'లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటు దివాలా తీసేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. 30 వేల మంది ఉద్యోగులు కుటుంబాలతో రోడ్డున పడే పరిస్థితికి తీసుకొచ్చారు' అని పీసీసీ అధ్యక్షురాలు అన్నారు.

అల్లూరి స్ఫూర్తితో నియంతను తరిమికొట్టండి..

ఆదివాసీలు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నియంతల మాదిరిగా వ్యవహరిస్తున్న పాలకులను తరిమి కొట్టాలని షర్మిల పిలుపునిచ్చారు. అల్లూరితో కలిసి బ్రిటీష్ పాలకులపై పోరాడిన ధైర్యసాహసాలు కలిగిన వారు గిరిజనులని ప్రశంసించారు. వచ్చే ఎన్నికల్లో గిరిజన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలన్నారు.

వైసీపీ తొత్తుగా విశాఖ కలెక్టర్!

- ఆయన ఉంటే ఎన్నికల్లో అరాచకమే
- ఎన్నికల విధుల నుంచి తప్పించాలి
- ఓటర్ల జాబితాలో భారీగా అక్రమాలు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారి
- సాయిరెడ్డి, ఎంవీవీ, వాసుపల్లికి చెంచా
- ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను అధికార పార్టీ నేతలకు సమర్పించారు
- టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లికార్జున.. అధికార వైసీపీకి తొత్తుగా పనిచేస్తున్నారని టీడీపీ నేత, విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ కలెక్టర్‌గా మల్లికార్జున కొనసాగితే వచ్చే ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగవని, అరాచకం కళ్లకు కడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ మల్లికార్జునను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. జిల్లాలో వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌లకు కలెక్టర్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వెలగపూడి ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎంతో విలువైన దసపల్లా, హయగ్రీవ భూములను అధికార పార్టీ నేతలకు అప్పగించారని తెలిపారు. విజయసాయిరెడ్డి, ఆయన మనుషులకు దసపల్లా భూముల అప్పగింత విషయంలో తప్పుడు అగ్రిమెంట్లు కుదుర్చుకునేలా కలెక్టర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రెండేళ్ల నుంచి వీఎంఆర్‌డీ ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా కొనసాగుతున్న మల్లికార్జున.. వైసీపీ నేత విజయసాయిరెడ్డి ఇంట్లో కూర్చుని వారు చెప్పినట్టు మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేశారన్నారు. రామానాయుడు స్టూడియో ప్రాంతాన్ని 'మిక్స్‌డ్ యూజ్'గా మార్చేసి ఇళ్లకు అనుమతించారని ఆరోపించారు.

ఇష్టానుసారం తొలగించారు

విశాఖ జిల్లాలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను అధికార యంత్రాంగం ఇష్టానుసారంగా తొలగించిందని వెలగపూడి పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా కలెక్టర్ మల్లికార్జున పట్టించుకోలేదన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు అక్కడ వైసీపీ ఇన్‌చార్జి కార్యాలయంలో పనిచేసిన ఉద్యోగులతోపాటు మొత్తం 149 మంది ఫారం-7 సమర్పించారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే గణబాబు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందన రాలేదన్నారు. అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు దొంగ ఓట్లను నమోదు చేయించారని, ఒక్కొక్కరికీ రెండేసి ఓట్లు ఇచ్చారన్నారు. గత ఏడాది జనవరిలో ఇచ్చిన ఓటర్ల జాబితాతో పోల్చితే విశాఖ తూర్పులో ముసాయిదా జాబితా విడుదల చేసే సమయానికి 8,500 ఓట్లు తొలగించారని, తర్వాత తుది జాబితా రూపొందించే నాటికి మరో 17,500 ఓట్లు తొలగించారన్నారు. ఏకంగా 17,500 ఓట్లు ఏ విధంగా, ఎందుకు తొలగించారో అధికారులు వివరణ ఇవ్వలేదన్నారు. విశాఖ తూర్పులో 30 వేల ఓట్లపై వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్హులైన ఓటర్లను సైతం తొలగించారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలోని అవకతవకలపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించబోతున్నామన్నారు.



మొవ్వ మండలం కాజలో గ్రామస్థులతో పురందేశ్వరి

రాష్ట్రంలో విధ్వంసక పాలన

- పరిశ్రమలు పరారీ.. ఉద్యోగావకాశాలు శూన్యం
- ఇక్కడ అభివృద్ధి అంతా కేంద్రానిదే: పురందేశ్వరి

కూచిపూడి, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో విధ్వంసకర, కక్షపూరిత పాలన సాగుతోందని, అందుకే పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ రావటం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శించారు. 'పల్లెకు పోదాం..' కార్యక్రమంలో భాగంగా శనివారం మొవ్వ మండలం కాజ, కోసూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాజలో పురందేశ్వరి మాట్లాడుతూ.. ఏపీ అభివృద్ధిలో సింహభాగం కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగినవేనని, ఈ విషయాలను పల్లెకు పోదాం కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. దశల వారీ మద్యపాన నిషేధమని చెప్పిన సీఎం జగన్ నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 6 వేల పోస్టుల భర్తీ అంటూ యువతను మోసగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన రహదారులు మాత్రమే రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు రాష్ట్ర అభివృద్ధి కోసం వెచ్చిందన్నారు. ఏపీలో 21 వేల గ్రామాల్లో 3 రోజులపాటు పల్లెకు పోదాం కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. అంతకు ముందుగా కోసూరు, కాజ గ్రామాల్లో ఉన్న శివాలయాలు, రామాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గుత్తికొండ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ప్రాంతీయ సమన్వయకర్తలు

- సాయిరెడ్డి, చెవిరెడ్డి, గుడివాడలకు చోటు
- విజయవాడ పార్టీ అధ్యక్షుడిగా మల్లాది

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు అసెంబ్లీ, లోక్‌సభ సమన్వయకర్తల నియామకాలు చేపట్టిన వైసీపీ అధినేత, సీఎం జగన్ తాజాగా ప్రాంతీయ సమన్వయకర్తల నియామకాలు చేపట్టారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ, లోక్‌సభ సమన్వయకర్తల ఎంపిక ప్రక్రియకు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. అసెంబ్లీ, లోక్‌సభ సమన్వయకర్తల నియామకాల్లో నేతలను అటు ఇటు మార్చుతూ గందరగోళంగా వ్యవహరించిన జగన్.. ప్రాంతీయ సమన్వయకర్తల విషయంలోనూ ఇదే వైఖరిని ప్రదర్శించడం గమనార్హం. శనివారం ప్రకటించిన ప్రాంతీయ సమన్వయకర్తల నియామకాల్లో గుంటూరు, నరసారావుపేట, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాలకు ఎంపీ విజయసాయిరెడ్డిని నియమించారు. అదేవిధంగా ఒంగోలు లోక్‌సభ, ఉమ్మడి నెల్లూరు జిల్లా రీజియనల్ కోఆర్డినేటర్‌గా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించారు. కర్నూలు, నంద్యాల లోక్‌సభ రీజియనల్ కోఆర్డినేటర్‌గా రామసుబ్బారెడ్డిని, కడప, రాజంపేట లోక్‌సభ స్థానాల ప్రాంతీయ సమన్వయకర్తగా కె. సురేశ్‌బాబును నియమించారు. ఇక, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిప్యూటీ రీజియనల్ కోఆర్డినేటర్‌గా మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు అవకాశం ఇచ్చారు. అలాగే, విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మల్లాది విష్ణును నియమించారు. ఇదిలావుంటే, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, అల్లూరి సీతారామరాజు లోక్‌సభా స్థానాల పరిధిలో రీజియనల్ కోఆర్డినేటర్‌గా ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. అయితే, తాజాగా ఇక్కడ డిప్యూటీ రీజియనల్ కోఆర్డినేటర్‌గా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను నియమించడంపై పార్టీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అమర్నాథ్‌కు వచ్చే ఎన్నికల్లో ఈ టికెట్ దక్కలేదు. తాజాగా పెందుర్తి టికెట్‌ను ఆయన ఆశిస్తున్నారు. కానీ, ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దీనిని తనకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. సర్వేలు కూడా అదీప్‌రాజ్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో అదీప్‌రాజ్‌కే టికెట్ దక్కేవీలుందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అదేవిధంగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు వచ్చే ఎన్నికల్లో ఆ సీటును ఇచ్చేందుకు నిరాకరించిన జగన్.. ఆయనను విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిని చేశారు. దీంతో ఇదేం వ్యూహమని పార్టీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌కు ఢిల్లీలో దారుణ పరాభవం

- గంటకుపైగా వేచిఉండేలా చేసిన మోదీ
- ఎంత ప్రయత్నించినా దొరకని షా దర్శనం: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సీఎం జగన్‌కు దారుణ పరాభవం జరిగిందని ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. మయసభలో సుయోధనుడికి జరిగిన పరాభవం కంటే ఇదే ఎక్కువని వ్యాఖ్యానించారు. "గంట ఐదు నిమిషాల పాటు యాంటీ రూమ్ లో వేచి చూశాకా మోదీతో జగన్ భేటీ అయ్యారు. ఎంత ప్రయత్నించినా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ దొరకలేదు. దీంతో శుక్రవారం రాత్రి కూడా ఢిల్లీలో ఉంటే పరువు పోతుందని భావించి మూటముల్లె సర్దుకొని, ఎయిర్‌పోర్టులోనే నాలుగు మెతుకులు తినేసి జగన్ బయల్దేరారు" అని ఎద్దేవా చేశారు. శనివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామకృష్ణం రాజు తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "ఎన్డీఏ కూటమిలో చేరుతామని వైసీపీ గతంలో కోరినప్పటికీ బీజేపీ ఆ పార్టీని దరిచేరనివ్వలేదు. అయినా ఎన్డీఏ కూటమిలో కలిసేందుకు గత మూడేళ్లుగా వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంది. ఒకవైపు ఇలా ప్రయత్నిస్తూనే, మరొకవైపు తమను ఎన్డీఏ కూటమిలో చేరాలని బీజేపీ నాయకత్వం కోరుతున్నట్లుగా వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి గొప్పలు చెప్పేవారు" అని రఘురామ తెలిపారు. అయితే, గో రక్షక్ పార్టీ బీజేపీ అయితే, గో భక్షక్ పార్టీ వైసీపీ అని, ఈ రెండు పార్టీల మధ్య సక్రమ సంబంధాలకు అవకాశమే లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారకర్తగా మంత్రి రోజా సెల్వమణి ఉపయోగపడతారని వ్యాఖ్యానించారు. "జగన్ ఇద్దరు చెల్లెళ్లూ రోడ్డున పడ్డారు. ఒకరు ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్నారు. మరొకరికి సెక్యూరిటీ తగ్గించారు" అని రఘురామ విమర్శించారు. జగన్ బయోపిక్‌గా రూపొందించిన యాత్ర 2 చిత్రంలో షర్మిల, వైఎస్ వివేకా పాత్రలు లేవట అని వ్యాఖ్యానించారు. యాత్ర 3 కూడా ఉంటుందని వైసీపీ నేతల వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రజలు ఎలా అపార్థం చేసుకుని 2024 ఎన్నికల్లో ఓడించారనేది ఆధారంగా చేసుకొని రూపొందించవచ్చునని రఘురామ ఎద్దేవా చేశారు.

కృష్ణాలో పది సీట్లు ఖరారు

- నూజివీడు బరిలో సారథి!
- గన్నవరం నుంచి యార్లగడ్డ
- గుడివాడ, పామర్రుకు కొత్త నేతలు
- మచిలీపట్నం, నందిగామ సహా ఐదు స్థానాల్లో పాతవారికే చాన్స్
- విజయవాడ పశ్చిమ జనసేనకు
- క్లిష్టంగా మారిన మైలవరం, పెనమలూరు





టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం
ఖరారైన అభ్యర్థులు వీరే

నియోజకవర్గం	అభ్యర్థి
మచిలీపట్నం	కొల్లు రవీంద్ర
గుడివాడ	వెనిగళ్ల రామ్మోహన్
గన్నవరం	యార్లగడ్డ వెంకట్రావు
పామర్రు	వర్ల కుమార్ రాజా
విజయవాడ తూర్పు	గద్దె రామ్మోహన్ రావు
విజయవాడ సెంట్రల్	బొండా ఉమా మహేశ్వరరావు
విజయవాడ పశ్చిమ	జనసేన అభ్యర్థి
నందిగామ	తంగిరాల సౌమ్య
జగ్గయ్యపేట	శ్రీరాం రాజగోపాల్ తాతయ్య
నూజివీడు	కొలుసు పార్థ సారథి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ అధినేత చంద్రబాబు తనపార్టీ అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పదహారు సీట్లలో 10 సీట్లకు సంబంధించి అభ్యర్థులను దాదాపు నిర్ణయించారు. కీలకమైన నూజివీడు స్థానాన్ని వైసీపీ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్న మాజీ మంత్రి, ప్రస్తుత పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ఖరారు చేశారు. అదేవిధంగా మిత్రపక్షం జనసేనకు విజయవాడ పశ్చిమ సీటును కేటాయించారు. మరో ముఖ్య నియోజకవర్గం గన్నవరం నుంచి వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన యార్లగడ్డ వెంకట్రావుకు ఇచ్చారు. మరో ఐదు స్థానాల్లో పాతవారికే అవకాశం కల్పించారు. అయితే, పదహారు స్థానాల్లో మిగిలిన ఆరు సీట్లపై ఉత్కంఠ కొనసాగుతోంది. వీటిలో రెండు సీట్లు టీడీపీ అభ్యర్థులు అంతర్గతంగా ఖరారైనా.. పొత్తుల నేపథ్యంలో వాటిని పెండింగులో పెట్టారు. ముఖ్యంగా మైలవరం సీటు వ్యవహారం పార్టీకి క్లిష్టంగా మారింది. ఈ సీటు ఎవరికి ఇస్తారనే విషయం తేలితే దీనిని బట్టి పెనమలూరు అభ్యర్థి వ్యవహారం కొలిక్కి రానుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా బీజేపీతో పొత్తు వ్యవహారం తెరపైకి రావడంతో ఆ పార్టీకి కూడా ఏదో ఒక సీటును ఇవ్వాల్సి వస్తుంది. ఇక, టీడీపీ, జనసేన పార్టీలు కృష్ణా జిల్లాలోని రెండు ఎంపీ సీట్లను చెరొకటి తీసుకొని అభ్యర్థులను కూడా ఖరారు చేయడంతో వాటి విషయంలో చర్చ లేకుండా పోయింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 16 అసెంబ్లీ సీట్లలో విజయవాడ, మచిలీపట్నం ఎంపీ స్థానాల పరిధిలో 14 ఉండగా, కైకలూరు, నూజివీడు సీట్లు ఏలూరు ఎంపీ స్థానం పరిధిలో ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఈ జిల్లాలో టీడీపీ రెండు ఎమ్మెల్యే సీట్లు గెలవగా వాటిలో వల్లభనేని వంశీ(గన్నవరం) వైసీపీలో చేరిపోయారు. టీడీపీలో ఉన్న విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావును తిరిగి అదే స్థానంలో కొనసాగిస్తున్నారు. మరో 8 సీట్లలో గుడివాడ నుంచి వెనిగళ్ల రామ్మోహన్, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు, మచిలీపట్నంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ సెంట్రల్‌లో బొండా ఉమామహేశ్వరరావు, పామర్రులో వర్ల కుమార్ రాజా, నందిగామలో తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేటలో శ్రీరాం రాజగోపాల్ తాతయ్య టీడీపీ తరఫున నిలబడనున్నారు. నూజివీడులో టీడీపీ తరఫున ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నిలబడడం ఖరారైంది. విజయవాడ పశ్చిమ సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున పోతిన వెంకట మహేశ్ నిలబడనున్నారని సమాచారం. ఇక, కీలకమైన మైలవరం సీటుకు అభ్యర్థి ఎంపిక టీడీపీ నాయకత్వానికి క్లిష్టంగా మారినట్టు తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే, గత ఎన్నికల్లో దేవినేనిపై గెలిచిన వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలోకి వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారు. వీరిద్దరిలో ఈ సీటు ఎవరికి ఇవ్వాలన్నది టీడీపీ నాయకత్వానికి కొరుకుడు పడడం లేదు. ఈ సీటు విషయం తేలకపోవడంతో విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న పెనమలూరు సీటు అభ్యర్థి ఎంపిక కూడా పెండింగ్‌లో పడింది. మైలవరంలో పోటీలో ఉన్న ఇద్దరిలో ఒకరికి అక్కడ ఇచ్చి, రెండో వారికి పెనమలూరు సీటు ఇచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనసేన పార్టీతో సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తి స్థాయిలో తేలకపోవడంతో ఈ జిల్లాలో రెండు సీట్లపై ఉత్కంఠ కొనసాగుతోంది. అవనిగడ్డ, పెడన సీట్లకు టీడీపీ నుంచి ఇన్‌చార్జులుగా మండలి బుద్ధ ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్ ఉన్నారు. ఈ రెండు సీట్లలో ఒక దానిని జనసేన ఆశిస్తోంది. దీంతో ఆ మేరకు జనసేనకు ఇస్తారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఈ సీట్లు టీడీపీకే ఉండే పక్షంలో ఆ నియోజకవర్గాల ఇన్‌చార్జులే తెలుగు దేశం పార్టీ నుంచి పోటీ చేయనున్నారు. ఇక, తిరువూరు రిజర్వుడు సీటులో అభ్యర్థి విషయం కూడా కొలిక్కి రాలేదు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం శ్యావల దేవదత్ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే, ఇటీవల పార్టీలో చేరిన కొలికపూడి శ్రీనివాసరావు కూడా ఈ సీటు కోసం రంగంలోకి దిగారు. కొన్ని సమీకరణల నేపథ్యంలో పార్టీ కొలికపూడి అయితేనే ఉత్తమమని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా కైకలూరు అసెంబ్లీ సీటు వ్యవహారం తేలడానికి కొంత సమయం పడుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ నేత, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ గతంలో ఈ సీటుకు ప్రాతినిధ్యం వహించారు. టీడీపీతో బీజేపీ పొత్తు కుదిరితే ఈ సీటును ఆయన ఆశించే అవకాశముంది. ఈ సీటు బీజేపీకి లభిస్తే ఆయనకు అవకాశం లభించవచ్చని అంటున్నారు. మరోవైపు ఇదే సీటు కోసం టీడీపీలో ప్రధానంగా ఇద్దరు నేతలు రేసులో ఉన్నారు. పెన్మత్స వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు పేర్లు ఇక్కడ పరిశీలనలో ఉన్నాయి.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

గుంటూరులో అతిసారం

వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి

- వందల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రులపాలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో 24 మందికి చికిత్స
- అర్ధరాత్రి వెళ్లి పరామర్శించిన మంత్రి రజని

గుంటూరు, ఫిబ్రవరి 10: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ సొంత జిల్లా గుంటూరులో అతిసారం ప్రబలింది. వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందారు. వందల సంఖ్యలో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పలు కాలనీల్లో మంచినీటి పైపులకు ఏర్పడిన లీకేజీలతో నీరు కలుషితమై నగరవాసులు అతిసారం బారిన పడ్డారు. శారద కాలనీ, శ్రీనగర్, సంగడిగుంట, అహ్మద్ నగర్, తిరుమలాచారి కాలనీల్లో వందల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. తీవ్రమైన వాంతులు, విరోచనాలతో నీరసించి పడకలపై సొమ్మసిల్లి పడి ఉన్న చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న 26 మందిని జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో అతిసారం తీవ్రతతో బుధవారం సంగడిగుంట సమీపంలోని తిరుమలాచారీ కాలనీకి చెందిన కొర్రపాటి ఓబులు(50), శనివారం శారదా కాలనీకి చెందిన శీల పద్మావతి(17) మృతి చెందారు. నాలుగు రోజులుగా అతిసారం లక్షణాలు కనిపిస్తున్నా చర్యలు తీసుకోవడంలో నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ప్రభుత్వ సమగ్రాస్పత్రి క్యాజువాల్టీలో అతిసార బాధితుల కోసం 20 పడకలు ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా పది పడకలతో ప్రత్యేక ఐసీయూ సిద్ధం చేసి చికిత్సలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

టీడీపీ, జనసేన ఆందోళన

టీడీపీ, జనసేన పార్టీల నేతలు శనివారం ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీకి వచ్చి బాధితుల కుటుంబాలను పరామర్శించారు. జీజీహెచ్‌లో ఆందోళనకు దిగారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఇద్దరు చనిపోయినా పట్టించుకోరా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని గుంటూరు జీజీహెచ్‌కు వచ్చి బాధితులను పరామర్శించారు.

హార్సిలీహిల్స్ చేరిన 'యాత్ర!'

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమైపోయింది. హార్సిలీహిల్స్‌పై టూరిజం రిసార్టుకు దగ్గర్లోనే రెండెకరాల స్థలాన్ని మహీ వి.రాఘవకు కట్టబెడుతున్నారు.

లైట్.. కెమెరా.. యాక్షన్

'త్రీ ఆటమ్ లీవ్స్' అనే సంస్థ యాత్ర-2 చిత్రాన్ని నిర్మించింది. దీని వ్యవస్థాపకుడు మహీ వి.రాఘవ. సినిమా డైరెక్టర్ కూడా ఆయనే. 'రూరల్ మినీ స్టూడియో' నిర్మిస్తానని... చిత్ర పరిశ్రమను విస్తృతం చేస్తానని... అందుకు హార్సిలీహిల్స్‌లో పదెకరాల స్థలం ఇవ్వాలని కోరుతూ గత ఏడాది జూన్ 17న ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అంటే... అక్కడ స్థలం కొట్టేయడానికి 'స్క్రిప్టు' రెడీ అయిపోయిందన్న మాట! సర్కారు పెద్దలు 'సరే' అనడానికి కాస్త సమయం పట్టినట్లుంది! అట్నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే... జూలైలో త్రీ ఆటమ్ లీవ్స్ సంస్థ 'యాత్ర-2' సినిమా తీస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టులో షూటింగ్ మొదలైంది. ఆ తర్వాత కొన్నాళ్లకే 'మినీ స్టూడియో కోసం హార్సిలీహిల్స్‌లో స్థలం' కోసం పెట్టుకున్న దరఖాస్తులో కదలిక వచ్చింది. రాఘవ రాసిన లేఖను పరిశీలించి, ఈ ప్రతిపాదనలపై తగు చర్యలు తీసుకోవాలంటూ గత ఏడాది సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి పర్యాటక శాఖను ఆదేశించారు. ఆ తర్వాత 'యాత్ర-2' షూటింగ్ జరుగుతున్న వేగానికి అనుగుణంగా ఫైల్ కదులుతూ వచ్చింది. ఈ స్థలం 'అప్పగింతల' సంగతి తేల్చాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు గత నెల 29న రెవెన్యూ స్పెషల్ సీఎస్ నుంచి లేఖ వెళ్లింది. ఆ తర్వాత వారంలోనే... ఈనెల 6వ తేదీన అన్నమయ్య జిల్లా కలెక్టర్ బి.కొత్తకోట మండల తహసీల్దార్‌కు దీనిపై లేఖ రాశారు. 'మినీ స్టూడియో, అమ్యూజ్‌మెంట్ పార్కుకోసం రెండెకరాలు అప్పగిస్తూ పూర్తిస్థాయి ప్రతిపాదనలు పంపించండి. ఇది చాలా అర్జెంట్... అని ఆదేశించారు. శుక్రవారం 'యాత్ర-2' విడుదల



మినీ స్టూడియో నిర్మాణానికి హార్సిలీహిల్స్‌లో స్థలం కేటాయించాలని మహీ వి.రాఘవ గత ఏడాది పెట్టుకున్న దరఖాస్తు.

హార్సిలీహిల్స్‌కు 'ఆంధ్రా ఊటీ'గా పేరు. వేసవి కాలంలోనూ చల్లటి గాలులతో ఆహ్లాదాన్ని పంచుతుంది. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. ముఖ్యంగా వీకెండ్‌లో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి ఐటీ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు తరలి వస్తారు. ఇక్కడి ఎత్తైన కొండపై సేద తీరుతూ సూర్యోదయం, సూర్యాస్తమయ సుందర దృశ్యాలను ఆస్వాదిస్తుంటారు. ఇక్కడ ఇప్పటికే అనేక సినిమాలను చిత్రీకరించారు. ఇక్కడికి దగ్గర్లోనే ప్రఖ్యాత 'రుషి వ్యాలీ' స్కూల్ కూడా ఉంది. సరిగ్గా ఇక్కడే తనకు పదెకరాలు కావాలని 'యాత్ర-2' దర్శక నిర్మాత కోరడం, అందుకు అనుగుణంగా సర్కారు చర్యలు తీసుకోవడం గమనార్హం!

ఆంధ్రా ఊటీ!



శుక్రవారం హార్సిలీహిల్స్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మదనపల్లె ఆర్డీవో

కాగానే... మదనపల్లి ఆర్డీవో హరిప్రసాద్, బి.కొత్తకోట మండల అధికారులు హార్సిలీహిల్స్‌కు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. తొలి విడతలో దాదాపు రెండెకరాల భూమిని మహీ వి.రాఘవకు కేటాయించేందుకు వీలుగా ప్రతిపాదను సిద్ధం చేసినట్లు తెలిసింది. అంటే... స్థలం కేటాయింపు చిత్రం 'ప్రీ క్లైమాక్స్'కు చేరుకున్నట్లే!

క్రీడా శిక్షణ కేంద్రం గాయబ్...

సముద్రమట్టానికి 4 వేల అడుగుల ఎత్తులో ఉన్న హార్సిలీహిల్స్‌లో స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుంది. ఇక్కడ పర్యాటక శాఖకు 20 ఎకరాల స్థలం ఉంది. ఇక్కడే క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. హార్సిలీహిల్స్ కోటావూరు గ్రామ పరిధిలో సర్వే నెంబరు 571/1లో 3.74 ఎకరాల స్థలాన్ని 2018లో 'శాప్'కు కేటాయించారు. భవనాలతో పాటు ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.3.20 కోట్లు కేటాయించారు. రూ.1.60 కోట్లు ఖర్చు చేసి ఇప్పటికే ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో ఈ క్రీడా శిక్షణా కేంద్రం వ్యవహారం మరుగున పడిపోయింది. ఇప్పుడు సరిగ్గా ఇదే స్థలాన్ని 'యాత్ర-2' దర్శక నిర్మాత మహీ వి.రాఘవకు కట్టబెడుతున్నారు. నిజానికి... హార్సిలీహిల్స్‌లో మినీ స్టూడియోకు స్థలం కేటాయించలేమని పర్యాటక శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేసింది. ఫైల్ మొత్తం ఎప్పుడో రిజెక్ట్ అయింది. అయినప్పటికీ... ప్రభుత్వం నేరుగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ ద్వారా మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేయించింది. ప్రస్తుతం అక్కడ 3.74 ఎకరాల పర్యాటక శాఖ భూమి ఖాళీగా ఉంది. అందులో నుంచి రెండు ఎకరాలను మహీ వి.రాఘవకు ఇవ్వాలని ప్రతిపాదించారు. తదుపరి దశలో మిగిలినదీ ఆయనకే కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.



జ్యోతి ప్రజ్వలన చేసి, వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ అమానుల్లా దంపతులు

న్యాయవాద వృత్తి వ్యాపారం కాదు

అది శ్రమ, విలువలతో కూడిన బాధ్యత

- ఒత్తిళ్లను జయిస్తేనే మంచి ఫలితాలు
- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమానుల్లా
- అనంతపురంలో యువ న్యాయవాదుల వర్క్‌షాప్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10: న్యాయవాద వృత్తి వ్యాపార రంగం కాదని, విలువలతో కూడిన బాధ్యత అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా అన్నారు. ఈ వృత్తి గౌరవప్రదమైనదని, ఒత్తిళ్లను జయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించిన యువ న్యాయవాదుల వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సారథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్, అనంతపురం జిల్లా బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమానుల్లా, గౌరవ అతిథులుగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ అమానుల్లా మాట్లాడుతూ.. న్యాయమూర్తులు, లాయర్స్, అడ్వొకేట్స్, న్యాయ విద్యార్థులు ఈ రంగంలో భాగస్వాములని వివరించారు. నైతిక విలువలను పాటించి, కక్షిదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ క్రమంలో వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. న్యాయవాదులు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యమని జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. సుసంపన్నమైన దేశాన్ని నిర్మించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని అన్నారు. పౌరుల హక్కులను పరిరక్షించే బాధ్యత న్యాయవాదులపై ఉందని అన్నారు. కాగా, ఫైల్‌ను పూర్తిగా చదివినప్పుడే న్యాయవాది కేసును సక్రమంగా వాదించగలరని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. లేకుంటే కోర్టు సమయాన్ని వృథా చేసినవారవుతారని చెప్పారు. నేడు టెక్నాలజీ వినియోగం పెరిగిందని, దీంతో కట్ అండ్ కాపీ పేస్ట్ పద్ధతిలో సులువుగా సారాంశాన్ని పొందుపరుస్తున్నారని అన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం కేస్ ఫైల్‌ను క్షుణ్ణంగా చదివి, రాసేవారమని గుర్తు చేసుకున్నారు.



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జస్టిస్ అమానుల్లా

ఇంత దుర్మార్గమా?

- అవసరాలకు దాచుకున్న డబ్బులూ ఇవ్వరా?
- మహిళా ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు
- నాలుగేళ్లుగా బకాయిలు పెండింగ్
- కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఇచ్చే సౌకర్యాలు మాకూ కల్పించాలి
- ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం

విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వరా? ఇదెక్కడి అన్యాయం?' అని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్రప్రభుత్వంలో అయినా, రాష్ట్రప్రభుత్వంలో అయినా మహిళా ఉద్యోగులు పనిచేసే విధానం ఒక్కటే అయినా.. ఇక్కడి మహిళా ఉద్యోగుల పట్ల చిన్న చూపు చూడటం బాధాకరంగా ఉందని మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పారె లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి అన్నారు. శనివారం విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. "మహిళా ఉద్యోగులపై పెరుగుతున్న లైంగిక వేధింపులు, అరాచకాల నివారణ గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మహిళలపై వేధింపులకు సంబంధించి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ (ఐసీసీ)లు లేవు. ప్రభుత్వ కార్యాలయాలలో మహిళలకు కనీసం టాయ్‌లెట్లు కూడా లేవు. శిశు సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా మూడు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా చర్యలు తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రెండు సంవత్సరాల పాటు చైల్డ్ కేర్ లీవులు ఇస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం ఆరు నెలలు మాత్రమే ఇస్తున్నారు. కేంద్రప్రభుత్వ మహిళా ఉద్యోగినులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవులు ఇవ్వాలి. నాలుగేళ్లుగా డీఏలు, సరెండర్ లీవులు, పీఆర్సీ అరియర్స్, పదవీ విరమణ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవటం దారుణం. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను ఇవ్వకపోవటం ఎక్కడి న్యాయం?" అని మండిపడ్డారు. 26 జిల్లాల కమిటీల కార్యవర్గం ఈ సమావేశానికి హాజరైంది. ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఈ సమావేశంలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల చరిత్రలోనే మొదటిసారిగా రాష్ట్ర స్థాయిలో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి, 26 జిల్లాల్లో పూర్తి స్థాయి కమిటీలను నియమించినట్టు బొప్పరాజు వివరించారు. హెడ్ క్వార్టర్స్‌కు సంబంధించి క్యాపిటల్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



మహిళా ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు, పారె లక్ష్మి,. పొన్నూరు విజయలక్ష్మిలు



కార్ పార్కింగ్‌గా మారిపోయిన గ్రౌండ్ ఫ్లోర్‌ను కొలతలు వేస్తున్న సిబ్బంది

తిరుమలలో శారదా పీఠం నిర్మాణాల పరిశీలన

- హైకోర్టు నుంచి అడ్వకేట్ కమిషనర్ రాక
- దాదాపు మూడు గంటలకుపైగా పరిశీలన

తిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల గోగర్భం డ్యాం ప్రాంతంలోని విశాఖ శారదా పీఠం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు, న్యాయవాది తుమ్మా ఓంకార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని జనవరి 24న ఆదేశించిన విషయం తెలిసిందే. అదేసమయంలో నిర్మాణాలకు సంబంధించి ఏ మేరకు అతిక్రమణలు జరిగాయో తేల్చేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ఈ క్రమంలో శనివారం అడ్వకేట్ కమిషనర్ వివేకానంద విరూపాక్షతో పాటు పిటిషనర్ తరపు న్యాయవాది జితేంద్ర, టీటీడీ న్యాయ విభాగం అధికారి వీర్రాజు, అసిస్టెంట్ లా ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసు, విజిలెన్స్ అధికారులు శారదా పీఠం నిర్మాణాలను పరిశీలించారు. మఠంలోని ఏ, బీ బ్లాక్‌లు, సెట్‌బ్యాక్‌ల కొలతలు నమోదు చేశారు. దాదాపు మూడుగంటల పాటు సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ నివేదికను త్వరలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించనున్నారు. కోర్టు నుంచి ఆర్డర్ వచ్చిన తర్వాత భవనం కిందభాగంలోని గదులు కారు పార్కింగుగా మారడం గమనార్హం. భవనంలో ఆగమేఘాలపై చేసిన మార్పులను చూసి పిటిషనర్, ఆయన తరపు న్యాయవాది అవాక్కయ్యారు. అడ్వకేట్ కమిషనర్ పరిశీలన అనంతరం తుమ్మా ఓంకార్ మీడియాతో మాట్లాడుతూ.. "తిరుమలలో మొత్తం అధర్మమే నడుస్తోంది. శారదాపీఠాన్ని కాపాడేందుకు టీటీడీ చాలా ఉల్లంఘనలకు పాల్పడుతోంది" అన్నారు. అడ్వకేట్ కమిషనర్ వచ్చే సమయానికి భవన నిర్మాణాన్ని చాలా వరకు మార్చేశారని ఆరోపించారు. దీనిపై కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. మఠం వెనుకభాగంలోని ఊట కాలువను పూడ్చివేసి రోడ్డు వేస్తామని, పక్కనే ఉన్న మఠం స్థలాన్ని వినియోగించుకుంటామని టీటీడీ చెబుతోందని తెలిపారు. టీటీడీ చరిత్రలో ఇలాంటి భూకబ్జాలు, అక్రమకట్టడాలు చూడలేదన్నారు. ప్రభుత్వ, దేవదాయ భూములను ఎవరైనా కబ్జా చేస్తే రెగ్యులరైజ్ చేయకూడదని, కానీ 2020లో శారదా పీఠం కబ్జా చేసిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని మండిపడ్డారు. ఈ జీవోను కూడా తాము కోర్టులో సవాల్ చేస్తామన్నారు. ఈవో ధర్మారెడ్డి పేరులో ధర్మం ఉంది కానీ ఆయన చేసేదంతా అధర్మమేనని ఓంకార్ మండిపడ్డారు. పిటిషనర్ తరపు న్యాయవాది జితేంద్ర మాట్లాడుతూ.. శారదా పీఠంలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకోడానికి అడ్వకేట్ కమిషనర్ వచ్చారని వివరించారు.

ఎన్నికల నిర్వహణలో పాల్గొనేవారికి శిక్షణ

ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలి: సీఈవో ఎంకే మీనా



అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొనే బృందాలకు శిక్షణ కార్యక్రమాలను ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు సంసిద్ధత, ఓటర్ల జాబితా నవీకరణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను మార్చి నెలలో నిర్వహించుకోవచ్చన్నారు. పలువురు అధికారులను ఆర్‌ఓలుగా, ఏఆర్‌వోలుగా, ఈఆర్‌వోలుగా, ఏఈఆర్‌ఓలుగా నియమించామని, ఇంకా ఎవరైనా విధుల్లో చేరకుంటే, వారి వివరాలను తెలియజేస్తే.. తగు చర్యలు తీసుకుంటామన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో హోమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది డేటాను వెంటనే పోర్టల్‌లో ఫీడ్ చేయాలన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, వీడియో వ్యూయింగ్ టీముల వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ సౌకర్యం ఉండాలన్నారు.

ప్రాణాలు తీసిన నిద్రమత్తు!

- నెల్లూరు జిల్లా కావలిలో ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ
- ఆపై డివైడర్ దాటి.. ఎదురుగా వస్తున్న బస్సునూ..
- ఏడుగురు మృతి.. 26 మందికి గాయాలు

కావలి, ఫిబ్రవరి 10: లారీ డ్రైవర్ నిద్రమత్తు ఏడుగురి ప్రాణాలు బలిగొంది. మరో 26 మందిని గాయాలపాలు చేసింది. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో శనివారం తెల్లవారుజామున జరిగిందీ ఘోర ప్రమాదం. ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. అనంతరం డివైడర్ ఎక్కి ఇవతలి వైపు ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సునూ ఢీకొంది. దీంతో రెండు లారీలు, బస్సు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి ఆవుల లోడుతో తిరుపతి జిల్లా నాయుడుపేటకు వెళ్తున్న లారీని కావలి పట్నం ముసునూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో జార్ఖండ్ నుంచి ఐరన్ లోడుతో చెన్నై వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆవుల లోడ్ లారీ పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. అనంతరం ఐరన్ లోడ్ లారీ అదుపుతప్పి డివైడర్ ఎక్కి అవతలివైపునకు దూసుకెళ్లింది చెన్నై నుంచి 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సును ఎదురుగా వెళ్లి ఢీకొంది. ఘటన స్థలంలోనే ఇద్దరు డ్రైవర్లు, ఓ క్లీనర్, బస్సులోని ఓ ప్రయాణికుడు మరణించగా, ఆస్పత్రుల్లో మరో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు విడిచారు. మృతులను తమిళనాడు కాంచీపురానికి చెందిన బస్సు డ్రైవరు మునుస్వామి తంబిరాన్(36), నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెనుబర్తికి చెందిన ఐరన్‌లోడ్ లారీ డ్రైవర్ సొంటి వేణు(23), హైదరాబాద్‌కు చెందిన పశువుల లారీ క్లీనర్ పటేల్ దీపక్(29), బస్సులోని ప్రయాణికులు.. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన అంజూరు సురేశ్(33), కృష్ణా జిల్లా నాగాయలంక ఏసుపురానికి చెందిన కొప్పాడి తంబిస్వామి (30), హైదరాబాద్‌కు చెందిన అటల్ రూప(39)గా గుర్తించారు. మృతుల్లో మరో గుర్తు తెలియని ప్రయాణికుడు(25) కూడా ఉన్నారు. ఐరన్‌లోడ్ లారీ డ్రైవర్ నిద్రమత్తు వల్ల ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు అత్యవసర ద్వారం తెరుచుకోకపోవడంతో అద్దాలు పగలగొట్టుకుని ప్రయాణికులు కిందకు దిగి వెళ్లిపోయారు. కావలి డీఎస్పీ ఎం.వెంకట రమణ, సీఐలు శ్రీనివాసరావు, రాజేష్ సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.



నుజ్జునుజ్జయిన ట్రావెల్ బస్సు, ఐరన్‌లోడ్ లారీ ముందు భాగాలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన త్రీటౌన్ ఎస్సై

మద్యం విక్రేత అరెస్టు

వన్‌టౌన్: త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక లాడ్జ్ ముందు శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బూరుగు గూడానికి చెందిన కవ్వూరి ఏడుకొండలు (43) నిందితుడు తాను పనిచేస్తున్న బెజవాడ బార్ నుంచి యజమానికి తెలియకుండా మద్యం బాటిళ్లను తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో సంఘటన ప్రదేశానికి వచ్చి ఏడుకొండలను అరెస్టు చేశారు. అతడి నుంచి ఒక్కొక్కటి రూ.120 విలువైన 25 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

రాణిగారి తోట సాయిబాబా గుడి వెనుక గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణలంక పోలీసులు అరెస్టు చేశారు నిందితుల నుంచి 6.300 కిలోగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉంటున్న టి వెంకటేష్, పి నాని, సిహెచ్ జయరాజ్ కొన్నిరోజులుగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న కృష్ణలంక పోలీసులు శనివారం ఉదయం నిందితుల వద్దకు సీఐ ఆకుల మురళీకృష్ణ తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

వేర్వేరుగా ఇద్దరి అదృశ్యం

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయినట్టు అందిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు విచారణ జరుపుతున్నారు. కబేళా ప్రాంతానికి చెందిన యువతి (19) నగరంలోని ఒక కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. 6 నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆమెకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేదు, చివరిగా రెండు రోజుల క్రితం ఒక ప్రముఖ ఆసుపత్రిలో టెస్టులు చేశారు. రెండు రోజులలో టెస్ట్ ఫలితాలు వస్తాయన్నారు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు అందరూ భోజనాలు చేసి పడుకున్నారు వేకువజామున లేచి ఆమెను చూడగా, కనిపించలేదు.

మరో సంఘటనలో సితార సెంటర్ చర్చివీధిలోని నిడదవోలు ఆనందకుమార్ (30) ఇంటీరియల్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. అయితే ఆన్‌లైన్‌లో బెట్టింగులు వేస్తాడు, దీంతో అప్పుల పాలవ్వడమే కాకుండా, మద్యానికి బానిసయ్యాడు, భార్య ఎంత చెప్పినా వినలేదు, ఈనెల 7న ఇంట్లోంచి బయటకు వెళ్లాడు, రాత్రి వరకు రాకపోవడంతో భార్య అతనికి ఫోన్ చేసింది, సీతారాంపురంలో ఉన్నాను, వస్తున్నానంటూ బదులిచ్చాడు. ఆతరువాత నుంచి ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిట్టినగర్: మరో రెండు వేర్వేరు కేసుల్లో వివాహిత, బాలుడు అదృశ్యమైనట్టు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీలో సునీల్‌రాజు కుటుంబంతో నివాసం ఉంటుంది. భార్య స్వప్న, కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. రాజు దుర్గగుడి స్వీపర్. శుక్రవారం పని ముగించుకొని ఇంటికొచ్చిన రాజుకు భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా బంధువుల ఇళ్ల లో వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో కేసులో వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఖతూన్ వించిపేటకు చెందిన తన తమ్ముడుకు మగ పిల్లలు లేకపోవడంతో తన కుమారుడైన ఆయాన్(11)ను దత్తత ఇచ్చింది. అప్పుడప్పుడు వచ్చి చూసి పోతుంటారు. ఈ నెల 3న ఆయాన్ చిన్న తప్పు చేశాడని మరదలు మందలించిందని తన కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లి పోయాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుడికి గాయాలు

వన్‌టౌన్: భవానీపురంలో శనివారం ఉదయం జాతీయరహదారి దాటుతున్న వీఎంసీ పారిశుద్ధ్య కార్మికుడు ములకపాటి నాగరాజు (32)ను మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు, ఇందిరా ప్రియదర్శిని కాలనీకి చెందిన నాగరాజు వీఎంసీ కార్మికుడుగా భవానీపురంలో పనిచేస్తున్నాడు, ప్రియదర్శిని కాలనీలో పనిచేస్తుండగా, అతడిని మేస్త్రీ జలసూత్రం శ్రీను దర్గా వద్దకు తీసుకువెళ్లాడు, రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. బాధితుడి ఫిర్యాదు మేర కు భవానీపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దుల్హన్ పథకాన్ని అమలు చేయాలి

ధర్నాచౌక్: ముస్లింలకు దుల్హన్ పథకాన్ని అమలు చేయాలని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు లోన్లు ఇవ్వాలని, అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను ముస్లింలకు ఇవ్వాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు.

54, 77, 186 జీవోలను సవరించాలి

- ఏపీ విద్యుత్ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నవాజ్‌ఖాన్

ధర్నాచౌక్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖాజీపూర్ హంజా నవాజ్‌ఖాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోంలో శనివారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల జారీచేసిన 54, 77, 186 జీవోల్లోని కొన్ని అంశాలతో దివ్యాంగ ఉద్యోగులకు నష్టం కలుగుతుందని, వాటిని సవరించి సరిగా అమలు చేయాలన్నారు. ఎం.సాయిబాబా, కేసీ.అరవింద్‌కుమార్, పి.రవిశంకర్, ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యదర్శి బి.సుధాకర్, ఏపీజెన్‌కో అధ్యక్షుడు కేవీఆర్.చక్రపాణి పాల్గొన్నారు.

ఐటా టెన్నిస్‌లో మల్లిఖార్జునరావు సత్తా

విజయవాడ స్పోర్ట్స్: విశాఖలో వాల్తేరు ఆఫీసర్స్ క్లబ్‌లో ఈనెల 4నుంచి 8వరకు జరిగిన ఐటా మాస్టర్స్ టెన్నిస్‌లో విజయవాడ మాస్టర్ టెన్నిస్ ప్లేయర్ ఎం.మల్లిఖార్జునరావు సత్తా చాటారు. 75 ప్లస్ డబుల్స్‌లో డీఎస్ఎన్.రాజు (విశాఖ)తో కలిసి బరిలో దిగి రన్నరప్ టైటిల్‌ను వశం చేసుకున్నారు. ఆయన్ను జిల్లా ప్రతినిధులు అభినందించారు.





నిరసనలో పాల్గొన్న పీఈటీ అభ్యర్థులు, ధర్నాలో పాల్గొన్న ప్రత్యేక ఉపాధ్యాయ అభ్యర్థులు

డీఎస్సీలో అదనంగా 4వేల పీఈటీ పోస్టులు కలిపి

నోటిఫికేషన్ విడుదల చేయండి

డీవైఎఫ్, ఏపీవీవీపీఎస్ నేతల డిమాండ్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 10: దాదాపు 10వేలకు పైగా పీఈటీ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉంటే కేవలం 6100 పోస్టులను ప్రకటించి అందులో ఒక్క పీఈటీ పోస్టు లేకపోవడం సిగ్గుచేటని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.రామన్న, వ్యాయామ ఉపాధ్యాయ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రగౌడ్ విమర్శించారు. తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించి అందులో 4వేల పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ విద్యను పాతాళానికి తొక్కేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్.నాగేశ్వరరావు, కృష్ణకాంత్, కృష్ణ, పలువురు పీఈటీ అభ్యర్థులు పాల్గొన్నారు.

6800 పోస్టులను భర్తీ చేయండి: యూటీఎఫ్

స్పెషల్ డీఎస్సీ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు లేనప్పుడు స్పెషల్ టెట్ 1బీ, 2బీ పేపర్లు దేనికోసం నిర్వహించారని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ టీచర్ ఫోరమ్ (యూఎస్‌టీఎఫ్) నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక ధర్నాచౌక్‌లో ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్పెషల్ బీఈడీ, డీఈబీ ట్రైనీ అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ ద్వారా పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేటర్స్‌గా ఉద్యోగాలు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చేశారు. ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ మెర్ల నాగ సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి బేటు రాజకుమార్, రాష్ట్ర మహిళా చైర్మన్ తాడి సరిత, చొప్పల అరుణకుమారి పాల్గొన్నారు.

ప్రేక్షకుల్ని అలరించిన కహాన్ కబీర్

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 10: రాముడు, రహీం ఇద్దరూ సమానమేనని తొలి ప్రతిపాదన చేసిన సాధువుల పేరిట కొందరు చేసే మోసాలను వ్యతిరేకిస్తూ మనసుకున్న మురికిని తొలగించకుండా గంగాస్నానం చేసినా ఫలితం శూన్యమని బోధిస్తూ ఇలాంటి తత్వసత్యాలను బోధిస్తూ కహాన్ కబీర్ నాటకం ప్రేక్షకులకు కబీర్ సత్యశోధన సందేశాన్ని అందించింది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, అనుబంధ సంస్థ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాటక ప్రదర్శనలో భాగంగా ఐదో రోజు శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌కు చెందిన రంగ్ విదూషక్ బృందం 30 మంది నటులు కహాన్ కబీర్ నాటకం ప్రదర్శించారు. బన్సీకౌల్ దర్శకత్వంలో కబీర్ శ్లోకాల నుంచి తీసుకొన్న సూక్తులు, నీతి బోధనలను నాటకంగా ఆవిష్కరించారు. కబీర్ జీవించిన కాలాన్ని చెప్తూ ఆయన ప్రతిఘటనను వర్ణిస్తాయి. ఈ నాటకంలో దర్శకుడితో పాటు నటీనటులు అద్భుతమైన ప్రతిభను తమదైన రీతిలో రంగులు అద్దుతాయి. అమోఘ్ విక్రమ్, విమలేష్, పటేల్, సావిత్రి బండారి, ఆదితి రాయ్, వంశ్ సాహు, అమిత్ రిచారియా, హర్షదౌండ్, సంకిత్‌సెజ్వార్, ఉపేంద్ర మహంత, ఇంజమామ్-ఉర్-రెహ్మాన్, రోహిత్ ఠాకూర్, నిఖిల్, రాజాఠాకూర్, నీతి శ్రీవాస్తవలు ప్రధాన పాత్రలో నటించారు. ప్రధాన గాయని అంజనా పూరి సంగీత దర్శకత్వంలో గాత్ర, వాద్య మాధుర్యంతో మైమరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లిఖార్జునరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సంస్థ ప్రతినిధి వివేక్, పివిఎస్ కృష్ణ, పసుమర్తి భాస్కరశర్మ, సినీనటుడు నాయుడు గోపి, సాంస్కృతిక శాఖ మేనేజర్ సుమన్ పాల్గొన్నారు.



కబీర్ కహానీ నాటకంలోని ఓ సన్నివేశంలో కళాకారులు

16న భామాకలాపం-2 విడుదల

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 10: ఈ నెల 16న భామాకలాపం-2 చిత్రం విడుదల కానున్నట్టు తెలుగు హీరోయిన్ ప్రియమణి తెలిపారు. క్రైమ్, థ్రిల్లర్, సస్పెన్స్, కామెడీ అన్ని అంశాలతో రాబోతుందన్నారు. చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షిస్తుందని, చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. హీరోయిన్ ప్రియమణి, సిరత్, శరణ్య కాంబినేషన్‌లో వచ్చిన భామాకలాపం-2 చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నగరంలో శనివారం చిత్రయూనిట్ సందడి చేసింది. హోటల్ మురళీ ఫార్చ్యున్ పార్క్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరోయిన్ ప్రియమణి మాట్లాడారు. భామాకలాపం-1 పెద్ద సక్సెస్ అయిందని, భామాకలాపం-2 కూడా సక్సెస్ చేయాలని ప్రేక్షకుల్ని కోరారు. నరసింహ చిత్రంలో రమకృష్ణ పాత్ర తనకెంతో ఇష్టమని అలాంటి పాత్ర వస్తే ఖచ్చితంగా చేస్తానన్నారు. హీరోతో సమానంగా ఉండే విలన్ పాత్రని పోషించాలని ఉందన్నారు. హిందీలో నటించిన ఆర్టికల్ 370 చిత్రం, అజయ్‌దేవగన్‌తో నటించిన మైదాన్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. మరో హీరోయిన్ సిరత్ మాట్లాడుతూ భామాకలాపం-2లో నటించడం సంతోషంగా ఉందన్నారు. హీరో నితిన్‌తో కొత్త మూవీలో కనిపించనున్నట్టు తెలిపారు. నటి శరణ్య మాట్లాడుతూ భామాకలాపం-1లో పనిమనిషిగా తన పాత్ర ఎంతగానో ప్రేక్షకుల్ని ఆకట్టుకుందని, ఈ చిత్రంలోనూ తన పాత్ర ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. ఈ చిత్రంలో ప్రియమణి చెల్లిగా నటిస్తున్నానని, అక్కాచెల్లెళ్లుగా మేమిద్దరం నటించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో చాలామంది సీనియర్ నటులు నటిస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న నటి ప్రియమణి, సిరత్, శరణ్య

విద్యార్థులు సంపాదకీయాలు చదవాలి

మొగల్రాజపురం, ఫిబ్రవరి 10: సమాజంపై అవగాహన పెరగాలంటే ప్రతి విద్యార్థి పత్రికల్లో సంపాదకీయం చదవడం అలవాటు చేసుకోవాలని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బ్రహ్మయ్య అండ్ కంపెనీ భాగస్వామి బ్రహ్మయ్య కుమారుడు పర్వతనేని సంతోష్‌కుమార్ చెప్పారు. వీబీ సిద్ధార్థ కళాశాల 49వ వార్షికోత్సవం శనివారం కళాశాల మైదానంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, వైజ్ఞానిక, ఆర్థిక సామాజిక అంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ కళాశాల జీవితంలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, సమయపాలన, ప్రణాళిక బద్ధమైన చదువు, కృషి అలవరచుకుంటే మంచి ఉన్నత స్థానానికి చేరుకోవడం సులభమవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ చుండి వెంకటేశ్వర్లు, డాక్టర్ మేకా రమేష్ వార్షిక నివేదిక చదివి వినిపించారు.

సిద్ధార్థ అకాడమీ వైస్ ప్రె సిడెంట్ మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు ల క్ష్మణరావు, కళాశాల కన్వీనర్ నూరెడ్డి వెంకటే శ్వరరా వు విద్య, ఆటలు, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించారు. కళాశా ల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, విద్యార్థులు పాల్గొన్నా రు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అలరించాయి.



సాంస్కృతిక ప్రదర్శనలో నర్తిస్తున్న విద్యార్థినులు

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి విరాళాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 10: దుర్గగుడిలో నిత్యాన్నదానానికి శనివారం ముగ్గురు దాతలు వేర్వేరుగా విరాళాలు అందజేశారు. నగరానికి చెందిన వి.రఘురామారావు ఆయన కుటుంబసభ్యులతో కలిసి బోయపాటి వీక్ష పేరిట రూ.1,00,116, కొండపల్లికి చెందిన కేశనం శరత్ రూ.1,00,116 ఏఈవో రమేష్‌బాబును కలిసి విరాళం అందజేశారు. అలాగే కృష్ణలంక బాలాజీనగర్‌కు చెందిన పోరంకి కోటమరాజు కుటుంబసభ్యులు రూ.1.01,116 విరాళాన్ని ముఖ్య అర్చకుల ద్వారా అందించారు. దర్శనానంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

మల్లేశ్వరాలయ పనుల పరిశీలన

ఈనెల 18 నుంచి భక్తులకు అందుబాటులోకి రానున్న మల్లేశ్వరాలయంలో శనివారం దాత సంగా నరసింహరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు, వైదిక కమిటీ సభ్యుడు శంకర శాండిల్య, ఇంజనీరింగ్ అధికారులు పనులను పరిశీలించారు. ఈనెల 14 నుంచి శాస్త్రోక్త కార్యక్రమాలను నిర్వహించనున్నారు.





శివాలయం వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న పోతిన మహేశ్

టీడీపీ-జనసేన ప్రభుత్వం కావాలి

- జనసేన నేత పోతిన మహేశ్

వన్‌టౌన్ ఫిబ్రవరి 10: యువతకు ఉద్యోగాలు రావాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం కావాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను పెద్ద సంఖ్యలో గెలిపించాలని, పశ్చిమలో టీడీపీ-జనసేన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్ అన్నారు. శనివారం ఆయన ఇందాద్‌ఘర్ నుంచి శివాలయం వీధిలోని బంగారు షాపులు, ఇతర వ్యాపార వర్గాలను కలిసి ఇంటింటికీ రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వం నినాదంతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను తప్పక నిర్వహిస్తామన్నారు. ఉత్తంచంద్ బండారీ, కాటరాజు నరేష్, సింగం శెట్టి రాముగుప్త, తవ్వ మారుతి, ఇంకా పలువురు ప్రచారంలో పాల్గొన్నారు.

చందాల వెలంపల్లి.. చర్చకు సిద్ధమా?

- టీడీపీ నేత దూండీ రాకేశ్

వన్‌టౌన్,పిబ్రవరి 10: ఎవరి ప్రభుత్వ హయాంలో వ్యాపారులకు మేలు జరిగిందో చర్చించేందుకు చందాల వెల్లంపల్లి శ్రీనివాసరావు సిద్ధమా అని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేష్ సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును చందాల శ్రీనుగా అభివర్ణిస్తూ.. సీఎం జగన్ సతీమణి భారతీ రెడ్డికి రూ.65 లక్షలు విలువైన బంగారు వస్తువును చందాల శ్రీను ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యాపారవర్గాలకేం ప్రకటించలేదన్నారు. పైగా కక్షకట్టి వేధించడం దుర్మార్గమన్నారు. పరుచూరులో ఏలూరు సాంబశివరావు గ్రానైట్ గనుల్లో కారం పొడి ప్యాకెట్లతో దాడులకు వెళ్లడం దారుణమన్నారు. టీడీపీ హయాంలోనే వ్యాపారులకు మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యాపారులకు అనుకూలమైన హామీలుంటాయన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జాబ్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు

పోటీ పరీక్షల విద్యార్థులకు అవగాహన సదస్సు

కృష్ణలంక, ఫిబ్రవరి 10: ఉపాధి, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ విజయవాడ సదస్సులో గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. జాబ్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ వి.హిమబిందు, ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి ఎస్.రామ్మోహనరెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వైసత్యబ్రహ్మం పాల్గొన్నారు. అధ్యక్షోపన్యాసం చేసిన హిమబిందు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందటం ఒక మంచి అవకాశమన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎన్.రామ్మోహనరెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వైసత్య బ్రహ్మం, స్టడీ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకట నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కాపు నేతలపై వెలంపల్లి

అనుచిత వ్యాఖ్యలు మానాలి

- ఐక్య కాపునాడు అధ్యక్షుడు బేతు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 10: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఐక్య కాపునాడు అధ్యక్షుడు బేతు రామ్మోహన్‌రావు తీవ్రంగా ఖండించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వెలంపల్లి తాను ఓడిపోతాననే ఆందోళనతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నా రు. బొండా ఉమా తాట తీస్తావా, ఆయనకు సూర్యుడిని చూపిస్తావా? అంత మగాడివా అని ఘాటుగా ప్రశ్నించారు. పశ్చిమలో వెలంపల్లి అవినీతిని భరించలేక సెంట్రల్‌కు పంపించారని విమర్శించారు. గతంలో సొంత పార్టీలోని సి.రామచంద్రయ్య, సామినేని ఉదయభాను, ఆకుల శ్రీ నివాస్‌ను దుర్భాషలాడారని గుర్తు చేశారు. తన వైఖరి మార్చుకోకుంటే రానున్న రోజుల్లో వెలంపల్లికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.



బాతిక్, హ్యాండ్ వస్త్ర పోటీల్లో విజేతలు

బాతిక్, హ్యాండ్ వస్త్రధారణ పోటీలు ప్రారంభం

మొగల్రాజపురం, ఫిబ్రవరి 10: స్థానిక మొగల్ హాలులో జరుగుతున్న మహిళా ఉత్సవ్‌లో శనివారం బాతిక్, హ్యాండ్ వస్త్రధారణ పోటీలను జనశిక్షణా సంస్థాన్ చైర్ పర్సన్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 11మంది పాల్గొనగా మొదటి బహుమతి బేబి, తస్విక శ్రీ కేసవి, ద్వితీయ బహుమతి బి.రమణి గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా మహిళా పారిశ్రామిక వేత్త పి.పల్లవి వ్యవహరించారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ,సిబ్బంది, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు గురక వ్యాధిపై జాతీయ సదస్సు

కృష్ణలంక, ఫిబ్రవరి 10: నిద్ర సమయంలో చాలామందికి గురకతో వచ్చే సమస్యలు అనుభవమే. దీనికి పూర్తిస్థాయి చికిత్స అందుబాటులోకి రాలేదు. నివారణపై జరుగుతున్న పరిశోధనలు, వైద్య విధానాలు, అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు ప్రజలకు తెలిపేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఫర్ స్లీప్ ఆప్నియా (ఐఏఎస్ఎస్ఏ) ఏటా దేశంలోని వేర్వేరు ప్రాంతా ల్లో సదస్సులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జాతీయ సదస్సుకు నగరం వేదిక కానుంది. ఐఏఎస్ఎస్ సదస్సు నగరంలో జరగనుందని ప్రముఖ వైద్యుడు విద్యాసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేటలోని కోవెలమూడి వారి వీధిలోని సాగర్ ఈఎన్‌టీ ఆసుపత్రి ఆ వరణలో 11న ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్టు వివరించారు. పద్మశ్రీ డాక్టర్ మోహన్ కామేశ్వరన్, డాక్టర్ దీన్‌దయాల్ స హా వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మందికి పైగా వైద్యులు, నిపుణులు పాల్గొని వ్యాధి నివారణ పరిశోధన అంశాలను వివరిస్తారన్నారు.

నగర పంచాయతీ మేనేజర్‌పై విచారణకు ఆదేశం

ఉయ్యూరు, ఫిబ్రవరి 10: సమాచారహక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇవ్వని ఉయ్యూరు నగర పంచాయతీ మేనేజర్ వి. రఘుబాబుపై విచారణకు మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి ఎం ప్రతాపరెడ్డి మున్సిపల్‌శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సామాజిక కార్యకర్తలు జంపాన శ్రీని వాస గౌడ్, బొల్లా శివపార్వతి, సమాచారహక్కు చట్టం కార్యకర్త సోకే రాములమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గీతామందిర్ రోడ్డులో నివాసముంటున్న బి పార్వతి తన కుటుంబానికి చెందిన 2019 నవశకం సర్వేలో నమోదైన వారి కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన సమాచారం ఇప్పించవలసిందిగా నగర పంచాయతీ మేనే జర్‌కు గత అక్టోబర్‌లో సమాచారహక్కు చట్టం ప్రకారం అర్జీ అంద జేయగా ఆ సర్వే వివరాలు ఇచ్చే అవకాశం లేదని మేనేజర్ బదులి చ్చారు. దీంతో సమాచార హక్కు చట్టం ఉద్దేశపూర్వకంగా అమలు చేయని మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శికి శివపార్వతి చేసిన ఫిర్యాదు మేర విచారణకు ఆదేశిస్తూ తగు చర్యలు తీసుకోవాలసిందిగా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.

కెనరా బ్యాంక్ మెగా రిటైల్ ఎక్స్‌పోలో

రూ.50 కోట్ల మేరకు రుణాల మంజూరు

వన్‌టౌన్, ఫిబ్రవరి 10: నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల గ్రౌండ్‌లో కెనరాబ్యాంక్ ప్రధాన కార్యాలయం ఇచ్చిన కార్పొరేట్ రెస్పాన్స్ మేరకు శనివారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పోలో రూ.50 కోట్ల మేరకు 104 మందికి రుణమంజూరు పత్రాలు జారీ చేశారు. విజయవాడ క్షేత్రీయ అధికారి జనరల్ మేనేజర్ పి.రవి వర్మ ఎక్స్‌పోను ప్రారంభించి పర్యవేక్షించారు. స్థానిక బ్యాంక్ శాఖల అధిపతులు, ఖాతాదారులు మొత్తం 200 మందికి పైగా పాల్గొన్నారు. నగరంలోని 20మంది ప్రముఖ బిల్డర్లు, డవలపర్లు 8 మంది వాహన డీలర్లు పాల్గొన్నారు. వేలం కింద ఉన్న ఆస్తులు, కెనరా డిజిటల్ ఉత్పత్తులు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను ప్రదర్శించారు.

నారాయణ ఏమైనా స్మగ్లరా..?

▸▸ ఆయన టీడీపీ నేత కావడమే తప్పా..!: ఎంఏ షరీఫ్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'అంతమంది సిబ్బందితో దాడులు చేయడానికి నారాయణ ఏమైనా స్మగ్లరా? ఆయన టీడీపీ నాయకుడిగా ఉండటం తప్పా..!' అని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ప్రశ్నించారు. శనివారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మాజీ మంత్రి నారాయణ ఇంట్లో సోదాలు అన్యాయం. వ్యక్తిగత కక్షకు ఇది పరాకాష్ట. ప్రతిపక్ష నేతలను భయాందోళనలకు గురి చేసేందుకు వ్యవస్థల్ని ఉపయోగించుకుంటున్నారు. అధికారం కోల్పోబోతున్నా జగన్‌కు ఇంకా బుద్ధి రావడం లేదు. భవిష్యత్తులో ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు' అని షరీఫ్ హెచ్చరించారు.

టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారు: వర్ల

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, ఈపూరు మండలంలోని ప్రతి గ్రామంలో వైసీపీకి చెందిన వారు తప్పుడు ఫామ్-7 పత్రాలు సమర్పించి దాదాపు 246 టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. ఓట్లు తొలగించిన వారికి ఆధార్, రేషన్ కార్డులు లేవని తప్పుడు సమాచారమిచ్చారు. వైసీపీ నాయకులు బీఎల్ఓలపై ఒత్తిడి చేసి ఓట్లు తొలగించేస్తున్నారు. ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఉరవకొండ, రాయదుర్గంలోని డీహీరేహల్, కల్యాణదుర్గంలోని సెత్తూరు, కుందుర్పి, కుప్పం, విజయవాడ సిటీలోని వివిధ పోలింగ్ బూత్‌లలో జరిగిన ఓట్ల అవకతవకలపై వర్ల ఫిర్యాదు చేశారు.

వ్యాపారులను దోచేస్తున్న జగన్: డుండీ రాకేశ్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'వ్యాపారస్తులను జగన్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది. ఎవరి హయాంలో వ్యాపారులకు మేలు జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా?' అంటూ టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేశ్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. శనివారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చందాల శ్రీనుగా పిలిచే వెలంపల్లి శ్రీను, సీఎం సతీమణి భారతీరెడ్డికి రూ.65 లక్షల విలువైన బంగారపు వస్తువు ఎందుకిచ్చారు? విజయవాడలో వ్యాపారస్తుల దగ్గర చందాలు వసూలుచేసి దాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు పంపిస్తున్నారు. వెలంపల్లి శ్రీనును నియోజకవర్గం ఎందుకు మార్చాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలి. వ్యాపారస్తులకు వైసీపీ పాలనలో ఒనగూరిందేమీ లేదు. వ్యాపారులను వేధిస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పేందుకు వ్యాపారులంతా సిద్ధంగా ఉన్నారు' అని రాకేశ్ అన్నారు.

ఐదేళ్ల పాలనంతా మోసం, ద్రోహమే: టీడీపీ ఎమ్మెల్సీలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలన వెనక్కి చూస్తే యువతకు జగన్ చేసిన మోసం, ద్రోహం మాత్రమే కనిపిస్తున్నాయని టీడీపీ ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. శనివారం ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సీఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. 'నాడు ప్రతిపక్ష నేతగా మాట తప్పం, మడం తిప్పం అనే నినాదంతో నిరుద్యోగులకు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కి, నిరుద్యోగులను వంచించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీపీఎస్సీ ద్వారా 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జాబ్ కేలండర్, మెగా డీఎస్సీ అని జగన్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. నాలుగున్నరేళ్లు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ఎన్నికలకు 60 రోజుల ముందు కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని దగా చేయడమే. దీర్ఘకాలంగా నోటిఫికేషన్ లేకపోవడంతో వయోపరిమితి మించిపోయి నోటిఫికేషన్‌కు అర్హత కోల్పోతున్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగార్థులకు వయోపరిమితిని 42 ఏళ్ల నుంచి 47 ఏళ్లకు పెంచాలి' అని ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు.

హిందూ మత ప్రతిష్ఠను దిగజార్చిన జగన్: రాంప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో హిందూ మత ప్రతిష్ఠను దిగజార్చారని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక వైపు దేవాలయాలు ధ్వంసం చేస్తూ మరో వైపు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. శ్రీశైలం ప్రసాదంలో ఎముక పడిన ఘటన జరిగి 24 గంటలు గడుస్తున్నా ఇంత వరకు చర్యలు లేవన్నారు. 'గతంలో టీటీడీలో ఎన్నో అపరాధాలు జరిగాయి. ఇప్పుడు శ్రీశైలం ప్రసాదంలో ఎముకలు పడటం లాంటి ఎన్నో ఘటనలు జరుగుతున్నా దేవదాయశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదు? దేవాలయాల నిర్వహణకు, అర్చకుల వేతనాలకు నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గం' అని రాంప్రసాద్ అన్నారు.

ఏపీ ఈపీడీసీఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు రెండు జాతీయ అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఇప్పయ్) శనివారం కర్ణాటకలోని బెలగాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) చంద్రం ఈ అవార్డులు అందుకున్నారు. విద్యుత్ పంపిణీ నష్టాలను తగ్గించేందుకు అధునాతన టెక్నాలజీని (ఏఐ, మెషిన్ లెర్నింగ్) ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై 'ఇప్పయ్' బెలగాంలో నాలుగు రోజుల సదస్సు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన సంస్థలకు అవార్డులు అందించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నందుకు ఒక అవార్డు, వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న చర్యలకు గాను మరో అవార్డు ఈపీడీసీఎల్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ ఓటమి ఖాయం: భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఏపీలో అధికార వైసీపీ ఓటమి ఖాయమని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఓటమిని ఊహించి జగన్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఉత్తమకుమారుడిలా ఆయన మాటలు ఉన్నాయన్నారు. ఏపీలో వైసీపీ మరోసారి దొంగ ఓట్లతో గెలవాలని ప్రయత్నం చేస్తుందన్నారు. శనివారం, ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏపీలో చనిపోయినవారి పేర్లను అధికార పార్టీ ఓటర్ల లిస్టులో కలిపివేసింది. రాష్ట్రంలో అధికార పార్టీ ఆశీర్వాదంతో దెయ్యాలకు కూడా ఓట్లు ఉన్నాయి. దొంగ ఓట్ల తాలుకా మెయిన్ గ్రిడ్ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉంది. ముందు దాన్ని కట్ చేయాలి. నకిలీ ఓటర్ల తయారీలో అధికార పార్టీ నాయకుల పాత్ర 90 శాతం ఉంటే, అధికారుల ప్రమేయం 10 శాతం ఉంది. పొత్తులపై అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. జనసేనకు, మాకు మధ్య గొడవలు పెట్టాలని వైసీపీ ప్రయత్నం చేస్తోంది. అది సాధ్యం కాదు. పీవీకి కేంద్రం ప్రకటించిన భారతరత్న పట్ల జగన్ స్పందించి ఉంటే బాగుండేది' అని భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు.

కార్పొరేటర్‌కు నలుగురు సెక్యూరిటీ..!

▸▸ గాజువాక వైసీపీ సమన్వయకర్తకు 2+2 భద్రత

▸▸ ఇష్టానుసారంగా వైసీపీ అధికార దుర్వినియోగం

▸▸ మేయర్‌కు లేని సెక్యూరిటీ... కార్పొరేటర్‌కి ఎందుకనే విమర్శలు



సెక్యూరిటీ నడుమ గాజువాక వైసీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అధికార దుర్వినియోగం అధికమైంది. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరికుమారికి ఎటువంటి భద్రత ఏర్పాట్లు లేవు. కానీ ఓ వార్డు (70) కార్పొరేటర్‌గా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు (చందూ)కు మాత్రం ప్రభుత్వం తాజాగా నలుగురు (2+2) గన్‌మెన్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆదేశాలు రాగానే అవి అమలులోకి కూడా వచ్చేశాయి. వాస్తవానికి చందూకు ఎలాంటి బెదిరింపులు లేవు. శత్రువులు లేరు. రక్షణ కావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరలేదు. కానీ గాజువాక నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కావడంతో ఆయనకు భద్రత కేటాయించారు. వచ్చే ఎన్నికల్లో గాజువాక నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన బరిలో దిగుతారని, అందుకే రక్షణ కల్పించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ విచిత్రం ఏమిటంటే.. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి 1+1 సెక్యూరిటీ మాత్రమే ఉంది. గతంలో మంత్రిగా చేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కూడా 1+1 సెక్యూరిటీయే ఉంది. కాగా, గాజువాక వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన చందూయే ఎమ్మెల్యే అభ్యర్థి అని ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. అందుకు తగ్గట్టే ప్రభుత్వం ఆయనకు సెక్యూరిటీ కూడా ఇచ్చింది.



విశాఖకు మహర్దశ!

ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసిన నీతీ ఆయోగ్

ముంబై, సూరత్, వారాణసీ నగరాలకు కూడా..

2047 నాటికి 'భారత్ అభివృద్ధి చెందిన దేశం' లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భారతదేశాన్ని 2047 సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో నీతీ ఆయోగ్ విశాఖపట్నం, ముంబై, సూరత్, వారాణసీ నగరాలకు ఆర్థిక ప్రణాళికను రూపొందించింది. అలాగే, మరో 20-25 నగరాలకూ ఆర్థిక ప్రణాళికను రూపొందించాలని నీతీ ఆయోగ్ భావిస్తోంది. నీతీ ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం శనివారం ఇక్కడి ఓ కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు దోహదపడేలా ఆ నాలుగు నగరాల ఆర్థిక పరివర్తన కోసం నీతీ ఆయోగ్ ఒక ప్రణాళికను రూపొందించిందని చెప్పారు. ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న మరో 20-25 నగరాలకు కూడా ఆర్థిక ప్రణాళికను రూపొందించాలనుకొంటున్నామని తెలిపారు. అలాగే, 2047 నాటికి భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే విజన్ డాక్యుమెంట్‌నూ నీతీ ఆయోగ్ రూపొందిస్తోందని, ఆ విజన్ డాక్యుమెంట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేస్తారని చెప్పారు. 'మేం నగరాల అర్బన్ ప్రణాళికలను మాత్రమే సిద్ధం చేసేవాళ్లం, ఆర్థిక ప్రణాళికలను కాదు. విశాఖ, ముంబై, సూరత్, వారాణసీ నగరాల ఆర్థిక పరివర్తన కోసం ఆ నగరాల ఆర్థిక ప్రణాళికనూ రూపొందించాం. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 11న యువత నుంచి అభిప్రాయాలు కోరింది. ఇప్పటి వరకు యువత నుంచి 10 లక్షలకుపైగా వివరణాత్మక సూచనలు మాకు వచ్చాయి. కృత్రిమ మేధను ఉపయోగించి వాటన్నింటినీ ప్రాసెసింగ్ చేస్తున్నాం' అని బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

జగనన్న కాలనీల్లో 'హౌసింగ్' దొంగలు!

సామగ్రి కొనుగోలులో భారీ గోల్‌మాల్.. అధికారులకు రూ.వందల కోట్ల కమీషన్!

▸▸ టెండర్లలో నిబంధనలకు పాతర

▸▸ ముందే ఆయా కంపెనీలతో ఒప్పందం

▸▸ తెరవెనుక ముఖ్యనేత కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి హస్తం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల్లో దొంగలు పడ్డారు! అవును.. ఇంకా లక్షలాది ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోయినా, పేదలు గృహప్రవేశాలు చేయకపోయినా 'ఇంటి' దొంగలు దోచుకుంటున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌లోని కొందరు ఉన్నతాధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి పేదలకు అన్యాయం చేస్తున్నారు. దాదాపు 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలకు సామాగ్రి (అదర్ మెటీరియల్) కొనుగోలులో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ఒక్కో ఇంటికి రూ.1,12,117 చొప్పున మొత్తం రూ.22 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రి కొనుగోలు చేశారు. టెండర్ల ఎంపికకు ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని వందల కోట్లు జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాల వారీగా గోడౌన్లకు తరలించిన సామగ్రిని కొనేవారు లేక తుప్పు పట్టిపోతోంది. చాలా చోట్ల కిందిస్థాయిలోనూ సిబ్బంది చేతివాటంతో గోడౌన్లలోనూ స్టాక్ మాయమవుతోంది. స్టాక్‌కు సంబంధించి లెక్కలు, రికార్డులు సరిగా లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రకటించిన జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో హౌసింగ్ ఉన్నతాధికారుల నుంచి జిల్లాల్లో పని చేస్తున్న కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వరకు ఎవరికి దొరికింది వారు దోచుకుపోతున్నారు. నిర్మాణ సామగ్రి కొనుగోలు, సరఫరాలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ అంతర్గత విచారణ చేపట్టడంతో అక్రమాల డొంక కదులుతోంది. ఇక అధికారులు, సిబ్బంది కంటే ముందే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. జగనన్న కాలనీల స్థలాల కొనుగోలు, చదును పేరిట కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఇలా పేదల ఇళ్ల పేరుతో నేతలు, అధికారులు దోచుకోగా.. లక్షలాది మంది లబ్ధిదారులకు ఇంకా సొంతింటి కల నెరవేరనే లేదు.

20 వేల కోట్ల నిర్మాణ సామగ్రి డంపింగ్

పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలు, డోర్, విండో ఫ్రేమ్‌లు, శానిటరీ, ఎలక్ట్రికల్ పరికరాలు, రంగులు, వాటర్ ట్యాంకులు తదితర నిర్మాణ సామగ్రిని లబ్ధిదారుల సమ్మతితో మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇదే అవకాశంగా హౌసింగ్ ఉన్నతాధికారులు వివిధ కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకున్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెనకా ముందూ ఆలోచించకుండా ఆయా కంపెనీల నుంచి ఒక్కొక్క ఇంటికి రూ.లక్షకు పైగా విలువ చేసే నిర్మాణ సామగ్రిని ఒకే సారి కొనుగోలు చేశారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలకు దాదాపు రూ.22 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రి కొనుగోలు చేశారు. అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో ఉన్న గోడౌన్లలో డంప్ చేశారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద కుంభకోణం ఉందని, ఆయా కంపెనీల నుంచి కమీషన్ల రూపంలో వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు హౌసింగ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కొన్ని జిల్లాల్లో హౌసింగ్ ఏఈలు, డీఈఈలు వద్దంటున్నా కమీషన్ల కోసం కొనుగోలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ జిల్లా హెడ్స్ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి రిక్వెస్ట్ లెటర్స్ తీసుకుని మరీ ఇంత భారీస్థాయిలో నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారం వెనుక ప్రభుత్వ ముఖ్యనేత కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న అక్రమ వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉన్న సదరు అధికారి ఇచ్చిన భరోసాతోనే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లు దండుకున్నట్లు సమాచారం.

నిబంధనలు బేఖాతర్

నిర్మాణ సామగ్రిని రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా లేదా లబ్ధిదారులు ఆమోదం తెలిపిన ఏజెన్సీల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. ఇళ్ల నిర్మాణ ప్రారంభ దశలో అంటే.. 2021 జనవరిలో స్టీల్‌తో సహా 13 రకాల సామగ్రి కొనుగోలుకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు టెండర్లు ఆహ్వానించారు. కానీ కాంట్రాక్టు సంస్థల నుంచి సరైన స్పందన రాలేదు. దీనిని సాకుగా చూపించి నిబంధనలను సవరించి మళ్లీ టెండర్లు పిలిచారు. వివిధ రాష్ట్రాల నుంచి 10 సంస్థలు ముందుకు వచ్చాయి. ఆయా సంస్థల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు పిలవడానికి ముందే ఆయా సంస్థలతో అధికారులు కమీషన్లు మాట్లాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సంస్థల నుంచి స్టీల్ సహా 13 రకాల నిర్మాణ సామాగ్రిని రాష్ట్రస్థాయిలో కొనుగోలు చేసి, లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాల వారీగా హౌసింగ్ గోడౌన్లకు తరలించారు. ఇక కంకర, ఇటుకలు తదితర మెటీరియల్‌తో పాటు ఇసుక రవాణాకు జిల్లా స్థాయిలో టెండరు విధానంలోనే కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని ఆదేశించారు. అయితే ఈ టెండర్లకు కూడా కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. మొత్తం 9 రకాల నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయడానికి స్థానిక సరఫరాదారులతో సంప్రదింపులు జరిపి ఉభయులకు అంగీకారమైన ధరలను నిర్ణయించాలని జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇలా రాష్ట్రస్థాయిలో పాటు జిల్లాస్థాయిలో కూడా నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించకుండా అధికారులకు కమీషన్లు ఇచ్చేవారికి, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు వారి అనుయాయులకు కాంట్రాక్టులు కట్టాబెట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆ మెటీరియల్ మాకొద్దు బాబోయ్

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తున్న నిర్మాణ సామగ్రిని తీసుకోవడానికి ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఆ సామగ్రి నాసిరకంగా ఉండటం ఒక కారణమైతే.. మార్కెట్ రేట్ల కంటే అధికంగా ఉండటం మరో కారణం. మార్కెట్ ధరల కంటే తక్కువకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించగా.. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు దీనికి భిన్నంగా అధిక ధరలకు సామగ్రిని లబ్ధిదారులకు అంటగడుతున్నారు. నిర్మాణ సామాగ్రిని ఒక్కో ఇంటికి మొత్తం రూ.1,12,117కు లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నారు. దీంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు.

గోడౌన్లలో సామగ్రికి తుప్పు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పినా.. గడచిన మూడున్నరేళ్లలో చచ్చీ చెడి 5 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించగలిగారు. ఇంకా 17 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఆప్షన్-3 ఎంపిక చేసుకున్నారు. నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. మూడేళ్లుగా ఆ మూడున్నర లక్షల ఇళ్లు కనీసం పునాదులు కూడా దాటలేదు. నిర్మాణ సామగ్రిని తీసుకునేందుకు లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు నిరాకరిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా జిల్లాల్లోని గోడౌన్లలోనే ఉండిపోయింది. దీంతో ఉన్నతాధికారుల్లో ఆందోళన మొదలైంది. త్వరలో ఎన్నికలు జరగనుండటంతో రాష్ట్రంలో ప్రభుత్వం మారితే... గోడౌన్లలో నిరుపయోగంగా, తుప్పు పట్టి ఉన్న మెటీరియల్ కొనుగోలుపై విచారణకు ఆదేశించే అవకాశముందని భయపడుతున్నారు. దీంతో ఎన్నికల లోపే ఏదోవిధంగా లబ్ధిదారులకు అంటగట్టాలని ఉన్నతాధికారులు.. అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా అంతర్గత విచారణ చేపట్టినప్పుడు విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఏ గోడౌన్‌కు ఎంత మెటీరియల్ తరలించారు? ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఎంత సరఫరా చేశారు? ఇంకా ఎంత స్టాక్ ఉంది? వంటి వివరాలపై కచ్చితమైన లెక్కలు లేవు. గోడౌన్లలో స్టాక్‌కు సంబంధించిన రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. రూ.కోట్ల విలువైన నిర్మాణ సామగ్రి పక్కదారి పట్టినట్లు గుర్తించారు.

కిందిస్థాయి అధికారులకు నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ గోడౌన్‌లలో ఉన్న నిర్మాణ సామగ్రి నిల్వలకు, ఆన్‌లైన్ రికార్డులలో చూపిస్తున్న దానికి చాలా వ్యత్యాసం ఉండటంతో అవకతవకలు జరిగాయని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. జిల్లాల్లో పనిచేస్తున్న హౌసింగ్ ఏఈలు, డీఈఈలు, డీహెచ్‌లను బాధ్యులను చేస్తూ వారిపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. గోడౌన్లకు తరలించిన సామాగ్రిని సకాలంలో లబ్ధిదారులకు సరఫరా చేయడంలో అధికారుల నిర్లక్ష్యం చూపారని, స్టాక్‌కు సంబంధించి దాదాపు సగానికిపైగా మెటీరియల్‌కు లెక్కలు సరిగా లేవని, రికార్డులను కూడా సరిగా నిర్వహించడం లేదని తమ విచారణలో తేలిందంటూ గృహ నిర్మాణ సంస్థ ఎండీ ఇటీవల జిల్లా అధికారులకు జారీ చేసిన సర్క్యులర్‌లో వెల్లడించారు. వైఫల్యాలకు మండల స్థాయిలో ఏఈలు, డివిజన్ స్థాయిలో డీఈఈలు, జిల్లా స్థాయిలో హౌసింగ్ హెడ్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గోడౌన్లలోని మెటీరియల్ పక్కదారి పట్టినట్టు తేలితే బాధ్యులైన అధికారుల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. అయితే అవసరం లేకపోయినా కమీషన్లు, పర్సంటేజీల కోసం భారీస్థాయిలో నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసి గోడౌన్లకు తరలించిన ఉన్నతాధికారులు.. ఇప్పుడు తప్పును తమపైకి నెట్టేసి తప్పించుకోవాలని చూస్తున్నారని జిల్లాల్లోని హౌసింగ్ అధికారులు వాపోతున్నారు. దీనిపై సర్కారు దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

ఉద్యోగి కాకున్నా.. బదిలీ ఉత్తర్వులు


▸▸ గిరిజన గురుకులాల్లో దొడ్డిదారిన నియామకాలు

▸▸ పరుపుల టెండర్లలోనూ భారీగా అక్రమాలు

▸▸ రూ.40.29 కోట్ల దారిమళ్లింపుపై సీఐడీ విచారణ



పవన్‌కల్యాణ్‌ను డిప్యుటేషన్ వేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులు



పవన్ కల్యాణ్‌కు 20.7.23న మొదటి జీతం పడినట్లు ఏపీసీఎఫ్‌ఎస్‌లో ఉన్న సమాచారం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 10: గిరిజన గురుకుల సంక్షేమ విద్యా సంస్థలో అవినీతికి అంతే లేకుండా పోతోంది. పాఠశాలల్లో ఉద్యోగాల పేరుతో కొందరు ఉన్నతాధికారులు భారీ అక్రమాలకు తెరతీశారు. సంస్థలో ఉద్యోగి కాకున్నా, ఉద్యోగిగా చూపిస్తూ బదిలీ పేరుతో నియామకం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఎం.పవన్‌కల్యాణ్ అనే వ్యక్తి గుంటూరు జిల్లాలో ఔట్ సోర్సింగ్ విధానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు చూపించి, అతడిని గత ఏడాది జూన్ 30న పార్వతీపురం మన్యం జిల్లాకు డెప్యూటేషన్ వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి పవన్‌కల్యాణ్ సంస్థలో ఉద్యోగి కాదు. డిప్యూటేషన్ పేరుతో దొడ్డిదారిన ఉద్యోగం ఇచ్చిన తర్వాత ఏపీసీఎఫ్‌ఎస్‌లో ఐడీ.222015520ను సృష్టించి, జూలై 20వ తేదీన మొదటి జీతం వేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. శ్రీవిద్య అనే మహిళా జూనియర్ అసిస్టెంట్ గుంటూరు జిల్లాలో పనిచేస్తున్నట్లుగా చూపించి, కడప జిల్లా రాయచోటికి బదిలీ చేస్తూ గత ఏడాది జూన్ 26న ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె కూడా డిప్యుటేషన్ ఉత్తర్వుల తర్వాత ఏపీసీఎఫ్‌ఎస్‌లో ఐడీ: 209332783 సృష్టించారు. ఆతర్వాత మొదటి నెల జీతం జమ అయినట్లు రికార్డుల్లో ఉంది. తాజాగా బి.కిశోర్, బి.రవిప్రసాద్‌ను కూడా అదే రీతిలో డిప్యుటేషన్ వేశారు. వారికి ఇంకా ఏపీసీఎఫ్‌ఎస్‌లో ఐడీలు రాలేదు. మరోవైపు గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం కేంద్రం విడుదల చేసిన రూ.40.29 కోట్లను దారిమళ్లించిన వ్యవహారంపై సీఐడీ విచారణ జరుపుతోంది. ఒక మంత్రి ఓఎస్డీని అడ్డంపెట్టుకుని సంస్థలో ఇద్దరు అధికారులు చెలరేగిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరి ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 18 గిరిజన గురుకుల పాఠశాలల్లో భారీస్థాయిలో అవినీతి జరిగిందని సమాచారం. ఒక్కొక్కరి వద్ద 2 నుంచి 5 లక్షల వరకు తీసుకుని ఉద్యోగాల్లో నియమించారు. బోధన సిబ్బంది నియామకాల్లో కూడా ఆర్‌వోఆర్‌ను తుంగలో తొక్కి, ముడుపులు ముట్టజెప్పిన వారికి పెద్దపీట వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సంస్థ పరిధిలోని రాష్ట్రవ్యాప్త పాఠశాలల్లో నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల్లో చేరిన వారి సంఖ్య సుమారు 50 వరకు ఉంటుంది. ఈ నియామకాల తంతు 2023 నుంచి ఆరంభమైంది. డిప్యూటీ సెక్రటరి స్థాయి అధికారిని అందలం ఎక్కించడం కోసం ఓ మహిళా ఉన్నతాధికారిని మంత్రి ఓఎస్‌డీ పక్కన పెట్టించారు. ఆ అధికారి అందలం ఎక్కాక దొడ్డిదారి నియామకాలకు తలుపులు తెరుచుకున్నాయి.. ప్రస్తుతం మొత్తం కార్యాలయ వ్యవహారాలు మంత్రి ఓఎస్డీ కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిధుల దారి మళ్లింపుపై విచారణ

గిరిజన గురుకుల సంక్షేమ విద్యా సంస్థ ఉద్యోగాల నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉన్నత అధికారులపై గతంలో కూడా సీఐడీ విచారణ చేసింది. కేంద్రం నుంచి గురుకులాలకు వచ్చిన రూ.40.29 కోట్లు పక్కదారి పట్టించారని కోసు లచ్చన్నదొర అనే గిరిజన నేత సీఐడీకి ఫిర్యాదు చేశారు. సీఐడీకి ఫిర్యాదు వెళ్లిన తర్వాత 2023 మార్చి 17న సంస్థ కార్యదర్శి కాంతీలాల్‌దండే శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపరింటెండెంట్ స్థాయి అధికారి 2023లో గిరిజన గురుకుల విద్యాసంస్థలో ఉన్నత స్థాయి హోదాలో ఉండి అక్రమాలకు తెరలేపారని గిరిజన సంక్షేమ సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పీఆర్సీ కోసం కూడా భారీగా వసూళ్లు చేశారని ఆరోపిస్తున్నారు. 2023 నవంబరులో ఉద్యోగ విరమణ చేసిన ఈ అధికారి చివరి రోజుల్లో కోట్ల రూపాయలు బిల్లులకు మోక్షం కల్పించారు. గురుకుల పాఠశాలలకు సరఫరా చేసిన రూ.11.40 కోట్ల పరుపుల కాంట్రాక్టులో కూడా భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై లోతైన విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రసంగిస్తుండగానే మహిళలు వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మేం ఉండలేం సారో..

▸▸ ఆసరా సభ నుంచి వెనుదిరిగిన మహిళలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10: ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంగణంలో శనివారం ఆసరా నాలుగో విడత సభ నిర్వహించారు. ఈ సభకు ఏలూరు కార్పొరేషన్‌లోని డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకొచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎండలో మహిళలు పడిగాపులు కాశారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైంది. అప్పటికే నీరసించిన మహిళలు.. ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రసంగిస్తుండగానే బయటకు దారి తీశారు. ఒక్కసారిగా మహిళలు బయటకు వెళ్లిపోతుండటంతో మెప్మా సిబ్బంది, ఆర్పీలు, వైసీపీ నాయకులు కంగారు పడి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు వారిని తోసుకుంటూ బయటకు వచ్చేశారు. గేటు వద్ద పోలీసులు నిలువరించినా ఫలితం లేకపోయింది.



తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న నెల్లూరు జిల్లా క్రీడాకారులు

ఆడుదాం... అడ్డగోలుగా

▸▸ మహిళా క్రికెట్ విజేతగా తిరుపతి ముందే ఫిక్స్

▸▸ తదనుగుణంగా అధికారుల నిర్ణయాలు

▸▸ ఫైనల్స్‌లో రంగంలోకి ప్రొఫెషనల్ క్రికెటర్లు

▸▸ పోటీకి వచ్చిన నెల్లూరు టీమ్‌కు బెదిరింపులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం.. ఆంధ్రా' అంటూ రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న పోటీల ఫైనల్స్ విశాఖపట్నంలో అడ్డగోలుగా జరుగుతున్నాయి. ఎవరికి బహుమతి ఇవ్వాలో ముందుగానే నిర్ణయించుకొని వారికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. దాంతో సుదూర ప్రాంతాల నుంచి పోటీకి వచ్చినవారు ఉసూరుమంటున్నారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లాకి ఎంపికై ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల కోసం విశాఖపట్నం వచ్చిన నెల్లూరు జిల్లా (వెంకటాచలం మండలం కసుమూరు గ్రామం) మహిళా క్రికెట్ టీమ్ అధికారులు ఆడిన తొండాటకు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తిరుపతి జిల్లా ఎంఆర్ పల్లి-2 టీమ్ మాత్రం అధికారుల అండతో విజేతగా నిలిచింది. ఇది అన్యాయమంటూ కసుమూరు బృందం ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగినదంతా వివరించి వాపోయింది.

ఆధార్ కార్డులు అడిగినా ఇవ్వలేదు

కొమ్మాదిలోని కేవీకే స్టేడియంలో శుక్రవారం సాయంత్రం కసుమూరు, ఎంఆర్ పల్లి-2 మహిళా జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోటీ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఫైనల్ పోటీ అని కసుమూరు ఆటగాళ్ల ఆధార్‌కార్డులు తీసుకొని అందరికీ ఇచ్చారు. ఎంఆర్ పల్లి-2 ఆధార్ కార్డులు మాత్రం అడిగినా ఇవ్వలేదు. సాయంత్రం 5.45 గంటల సమయంలో వర్షం పడుతుండగా చీకట్లోనే మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించి.. అందులోనూ తిరుపతి టీమ్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆ జట్టుని గెలిచేలా చేశారు. మ్యాచ్‌కు ముందే వారి ఆధార్ కార్డులు చూపించాలని, లేకపోతే తాము ఆడబోమని పట్టుబట్టగా.. డిస్‌క్వాలిఫై చేస్తామని బెదిరించారని కసుమూరు టీమ్ కెప్టెన్ హర్షిత వెల్లడించింది. ఆ తర్వాత వివరాలు పరిశీలించగా, ఎంఆర్ పల్లి-2 నుంచి వచ్చిన 16 మందిలో ముగ్గురు మాత్రమే ఆ సచివాలయ పరిధిలోని వారు కాగా మిగిలిన వారు ప్రకాశం, పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రొఫెషనల్ క్రికెటర్లని తేలిందని ఆరోపించారు. వాస్తవానికి ఎంఆర్ పల్లి-2 పరిధిలో కాలేజీలు లేవని, కానీ అక్కడి కాలేజీలో చదువుతున్నామని చెప్పి వీరంతా హాజరయ్యారని వివరించారు. ఎంపీడీవో లాగిన్ నుంచి, సచివాలయ పంచాయతీ సెక్రటరీ లాగిన్ నుంచి వీరిని ప్లేయర్లుగా ఎంటర్ చేశారన్నారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.


ఆడుదాం-ఆంధ్రా నిర్వహణ లోపభూయిష్టం

▸▸ ఏపీ కబడ్డీ సంఘం సెక్రటరీ పద్మజాబాల



విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో 'ఆడుదాం-ఆంధ్రా' నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, రాష్ట్ర స్థాయి కబడ్డీ ఫైనల్స్‌ను మట్టికోర్టులో నిర్వహించడం ఏమిటని ఏపీ కబడ్డీ సంఘం (115/2010) సెక్రటరీ పద్మజాబాల ప్రశ్నించారు. ఐజీఎంసీలోని కబడ్డీ కోర్టులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలోనే మ్యాట్‌లపై నిర్వహించిన అధికారులు, విశాఖలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫైనల్స్‌లో సరైన సౌకర్యాలు లేకుండా మట్టి కోర్టులో నిర్వహించడం దారుణమని మండిపడ్డారు. శాప్‌లో డీడీ స్థాయి అధికారిణి, విధుల నుంచి సస్పెండై మళ్లీ వచ్చిన ఓ అధికారి అవినీతి వల్లే పోటీల నిర్వహణ లోపభూయిష్టంగా మారిందని విమర్శించారు. ఈ ఇద్దరి పనితీరుపై, క్రీడా సామగ్రి కొనుగోలు, జిల్లాల్లో పోటీల నిర్వహణలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని పద్మజాబాల డిమాండ్ చేశారు.

మరోసారి హిట్ కాంబినేషన్



'ఖుషీ' చిత్రంతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం ఆయన 'ఫ్యామిలీస్టార్' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. దీని తర్వాత చేయబోయే సినిమాలపై దృష్టి సారించిన విజయ్ కొత్త కథల అన్వేషణలో ఉన్నారు. తాజాగా ఆయన ఓ ప్రాజెక్ట్‌కు పచ్చజెండా ఊపారని టాలీవుడ్ టాక్. గతంలో విజయ్‌తో 'టాక్సీవాలా' చిత్రం రూపొందించిన రాహుల్ సాంకృత్యాన్ కొత్త చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. రాహుల్ సిద్ధం చేసిన స్ర్కిప్ట్ నచ్చడంతో విజయ్ ఓకే చెప్పారట. టాలీవుడ్‌కు చెందిన పెద్ద నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుందని సమాచారం. 'టాక్సీవాలా' హిట్ అవ్వడంతో ఇప్పుడు అదే కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం కూడా అంతకు మించి విజయాన్ని అందుకుంటుందని విజయ్ అభిమానులు భావిస్తున్నారు. 'ఫ్యామిలీ స్టార్' చిత్రం తర్వాత గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చిత్రం మొదలవనుంది.

అరుంధతి తరహా కథతో అనుష్క?





మరోసారి 'అరుంధతి' లాంటి శక్తిమంతమైన పాత్రలో అనుష్క కనిపించడం ఖాయం అంటున్నాయి టాలీవుడ్ ఇండస్ట్రీ వర్గాలు. ఎలాంటి ప్రచారం చేయకుండానే ఆమె ఓ సినిమాను ఓకే చేసి, సెట్స్ పైకి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో అనుష్క ఇప్పటిదాకా చేయని సరికొత్త పాత్రను పోషిస్తున్నారట. త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. క్రిష్ జాగర్లమూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారనీ, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోందని వార్తలు వస్తున్నా ఇప్పటిదాకా అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. కొన్నాళ్ల విరామం తర్వాత అనుష్క 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ఎంట్రీ ఇచ్చి సూపర్‌హిట్ అందుకున్నారు. ఆమె ప్రస్తుతం ఓ మలయాళ చిత్రం చేస్తున్నారు.

ఆ ఫిర్యాదు చేసింది వాయుసేన అధికారి కాదు


సిద్ధార్థ్ ఆనంద్

హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన 'ఫైటర్' చిత్రం ఇటీవలే విడుదలై బాక్సాఫీసు దగ్గర యావరేజీగా నిలిచింది. ఈ చిత్రంలో హీరో హీరోయిన్ల ముద్దు సన్నివేశం వివాదాస్పదమైంది. దీనిపై చిత్ర దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ శనివారం స్పందించారు. 'ఫైటర్' సెన్సార్ పూర్తయ్యాక వాయుసేన అధికారులకు చూపించామని తెలిపారు. సినిమా చూసినవారిలో ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌తో పాటు మరో వందమంది అధికారులు ఉన్నారు, వారందరి నుంచి నిరభ్యంతర పత్రం తీసుకున్నామన్నారు. అయితే ముద్దు సన్నివేశంపై ఫిర్యాదు చేసిన వ్యక్తి పేరుతో భారత వైమానిక దళంలో ఏ అధికారీ లేరని మా దృష్టికి వచ్చింది, ఇలా చేసినవాళ్లెవరో మాకు తెలియడం లేదు అని సిద్ధార్థ్ అసహనం వ్యక్తం చేశారు. హృతిక్, దీపిక ఈ చిత్రంలో భారత వైమానిక దళ పైలెట్లుగా నటించారు. ఓ సన్నివేశంలో వారిద్దరి మధ్య వచ్చిన ముద్దు సన్నివేశంపై అస్సాంకు చెందిన వాయుసేన అధికారి సౌమ్యా దీప్‌దాస్ చిత్రబృందానికి లీగల్ నోటీసులు పంపారనే విషయం చర్చనీయాంశంగా మారింది. యూనిఫాంలో ఉండగా ముద్దు సన్నివేశాలు చిత్రీకరించడం అంటే సైన్యాన్ని అవమానించడమేనని అందులో అభ్యంతరం వ్యక్తం చేశారని న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వార్తలొచ్చాయి.


బయోపిక్ కథ బాలీవుడ్‌కు కలిసొచ్చేనా?

కమర్షియల్ చిత్రాలతో పాటు ప్రయోగాత్మక చిత్రాలకు బాలీవుడ్ పెట్టింది పేరు. భారీ బడ్జెట్ చిత్రాలతో బాక్సాఫీసు దగ్గర వసూళ్ల మోత మోగించిన హిందీ చిత్రాలు లెక్కకు మిక్కిలి. అయితే కొన్నాళ్లుగా బాలీవుడ్ కథలు కాసులు కురిపించడం లేదు. అరకొర హిట్లతోనే బండి లాగించాల్సిన పరిస్థితి నిర్మాతలది. మల్టీస్టారర్‌లు, యాక్షన్ థ్రిల్లర్‌లు, లవ్ స్టోరీలు.. ఇలా జానర్ ఏదైనా బాక్సాఫీసు దగ్గర భంగపాటు తప్పడం లేదు. రొటీన్ కమర్షియల్ ఫార్ములా వర్కవుట్ అవ్వకపోవడంతో బాలీవుడ్ దర్శక నిర్మాతలు సక్సెస్ కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో భాగమే బయోపిక్ ట్రెండ్. ప్రముఖుల జీవిత చరిత్రలతో పలు సినిమాలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న హిందీ బయోపిక్‌లపై ఓ లుక్కేద్దాం.

ఈ ఏడాది మరి కొన్ని బయోపిక్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. దక్షిణాదిన బయోపిక్ ట్రెండ్ తగ్గుముఖం పట్టినా హిందీలో మాత్రం ప్రముఖుల జీవిత చరిత్రతో తెరకెక్కే చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. క్రీడా విజేతలు, సినీ, రాజకీయ ప్రముఖులు, సైన్యాధికారులు, సామాజిక కార్యకర్తల జీవితగాథల ఆధారంగా హిందీలో ప్రస్తుతం పలు బయోపిక్ చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి.

నిర్మాతగానా, నటుడిగానా?

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఉజ్వల్ నికమ్ జీవిత కథ ఆధారంగా హిందీలో ఓ చిత్రం తెరకెక్కనుంది. అవినాష్ అరుణ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం అమీర్‌ఖాన్ సొంత ప్రొడక్షన్‌లో తెరకెక్కుతోంది. ఆయనే టైటిల్ రోల్ పోషించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కానీ అధికారిక ప్రకటన రాలేదు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎన్నో సంచలన కేసులను వాదించి గెలిచిన ఘనత ఉజ్వల్ సొంతం. 1993 ముంబై పేలుళ్లు, గుల్షన్ కుమార్ తదితర కేసులను ఆయన టేకప్ చేశారు.

12th ఫెయిల్ చిత్రంలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు విక్రాంత్ మాసే. ఐపీఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మ జీవిత కథతో ఈ చిత్రం తెరకెక్కింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, అనేక కష్టనష్టాలకు ఓర్చి ఐపీఎస్‌గా ఎదిగిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతేడాది ఈ చిత్రం దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదలైంది. అన్నిచోట్లా చక్కటి ప్రేక్షకాదరణ పొందింది. విక్రాంత్ మాసే నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు మరో బయోపిక్‌లో నటించేందుకు విక్రాంత్ సిద్ధమయ్యారు.

ప్రఖ్యాత రచయిత రస్కిన్ బాండ్ ప్రేమ కథ ఆధారంగా రచయిత నిరంజన్ అయ్యంగార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో విక్రాంత్ మాసే టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం స్ర్కిప్ట్ వర్క్ జరుగుతోంది.

ప్రముఖ బాలీవుడ్ నృత్యదర్శకురాలు సరోజ్‌ఖాన్ బయోపిక్ తెరకెక్కుతోంది. భూషణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో అనేక సూపర్ హిట్ చిత్రాలకు ఆమె నృత్య దర్శకత్వం వహించారు. మూడు వేలకు పైగా పాటలకు కొరియోగ్రఫీ చేశారు. బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంతోమంది నృత్య దర్శకులను అందించారు. ఈ బయోపిక్‌కు హన్సల్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. సరోజ్‌ఖాన్ జీవితంలోని వివిధ దశలను ఈ చిత్రంలో చూపించబోతున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం స్ర్కిప్ట్ దశలో ఉంది. సరోజ్‌ఖాన్ పాత్రను మాధురీ దీక్షిత్ పోషించనున్నారని సమాచారం.

అనుపమ్‌ఖేర్ టైటిల్ పాత్రలో

నోబెల్ పురస్కార గ్రహీత, కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జీవితం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రంలో అనుపమ్ ఖేర్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ఫస్ట్‌లుక్‌ను ఇటీవలె విడుదల చేశారు. తెల్లటి జుట్టు, పొడవాటి గడ్డంతో ఠాగూర్ అవతారంలో అనుపమ్ ఆకట్టుకున్నారు. నటుడిగా ఆయనకు ఇది 538వ చిత్రం. గురుదేవుని పాత్ర పోషించే భాగ్యం దక్కడంతో నా జీవితం ధన్యమైందని అనుపమ్ సోషల్ మీడియాలో స్పందించారు. అనుపమ్ ఖేర్ గతంలో 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్రను పోషించారు. కంగనా రనౌత్ నటిస్తున్న 'ఎమర్జెన్సీ' చిత్రంలో ఆయన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ పాత్రలో కనిపించనున్నారు.



బాలీవుడ్‌కు సూరారై పొట్రు

ప్రముఖ వ్యాపారవేత్త, ఎయిర్‌డెక్కన్ వ్యవస్థాపకులు జీ ఆర్ గోపీనాథ్ జీవితచరిత్ర 'సింప్లి ఫ్లై' అనే పుస్తకం ఆధారంగా దర్శకురాలు సుధా కొంగర తెరకెక్కించిన చిత్రం 'సూరారై పొట్రు' తెలుగులో 'ఆకాశమే నీ హద్దు'. విలక్షణ నటుడు సూర్య ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రం పలు భాషల్లో చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. దక్షిణాది ప్రేక్షకులను ఈ సినిమా అమితంగా అలరించింది. దాంతో బాలీవుడ్ జనాలు అప్పుడే ఈ సినిమా రీమేక్ హక్కులపై కన్నేశారు. చాలామంది ప్రయత్నించినా చివరికి ఆ అవకాశం అక్షయ్‌కుమార్‌కు దక్కింది. రాధికా మదన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రీమేక్ చిత్రానికి కూడా సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్నారు.






కొన్నాళ్ల క్రితం దక్షిణాదినా ఉధృతంగా కొనసాగిన బయోపిక్ ట్రెండ్ ఇప్పుడు తగ్గిపోయింది. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ జానర్‌లో వచ్చే చిత్రాల సంఖ్య పెరుగుతుండడం విశేషం. నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు, రియల్‌లైఫ్ డ్రామా ఉండడంతో బయోపిక్ చిత్రాలు చేసేందుకు బాలీవుడ్ యువ హీరోలు ముందుకు వస్తున్నారు.

జూన్‌లో చాంపియన్ రాక

ఆర్మీలో అనుభవజ్ఞుడు, క్రీడల్లో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న మురళీకాంత్ పేట్కర్ లాంటి గొప్ప వ్యక్తి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'చందు చాంపియన్'. కార్తిక్ ఆర్యన్ హీరోగా కబీర్‌ఖాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోంది. 1970లో జరిగిన కామన్వెల్త్, 1972లో జరిగిన పారా ఒలంపిక్ క్రీడల్లో ఆయన బంగారు పతకాలు సాధించి భారతీయులకు గర్వకారణమయ్యారు. ఈ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. తొలిసారి కార్తిక్ ఆర్యన్‌తో శ్రద్ధాకపూర్ జోడీ కడుతున్నారు. ఈ ఏడాది జూన్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

తండ్రీ కొడుకుల కాంబినేషన్‌లో

అనిల్‌కపూర్ తనయుడు హర్షవర్ధన్‌కపూర్ టైటిల్ రోల్‌లో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతక విజేత షూటర్ అభినవ్ బింద్రా జీవితం ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. అభినవ్ ఆత్మకథ 'ఏ షాట్ ఎట్ హిస్టరీ: మై అబ్సెసివ్ జర్నీ టు ఒలింపిక్ గోల్డ్' ఆధారంగా ఈ బయోపిక్‌ను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. ఇందులో అభినవ్ తండ్రి పాత్రను అనిల్‌కపూర్ పోషిస్తున్నారని సమాచారం.

సుబ్రతారాయ్ జీవిత కథతో

సహారా పరివార్ గ్రూప్ వ్యవస్థాపకుడు దివంగత సుబ్రతారాయ్ వ్యాపారరంగంలో అంచెలంచెలుగా ఎదిగి, పెద్ద వ్యాపార సామ్రాజ్యానికి అధినేత అయిన తీరును 'సహార శ్రీ' చిత్రంలో చూపించబోతున్నారు. వివాదాస్పద చిత్రం 'ద కేరళ స్టోరీ' దర్శకుడు సుదీప్తో సేన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. డాక్టర్ జయంతి లాల్, సందీప్ సింగ్ నిర్మిస్తున్నారు. ఏ. ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సుబ్రతారాయ్ పాత్రను ఎవరు పోషిస్తున్నారో వెల్లడించాల్సి ఉంది.



కంగన ఎమర్జెన్సీ

మాజీ భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవితంలోని కీలక ఘట్టాలతో తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ'. బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ టైటిల్ పాత్ర పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. 1975 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను ఈ సినిమాలో చూపించనున్నారు. ఇందిరాగాంధీ పాత్రలో కంగన ఒదిగిపోయిన తీరు ప్రచార చిత్రాల్లో ఆకట్టుకుంటోంది. గతేడాది నవంబర్ 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా విడుదల వాయిదా పడింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారని తెలుస్తోంది.

మీనాకుమారిగా కృతీసనన్?

ఒకప్పటి బాలీవుడ్ ప్రముఖనటి మీనాకుమారి బయోపిక్ తెరకెక్కుతోంది. విషాదభరితమైన పాత్రల్లో మెప్పించిన మీనాకుమారి ట్రాజెడీ క్వీన్‌గా అభిమానుల్లో గుర్తింపు పొందారు. కెరీర్ మంచి దశలో ఉన్న సమయంలో ఆమె చనిపోయారు. ఈ బయోపిక్‌కు ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా దర్శకత్వం వహిస్తున్నారు. భూషణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్ర్కిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాదే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. మీనాకుమారి పాత్రను కృతీసనన్ పోషిస్తారని సమాచారం.

పంకజ్ త్రిపాఠి టైటిల్ పాత్రలో మాజీ భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కిన చిత్రం 'మై అటల్ హూ'. జనవరిలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.



సూర్యకాంతం మంచి మనసు

అగ్ర కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు ద్విపాత్రాభినయంలో రూపుదిద్దుకొన్న చిత్రం 'బుద్ధిమంతుడు'. ఆయనతో బాపు, రమణలు తీసిన తొలి చిత్రం ఇది. ఇందులో పూజారిగా, ఆధునిక భావాలు కలిగిన యువకుడిగా అక్కినేని పరస్పర విరుద్ధమైన రెండు పాత్రలను పోషించారు. ఈ సినిమాలో సూర్యకాంతం కూడా ఓ కీలక పాత్ర పోషించారు. చిత్రం అంతా పూర్తయ్యాక ఆమె ఇంటికి వెళ్లి నిర్మాత ముళ్లపూడి రమణ వెళ్లి పారితోషికం ఇవ్వబోతే 'ఇప్పుడిప్పుడే మీరు రంగంలోకి అడుగుపెట్టారు. నిలదొక్కుకుని వృద్ధిలోకి రండి. అప్పుడు తీసుకుంటా నా ఫీజు' అన్నారు సూర్యకాంతం. తెరపై పోషించే పాత్రలకు పూర్తి భిన్నంగా ఉండేవారు ఆమె. మద్రాసులో షూటింగ్ జరుగుతుంటే ప్రతి రోజూ తన ఇంటి నుంచి పులిహోర, చక్కెర పొంగలి, ఆవడలు తయారు చేసి పెద్ద క్యారేజీలో పెట్టుకుని తీసుకు వచ్చి అందరికీ పెట్టేవారు. ఆమె ఉంటే షూటింగ్‌లో ప్రతి రోజూ విందే.

చిన్న చిత్రాలలో పెద్ద విజయం

స్టార్స్ లేకుండా తీసిన ఓ సినిమా సైలెంట్‌గా హిట్ అయి సూపర్ షేర్స్‌తో 38 కేంద్రాల్లో వందరోజులు ఆడడమే కాదు సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం ఆ రోజుల్లో అందరినీ ఆశ్చర్య పరిచిన అంశం. ఆ సినిమా పేరు దేవి. ఆ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత ఎం.ఎస్. రాజు. పెద్ద హీరోలతో పెద్ద హిట్స్ తీయడం కంటే కథే హీరోగా, గ్రాఫిక్ వర్క్, స్పెషల్ ఎటాక్షన్ గా అతున్నత సాంకేతిక విలువలతో ఓ సినిమాను నిర్మించి ఘన విజయం సాధించడం గొప్ప విషయమే. నిజం చెప్పాలంటే అలాంటి విజయంలో ఎంతో థ్రిల్ ఉంటుంది. మాటల్లో చెప్పలేనంతఆత్మసంతృప్తి ఉంటుంది. అదో రకమైన కిక్ ఉంటుంది.



మలయాళ నటుడు సిజ్జు హీరోగా నటించిన 'దేవి' చిత్రంలో సీనియర్ హీరోయిన్ మంజుల కుమార్తె వనిత కథానాయికగా నటించారు. భానుచందర్, బాబూమోహన్, షావుకారు జానకి ఇతర ముఖ్య పాత్రలను పోషించిన ఈ సినిమాలో ప్రేమ నాగదేవతగా నటించారు. మిగిలిన పాత్రలను కొత్త నటీనటులు పోషించారు. 'దేవి' చిత్రాన్ని ప్రారంభించి, కోట్లాది రూపాయలు ఆ సినిమా మీద ఖర్చు పెడుతున్నప్పుడు నిర్మాత ఎం.ఎస్. రాజును చూసి చాలా మంది రకరకాలుగా కామెంట్స్ చేశారు. ప్రాజెక్టు డిలే అవుతున్నకొద్దీ 'హని' (ఎంఎస్. రాజును పరిశ్రమలో అందరూ ఇలాగే పిలుస్తారు) ఓవర్ కాన్ఫిడెన్స్‌తో అనవసరంగా ఈ సినిమా మొదలు పెట్టాడు... దెబ్బ తింటాడు' అని. అయినా ఆ కామెంట్స్‌కు ఏ మాత్రం ఇరిటేట్ అవకుండా తన సర్వ శక్తుల్నీ 'దేవి' చిత్రం మీదే కేంద్రీకరించారాయన. ఆ చిత్ర నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా భావించి, హిట్ కొట్టాలనే కసితో కృషి చేశారు దర్శకుడు కోడి రామకృష్ణ.

తెలుగు తెరపై అంతకుముందు ఎన్నడూ చూడని స్పెషల్ ఎఫెక్ట్స్ 'దేవి' చిత్రంలో కనిపించడంతో 1999 మార్చి 12న విడుదలైన ఈ చిత్రం చూసి ఆడియన్స్ థ్రిల్ అయ్యారు. దాంతో తొలి రోజు నుంచే వసూళ్ల ప్రభంజనం మొదలైంది. ఈ సినిమా కొనుక్కున్న బయర్లు రూపాయికి రూపాయి లాభం చూశారు.

ఇండస్ట్రీ పుట్టి పెరిగాక సూపర్ సిక్స్‌గా గుర్తింపు పొందిన చిత్రాల్లో ఒకటిగా దేవి నిలిచింది. అయితే మిగిలిన ఐదు చిత్రాలూ భారీ తారాగణంతో తయారైనవే. తమిళంలోకి ఈ చిత్రాన్ని డబ్ చేశారు. కర్ణాటక లో తెలుగు వెర్షన్ విడుదల చేశారు. తమిళ, కర్ణాటక రాష్ట్రాల్లో 22 కోట్ల రూపాయల షేర్ సంపాదించి దేవి సంచలనం సృష్టించింది. హిందీలో కూడా దేవి విశ్వరూపం చూపించింది.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సండర్‌లెండ్ టిల్ ఐ డై	వెబ్‌సిరీస్ 3	ఫిబ్రవరి 13
లవ్ ఈజ్ బ్లైండ్	వెబ్‌సిరీస్ 6	ఫిబ్రవరి 14
ప్లేయర్స్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 14
ఐన్‌స్టీన్ అండ్ ది బాంబ్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 16
అమెజాన్ ప్రైమ్		
ఫైవ్ బ్లైండ్ డేట్స్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 13
దిస్ ఈజ్ మీ...నౌ	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 16
జీ 5		
క్వీన్ ఎలిజబెత్	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 14
ది కేరళ స్టోరీ	హిందీ డబ్బింగ్	ఫిబ్రవరి 16
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ట్రాకర్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 12
సబ నయగన్	తమిళ చిత్రం	ఫిబ్రవరి 14
ఓజ్లర్	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 15
నా సామిరంగ	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 17
సలార్	హిందీ డబ్బింగ్	ఫిబ్రవరి 16
సోనీ లివ్		
రాయ్ సింఘాని వర్సెస్ రాయ్‌సింఘాని	హిందీ సిరీస్	ఫిబ్రవరి 12
ఆహా...		
వీరమారి లవ్‌స్టోరీ	తమిళ చిత్రం	ఫిబ్రవరి 14
ఆపిల్ టీవీ ప్లస్		
ది న్యూ లుక్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 14

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 11 ఫిబ్రవరి 2024

బయోటెక్నాలజీ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు ఉద్దేశించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (జీఏటీ-బీ) 2024, అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్దేశించిన బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) 2024లకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల సిలబస్, పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, సీట్ల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.



బయోటెక్నాలజీలో ప్రవేశానికి జీఏటీ-బీ/ బీఈటీ

జీఏటీ-బీ

ఈ ఎగ్జామ్ ద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్స్/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందే అవకాశం లభిస్తుంది. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయోటెక్నాలజీ/ సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ) 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ(మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/అగ్రికల్చర్/వెటర్నరీ/ఫిషరీస్/ఫార్మసీ/ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)/ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీపీటీ/బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ ఇంజనీరింగ్/ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్)/బీఎఫ్ఎస్సీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(సైన్స్/అప్లయిడ్ సైన్స్)ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ-బీ) వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో 60 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు రెండో సెక్షన్‌లో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలనుంచి డిగ్రీ స్థాయిలో 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 240. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు కోర్సును అనుసరించి స్టయిపెండ్ ఇస్తారు. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ & సంబంధిత విభాగాలు) అభ్యర్థులకు నెలకు రూ.5,000; ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ అభ్యర్థులకు నెలకు రూ.7,500; ఎంటెక్/ఎంవీఎస్సీ అభ్యర్థులకు నెలకు రూ.12,000 చెల్లిస్తారు.

బీఈటీ

ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండు కేటగిరీల్లో మెరిట్ లిస్ట్‌లను రూపొందిస్తారు. మొదటి కేటగిరీ అభ్యర్థులకు డీబీటీ జేఆర్ఎఫ్ లభిస్తుంది. వీరు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫెలోషిప్ లెటర్ అందుకొన్న రెండేళ్లలోపు వీరు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాల్సి ఉంటుంది. రెండో కేటగిరీ అభ్యర్థులను డీబీటీ స్పాన్సర్డ్ ప్రాజెక్టుకు ఎంపిక చేస్తారు. దీనిని నెట్/గేట్ అర్హతకు సమానంగా పరిగణిస్తారు. డీఎస్‌టీ నిబంధనల ప్రకారం వీరు కూడా పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి డీబీటీ ఫెలోషిప్ లభించదు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/బయోమెడికల్/బయో ఇన్ఫర్మాటిక్స్/ బయోకెమిస్ట్రీ/బయోఫిజిక్స్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటేషనల్ బయాలజీ/జెనెటిక్స్/మైక్రో బయాలజీ/ జువాలజీ స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 28 ఏళ్లు; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు మించకూడదు.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) వివరాలు: ఇందులో కూడా రెండు సెక్షన్‌లు ఉంటాయి. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి సెక్షన్‌లో జనరల్ సైన్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో బయోటెక్నాలజీ అంశాల నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండు సెక్షన్లలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **కరక్షన్ విండో ఓపెన్:** మార్చి 8, 9
- **పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్
- **జీఏటీ-బీ/బీఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.nta.ac.in

మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ యూజీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యూజీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/అనుబంధ మెడికల్/డెంటల్/ఆయుష్ కళాశాలలు; డీమ్డ్ యూనివర్సిటీలు; ఎయిమ్స్, జిప్మర్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆలిండియా కోటా కింద 15 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈ ఏడాది పరీక్ష సిలబస్‌ను తగ్గించారు. నూతన సిలబస్ వివరాలను నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు 2007 డిసెంబరు 31లోపు జన్మించి ఉండాలి. అడ్మిషన్ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. విదేశీ విద్యార్థులు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) నిబంధనల మేరకు నిర్దేశిత సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

నీట్ యూజీ వివరాలు: ఈ పరీక్షని ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, గుజరాతీ, బెంగాలీ, అస్సామీ భాషల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇంగ్లీష్‌ను ఎంచుకొంటే ఆంగ్ల భాషలో మాత్రమే ప్రశ్నపత్రాన్ని ఇస్తారు. మిగిలినవాటికైతే ఎంచుకొన్న లాంగ్వేజ్‌తో పాటు ఇంగ్లీష్‌లో కూడా ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎగ్జామ్‌లో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 35 ప్రశ్నలు ఇస్తారు. వీటన్నింటికి సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో 15 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా పదింటికి సమాధానాలు గుర్తించాలి. పది కంటే ఎక్కువ ప్రశ్నలకు ఆన్సర్ గుర్తిస్తే మొదటి పది సమాధానాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు సమాధానాలను బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 720. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 9
- **నీట్ యూజీ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల:** జూన్ 14
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/NEET

లిటిల్స్



గాడిద చదువు

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలోకి ఓ పెద్ద మనిషి సుదూర ప్రాంతాలనుంచి వచ్చాడు. తాయత్తులు, విభూతితో సన్యాసిలా ఉన్నాడు. అయితే అతనికి మంచి విషయ పరిజ్ఞానం ఉంది. పైగా తాను వేదపండితుడిని అని చెప్పాడు. గొప్ప విద్వాంసుడు అని ఇతర దేశాల వారు పిలుస్తారని చెప్పుకొన్నాడు. అందరూ ఆయన గురించి ప్రశంసించారు. ఇలా వారి నోటా వీరి నోటా పడి రాజుగారికి తెలిసింది.

రాజుగారు ఆ పెద్ద మనిషిని ఆహ్వానించాడు. ఆ పెద్ద మనిషి ఏవో పద్యాలతో రాజుగారిని పొగిడారు. 'మీరు మహా విద్వాంసులట. ఎవరికైనా విద్య నేర్పగలరట. మీలాంటి గొప్ప వాడు ఈ దరిదాపుల్లో లేరట' అన్నారు రాజుగారు. 'ధన్యవాదాలు మహారాజా.. మీరు నన్ను గుర్తించినందుకు. నేను ఎవరికైనా వేదాలను బోధించగలను. ఆ మాటకొస్తే గాడిదకు కూడా వేదాలు నేర్పించే శక్తి నాకుంది' అన్నాడు. వెంటనే రాజుగారు మీసం దువ్వి.. 'మన రాజ్యంలో పనికి మాలిన గాడిద ఒకటి ఉంది. దానికి అరవటమే తెలుసు' అన్నాడు. 'ఆ గాడిదకు వేదం నేర్పుతా మహారాజా' అంటూనే ఆ పెద్దాయనను కరతాళ ధ్వనులు వినపడ్డాయి.

వెంటనే రాజావారు ఆ గాడిదను తెప్పించారు. 'అయ్యా.. పెద్ద మనిషి ఈ గాడిదకు వేదం నేర్పాలి' అన్నాడు. 'చిత్తం మహారాజా' అన్నాడు. 'ఎన్నేళ్లు పడుతుంది' అని అడిగాడు. 'పదేళ్ల సమయం చాలు' అన్నాడు పెద్ద మనిషి. 'అయితే బుద్ధిగా ఈ గాడిదకు నేర్పించు' అంటూ పరాచకం ఆడినట్లు మాట్లాడారు రాజుగారు. ఆ తర్వాత ఇంకో మాట.. అంటూ రాజుగారు ఇలా అన్నారు. 'నీవు కాని ఈ గాడిదకు వేదం నేర్పించకపోతే నీ తలను ఖండించి.. శరీరాన్ని రెండు భాగాలుగా చీల్చేస్తాను' అన్నాడు. రాజుగారి పౌరుషం, కోపం చూసి అందరూ సభలో అదిరి పడ్డారు. 'మహారాజా.. మీ మాట వేదవాక్కు. మీరు చెప్పినట్లే నడుచుకుంటా. అయితే నెలకు వెయ్యి వరహాలు నాకు ఇవ్వాల్సి ఉంటుంది. గురుదక్షిణ మరి' అన్నాడు. 'ఇదేమి స్థితి' అన్నారంతా. 'అవును.. దానికి తిండి. వాక్ శుద్ధి నేర్పించటానికి ఈ ధనం తక్కువే' అన్నాడు. 'అంతేనా.. నెలకు వెయ్యి వరహాలు తీసుకో' అన్నాడు. పెద్ద మనిషి సంతోషంతో వెనుదిరిగాడు.

ఆ పెద్ద మనిషికి సన్నిహితుడైన ఓ వ్యక్తి ఆ సభలో ఉన్నాడు. వేగంగా పెద్ద మనిషి దగ్గరకు పోయాడు. 'గాడిదను తీసుకువచ్చే బాధ్యత నీదే' అన్నాడు తన మిత్రుడితో. ఇంటికి వెళుతూ తన మిత్రుడు పెద్ద మనిషిని అడిగాడు. 'ఈ గాడిద వేదం నేర్చుకోదు. చదవలేదు. ఈ పిచ్చి మాటలు మాట్లాడావెందుకూ. నీ తల పోతుంది' అన్నాడు. 'పిచ్చివాడా.. నెలకు ఎలానూ వెయ్యి వరహాలు వస్తాయి. పైగా పదేళ్ల పాటు హాయిగా ఉండొచ్చు. పదేళ్లకు ఆ రాజుగారు ఉంటారో లేదో! ఆ మాటకొస్తే ఆ గాడిద బతికి ఉంటుందో లేదో తెలీదు' అన్నాడు. 'బావుంది.. గాడిద చదువు' అన్నాడు ఆ పెద్దమనిషి మిత్రుడు.

చుక్కలు కలిపి రంగులు వేయండి




7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 227

			5	2			1	4
6		1		7				
						2		
	8	4	9					
	6						4	
					8	7	2	
		6						
				4		3		5
7	4			1	6			

సుడోకు - 226 సమాధానం

8	9	6	3	1	7	5	4	2
1	7	2	4	5	8	6	9	3
3	4	5	6	2	9	8	1	7
4	2	8	9	6	1	3	7	5
6	5	3	2	7	4	1	8	9
7	1	9	5	8	3	4	2	6
9	8	7	1	3	6	2	5	4
5	6	1	7	4	2	9	3	8
2	3	4	8	9	5	7	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం ఇండియన్ జాగ్రఫీ

నీటి పారుదల

పంటలకు కృత్రిమంగా నీటి వసతిని కల్పించడాన్నే నీటి పారుదల అంటారు. 1950-1951లో నీటి పారుదల వసతులు 22.6 మిలియన్ హెక్టార్లకు కల్పించగా... ప్రస్తుతం 139.89 మిలియన్ హెక్టార్లకు నీటి సౌకర్యం ఉంది.

భారతదేశంలో నీటి పారుదల ప్రధానంగా మూడు మార్గాలపై ఆధారపడి ఉంది. అవి.. బావులు, కాలువలు, చెరువులు.

బావులు: భారతదేశంలో అత్యధికంగా(62 శాతం) నీటి పారుదల బావుల ద్వారానే కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, శాతం పరంగా గుజరాత్‌లో అధికంగా నీటి పారుదల వసతులున్నాయి. బావులు రెండు రకాలు... గొట్టపు బావులు, సాధారణ బావులు. ఉత్తరప్రదేశ్‌లో బావులు అత్యధికంగా ఉన్నాయి.

కాలువలు: భారతదేశంలో 24 శాతం నీటి పారుదల కాలువల ద్వారా సమకూరుతోంది. విస్తీర్ణపరంగా ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్; శాతంపరంగా పంజాబ్‌లో అధికంగా కాలువల ద్వారా నీటి పారుదల కల్పిస్తున్నారు.

చెరువులు: దేశంలో 3 శాతం నీటి పారుదలను చెరువుల ద్వారా కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; శాతం పరంగా తమిళనాడులో అధికంగా చెరువుల ద్వారా నీటి పారుదుల సౌకర్యం ఉంది. చెరువులు ప్రధానంగా దక్షిణ భారతదేశంలోనే ఉన్నాయి. అత్యధిక నీటి పారుదల సాంద్రత పంజాబ్‌లో ఉంది. అత్యల్ప నీటి పారుదల సాంద్రత మిజోరంలో కలదు. ఇక భారతదేశంలో ఇతర నీటిపారుదల వసతులు 11.07 శాతం ఉన్నాయి.

ఆనకట్ట రకాలు

1. భూభాగ నిర్మాణం ఆధారంగా

చెక్ డ్యామ్స్: చిన్న చిన్న నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించేవి

డైవ్ డ్యామ్స్: వర్షాభావ ప్రాంతాల్లో నేలల సంరక్షణ కోసం ప్రవాహ దిశను మళ్లిస్తూ నిర్మించేవి.

సాడిల్ డ్యామ్స్: ప్రధాన ఆనకట్ట కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా నిర్మించే ఆనకట్టలు

డైక్ డ్యామ్స్: సాడిల్ ఆనకట్ట లక్షణాలతో ప్రధాన ఆనకట్టను పోలివుండే వాటిని డైక్ డ్యామ్స్ అంటారు.

కాఫర్ డ్యామ్స్: నీటిలో మునిగి ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేయడానికి ఆ నీటిని తొలగించడం కోసం నిర్మించే డ్యామ్స్


ఓవర్ ఫ్లో డ్యామ్స్: నది నుంచి లేదా ఆనకట్ట నుంచి ప్రవహిస్తున్న నీటిని శాస్త్రీయంగా లెక్కించడానికి నిర్మించే ఆనకట్టలు

2. డిజైనింగ్, ఇంజనీరింగ్ ఆధారంగా

గ్రావిటీ డ్యామ్స్: భారీ కాంక్రీట్ డ్యామ్‌లను గ్రావిటీ డ్యామ్‌లు అంటారు. లోతైన పునాదులతో నిర్మిస్తారు.

ఆర్చ్ డ్యామ్స్: వి ఆకారంలో ఉండే నదీలోయలకు అడ్డంగా నిర్మిస్తారు.

ఉదా: ఇడుక్కి-కేరళ(ఎత్తు 169 మీ.)



ఎమ్ బ్యాంక్ మెంట్ డ్యామ్స్: రాళ్ల మధ్య ఖాళీలను మట్టి లేదా కాంక్రీట్‌తో పూడ్చుతారు. వీటిలో ఎర్త్ ఫిల్ డ్యామ్, రాక్ ఫిల్ డ్యామ్, రబ్బర్ డ్యామ్, ఆస్ఫాట్ డ్యామ్ ఉన్నాయి.

3. నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా/ ఆయకట్టుకు నీటిని అందించే సామర్థ్యం ఆధారంగా

భారత ప్రణాళికా సంఘం మన దేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులను ఆయకట్టు ప్రాంతం ఆధారంగా మూడు విధాలుగా వర్గీకరించింది.

భారీ తరహా ప్రాజెక్ట్: 10,000 హెక్టార్ల కన్నా ఎక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

మధ్య తరహా ప్రాజెక్ట్: 2,000- 10,000 హెక్టార్ల మధ్య సాగుభూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

చిన్న తరహా ప్రాజెక్ట్: 2,000 హెక్టార్ల కంటే తక్కువ సాగుభూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

ప్రధాన ప్రాజెక్టులు

దామోదర్ వ్యాలీ

- దామోదర్, దాని ఉప నదులపై నిర్మించిన నాలుగు ప్రాజెక్టులను కలిపి దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అని పిలుస్తారు.
- 1948లో దేశంలో మొట్టమొదటి వరద నియంత్రణ కార్యక్రమంగా దామోదర్ వ్యాలీ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టు అమలు కోసం 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'(డీవీసీ) అనే సంస్థను ఏర్పాటు చేశారు.
- డీవీసీకి సహాయపడిన సంస్థ టెన్నిస్ వ్యాలీ అథారిటీ
- డీవీసీలో భాగంగా ఊర్దిన్ ప్రతిపాదించిన డ్యామ్‌ల సంఖ్య 7
- ఇప్పటి వరకు నాలుగు డ్యాములను నిర్మించారు. అవి.. కోనార్(కోనార్ నదిపై), పాంచెట్(దామోదర్ నదిపై), తిలయ(బారకార్ నదిపై), మైదాన్(బారకార్ నదిపై).
- ఊర్దిన్ అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ అథారిటీ చైర్మన్
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ నమూనాను పోలి ఉంటుంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **నిర్మాణం ప్రారంభం అయిన సంవత్సరం:** 1955 డిసెంబరు 10
- **నిర్మాణం పూర్తి:** 1967 ఆగస్టు 4. ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టును కృష్ణా నదిపై నందికొండ గ్రామం(నల్లగొండ) వద్ద నిర్మించారు.
- **దీని నిర్మాణ ఇంజనీర్:** కానూరి లక్ష్మణ రావు
- డ్యామ్ నిర్మాణానికి కేంద్రం ఖోస్లా కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ వ్యాఖ్యానించారు.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి ఆనకట్ట. **ఎత్తు:** 124.7 మీటర్లు, **పొడవు:** 1550 మీ. నీటి నిల్వ **సామర్థ్యం:** 408 టీఎంసీలు. స్థాపిత విద్యుత్ **సామర్థ్యం:** 826 మెగా వాట్లు.
- ఈ ప్రాజెక్టుకు రెండు కాలువలు ఉన్నాయి. ఒకటి జవహర్ లాల్ నెహ్రూ కాలువ(కుడి కాలువ)- దీని పొడవు 203 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీటి వసతులను కల్పిస్తుంది. రెండోది లాల్ బహదూర్ శాస్త్రి కాలువ(ఎడమ కాలువ)- దీని పొడవు 296 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరు, జిల్లాలకు; తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాకు సాగునీటి వసతులను కల్పిస్తుంది.

ఇందిరా గాంధీ కాలువ

- దీనిని రాజస్థాన్ కాలువ అని కూడా పిలుస్తారు. దీనిలో సట్లెజ్, రావి, బియాస్ మూడు నదుల నీరు ప్రవహిస్తుంది. దీని ప్రధాన కాలువ హరికే బ్యారేజ్ నుంచి ప్రారంభమవుతుంది. ఉప కాలువలు బియాస్, రావి నదుల నుంచి ప్రారంభమవుతాయి. దీని ప్రధాన కాలువ పొడవు: 650 కి.మీ. ఇది మూడు రాష్ట్రాలకు నీటి వసతులను కల్పిస్తుంది. పంజాబ్‌లో 167 కి.మీ., హర్యానాలో 38. కి.మీ., రాజస్థాన్‌లో 445 కి.మీ. ప్రవహిస్తుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలోని గంగానగర్, బికనీర్, జైసల్మేర్, జోధ్‌పూర్ వరకు నీటి వసతులను కల్పిస్తుంది. ఇది దేశంలోనే అతి పొడవైన వ్యవసాయ కాలువ.

నోట్: ప్రపంచంలో అత్యంత పొడవైన వ్యవసాయ కాలువ: ద గ్రాండ్ కెనాల్ - చైనా - 1776 కి.మీ. (బీజింగ్ నుంచి హాంగ్ జంగ్ నగరం వరకు కలదు).



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ